1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 4
సంచిక : 6
పుటలు :52
రు. 20 లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

ఆగస్టు 2018

నాడు
పండితుల
భాషాధిపత్యవాదాన్ని
ఓడించి
ప్రజల తెలుగుకు
పట్టంగట్టిన
'గిడుగు' స్ఫూర్తితోనే
నేటి
తెలుగుభాషోద్యమం



పరభాషలకూ
కార్పొరేట్ శక్తులకూ
ఊడిగంచేస్తూ
ప్రజల భాషను
అణచి వేస్తున్న
పాలక వర్గాలపై
పోరాటమే
నేటి
తెలుగుభాషోద్యమం

## గిడుగు రామ్మూర్తి 155వ జయంతి: తెలుగు భాషాదినోత్సవం













ఆం.ప్ర. తెలుగుభాషాభివృద్ధి ప్రాధికార సంస్థను స్వాగతిద్దాం

# తెలుగుభాషాభివృద్ధి ప్రాధికార సంస్థకు
## చట్టబద్ధత కల్పించండి
## సదస్సు



**గిడుగు 155 వ జయంతి – తెలుగు భాషాదినోత్సవం**

# పిలుపు

ఎన్నో ఏండ్లుగా తెలుగుభాషోద్యమ సమాఖ్య చేస్తున్న పోరాటం వల్ల – ప్రభుత్వం 'తెలుగుభాషాభివృద్ధి ప్రాధికార సంస్థ'ను స్థాపించడానికి ఒప్పుకొంది. 2016 తెలుగుభాషా దినోత్సవం(ఆగస్టు 29) నాడు అందుకోసం ముఖ్యమంత్రి గౌ॥ శ్రీ నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వ ప్రతినిధులతో, అధికారులతో ఒక కమిటీని ప్రకటించారు. ఆ తర్వాత 2017లో అదే సందర్భంగా జరిగిన సభలో (ఆగస్టు 29) ముఖ్యమంత్రిగారు రానున్న శాసన సభ సమావేశాలలో బిల్లును ప్రవేశపెట్టి పటిష్టమైన చట్టాన్ని తేనున్నామని ప్రకటించారు. కానీ, ఇప్పుడు 2018 జూలై 10న 40 వ నెంబరు జి.ఒ. ద్వారా ప్రాధికార సంస్థను ఏర్పాటు చేస్తూ విధి విధానాలను ప్రకటించారు. దీన్నిబట్టి ఇది ఇక చట్టంగా రాబోదన్న అభిప్రాయాన్ని కొందరు పెద్దలు వ్యక్తం చేస్తుంటే, ఆలస్యాన్ని నివారించి వెంటనే పని మొదలు పెట్టేందుకే జి.ఒ.ను ఇచ్చారని, తర్వాత చట్టంగా తెచ్చుకోవచ్చునని అధికారులంటున్నారు. జి.ఒ. ప్రకారం ఈ బిల్లు 18-07-2018 నుండి అమలులోకి వచ్చింది.

**అసలు ప్రాధికార సంస్థ అంటే ఏమిటో, దాని ఉపయోగం ఏమిటో తెలియనివాళ్ళు అనేకులున్నారు. ఈ పరిస్థితుల్లో మళ్లీ 'ఆగస్టు 29' రాబోతున్నది. ఈ జి.ఒపై మనం పరిశీలన, చర్చ జరపాలి. మన అభిప్రాయాలను, సూచనలను, ప్రభుత్వం ముందుంచాలి. ఇందుకోసం ఆగస్టు 26 ఆదివారంనాడు గుంటూరులో ఒక సదస్సును నిర్వహిస్తున్నాం.**

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు అభివృద్ధికై కృషి చేస్తున్న, ప్రోత్సహిస్తున్న సంస్థలు, ఆసక్తిగల వ్యక్తులు అందరూ సభలో పాల్గొనగోరుతున్నాము. తమ సూచనలను ప్రతిపాదనలను ఈ క్రిందివారికి కనీసం 3 రోజుల ముందుగా అందజేయగోరుతున్నాము.

**గౌ॥ మంత్రులను, అధికారులను, పెద్దలను**
**ఈ సభలో పాల్గొనగోరుతూ ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నాము.**

**వేదిక : శ్రీపద్మావతీ కళ్యాణ వేదిక– శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం**
**బృందావన్‌గార్డెన్స్ 5వ లైను, గుంటూరు – 6**
**తేదీ, సమయం : 26-8-2018 ఉదయం గం. 10 నుండి సా॥ గం.4 వరకు**

భాషోద్యమకారులు, అభిమానులు, ప్రజా ఉద్యమ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు,
రచయితలు, భాషోద్యమ సంఘాల ప్రతినిధులు, – ఆసక్తిగల వారందరికీ ఇదే ఆహ్వానం.

**గమనిక** :ఇది ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కార్యక్రమం మాత్రమే. ఆసక్తిగల పొరుగు రాష్ట్రాలలోని తెలుగువారు కూడా పాల్గొనవచ్చును.


## తెలుగుభాషోద్యమ సమాఖ్య

కేంద్ర అధ్యక్షుడు : డా॥సామల రమేష్‌బాబు, 9848016136
ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి : డా॥వెన్నిసెట్టి సింగారావు, 9393015584

*e-mail* : samalarameshbabu@gmail.com
editorammanudi@gmail.com


విజయవాడ, 1 ఆగష్టు 2018

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : **డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు,**
**డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్,**
**సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి**


◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...



**ఆగస్టు 2018**

## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి editorammanudi@gmail.com కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంప లేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముం దుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించ లేము.

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

## లోపలి పుటలలో....


**సంపాదకహృదయం :** తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను స్వాగతిద్దాం **7**
**ప్రభుత్వ ఉత్తర్వు :** ప్రాధికార సంస్థకై జి.ఒ. ఎం.ఎస్.40/10-7-2018 **9**
**తెలుగులో చట్ట నిర్మాణం :** అధికార భాషగా తెలుగు – చట్ట నిర్మాణం...**కీ.శే. జె. వీరాస్వామి** **14**
**కంప్యూటర్లు – తెలుగు :** తెలుగు భాషకు ఆధునిక హోదా – 7 **వీవెన్** **17**
**వందేళ్ళ పండుగ :** తెలుగువారి నట సార్వభౌముడు... **డా॥ కత్తి పద్మారావు** **19**
**సాహిత్యరంగం :** తెలుగు వచన రచన.... **ఆచార్య మధురాంతకం నరేంద్ర** **28**
**వేమన :** శబ్ద గాండీవి వేమన....**కీ.శే.దుర్గానంద్** **30**
**పిట్ట చూపు :** దళితులలో అభద్రతా భావం ఎందుకు **చలసాని నరేంద్ర** **46**
శ్రీ రామా రూరల్ విద్యా సంస్థలు – 70 ఏళ్ల ప్రస్థానం **48**
**చరిత్ర దినోత్సవం :** డిసెంబర్ 9 : ఆంధ్ర చారిత్రక దినోత్సవంగా ప్రకటించాలి **50**

**ధారావాహికలు :**
**2. బౌద్ధం-వైజ్ఞానిక మార్గం -16** ..... బొర్రా గోవర్ధన్ **38**
**1. మౌనంలోని మాటలు 10 :** సంచారి రావోళ్ళ నాగప్ప ఆత్మకథ – **ఆర్.బి.కుమార్,రం.రామచంద్రరావు** **41**

**భాషోద్యమ కథానికలు :**
**1. శపథం** ..... చెన్నూరి సుదర్శన్ **25**
**2. అనుబంధం** సింహ ప్రసాద్ **34**



రేఖా చిత్రాలు : **పావులూరి చిదంబరేశ్వరరావు**
కంప్యూటరీకరణ : **లంకె జనార్దన్**


'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలు కొందరు వాట్సప్ (Watsup) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు ఆమోదించజాలమని తెలుపుతున్నాము. దయచేసి పోస్టులోగాని, లేదా editorammanudi@gmail.com కుగాని పంపించండి.

– సంపాదకుడు


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:
సంపాదకుడు: **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం,విజయవాడ-520004.
కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com



...ంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక
# అమ్మనుడి
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు

## చందా వివరాలు

| | | వ్యక్తులకు | సంస్థలకు | విదేశీయులకు |
|---|---|---|---|---|
| శాశ్వత చందా | : | రూ.5000 | రూ.7500 | -- |
| 5 సం॥ | : | రూ.1000 | రూ.1500 | 150 డాలర్లు |
| 3 సం॥ | : | రూ. 700 | రూ.1000 | 75 డాలర్లు |
| 1 సం॥ | : | రూ. 240 | రూ. 400 | 25 డాలర్లు |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేటట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**AMMA NUDI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **915020010550189**

**IFSC Code : UTIB0000556**

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

**చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.**

## చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

**'అమ్మనుడి'** ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది

**నవోదయ బుక్ హౌస్,** ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా.**హైదరాబాదు - 27.** ఫోన్ :040-24652387

**మైత్రీ బుక్‌హౌస్,** జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

**మణి బుక్‌స్టాల్,** షాప్ నెం.58, సండేమార్కెట్, **నెల్లూరు**-1. ఫోన్:7386223538.

## హెచ్చరిక

'అమ్మనుడి' పత్రిక సిసి-బై-ఎస్ఎ లైసెన్సు (క్రియేటివ్ కామన్స్ - అట్రిబ్యూషన్ షేర్ అలైక్) లో ప్రచురితమవుతున్నది. దీని ప్రకారం ఈ పత్రికలో ప్రచురించిన వాటిని తిరిగి స్వేచ్ఛగా ఎవరైనా తమ రచనల్లో వినియోగించుకొని స్వయంగా గాని, ఇతరుల ద్వారా గాని, సోషల్ మీడియాలో గాని వాటిని ప్రచురించుకోవచ్చు. అయితే, ఆ సందర్భంలో - ఆ తొలి రచయిత పేరును, 'అమ్మనుడి' ఫలానా సంచిక నుండి తీసుకున్నట్లూ తప్పక ఉటంకించాలి. దయచేసి ఈ అంశాన్ని రచయితలు, ప్రచురణ కర్తలు, చదువరులు గమనించ గోరుతున్నాము

అమ్మభాష తెలుగును కాపాడుకొనే ఉద్యమంలో భాగంగా భాషాప్రాధాన్యతను తెలిపే

# కథానికలకు ఆహ్వానం

ఈ వేగయుగంలో క్లుప్తతకి ప్రాధాన్యమిస్తూ బుల్లెట్లలా పాఠకుల మెదళ్ళని తాకి కదిలింపజేసి ఆలోచనలలో ముంచెత్తేట్టు చేయగల బలమైన సాహిత్యప్రక్రియ కథానిక. కథ వస్తువైతే, దానిని కళాత్మకంగా మలచి చెప్పే ప్రక్రియ కథానిక. దీనిని చదవడానికి పట్టే సమయంకన్నా ఆలోచింపజేసే సమయం ఎక్కువ. అందుకే అమ్మభాష ప్రాధాన్యం అన్ని కోణాలలో అందరి మనసులలో నాటుకునేట్టు చెప్పే కథానికల్ని వరుసగా **అమ్మనుడి**లో ప్రచురిస్తున్నాం.

ప్రభుత్వ పరిపాలనలో, కోర్టు వ్యవహారాల్లో, నిత్యజీవితంలో తెలుగును కోల్పోతున్నందువల్ల జరిగే నష్టాల్ని కథావస్తువులుగా తీసుకోవచ్చు. అన్నిటికీ మించి విద్యారంగంలో తెలుగును సమూలంగా అణచివేస్తున్నందువల్ల తెలుగు పిల్లలకు - మొత్తంగా తెలుగు జాతికి - కలిగే నష్టాల్ని చిత్రిస్తూ కథానికలను వ్రాయవచ్చు. ఈ కోణాల్లో ఆలోచిస్తే రచయితలకు ఎన్నో కథాంశాలు కన్పిస్తాయి. 'అమ్మనుడి'లో ప్రచురిస్తున్న వ్యాసాల నుంచి ఇలాంటి అంశాలను గ్రహించవచ్చు. ఇందుకు రచయితల, రచయిత్రుల సహకారాన్ని కోరుతున్నాము. ప్రచురించే ప్రతి కథానికకు గౌరవ పారితోషికం పంపిస్తున్నాము.

- కథానిక ప్రచురణలో 2నుండి 4 పుటలకు మించకుండా ఉంటే మంచిది. ప్రతినెలా 1 లేక 2 కథానికలను మాత్రం ప్రచురించగలం.
- ప్రముఖ కథానికారచయిత **డా.వేదగిరి రాంబాబు** ఈ శీర్షికను **అమ్మనుడి** కోసం నిర్వహిస్తున్నారు.

సంపాదకుడు, **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520 004. ఫోన్ : 9848016136.
e-mail : editorammanudi@gmail.com

# తెలుగుజాతి (ట్రస్టు)

20 ఏళ్లపాటు తెలుగు ప్రజల అభ్యున్నతికి అంకితమై అందరి అభినందనలను పొందిన 'నడుస్తున్న చరిత్ర' మాసపత్రిక 2013 నవంబరు నుండి అనివార్య కారణాలవల్ల ఆగిపోయింది. ఆ పరిస్థితుల్లో – పత్రికను తిరిగి కొనసాగించాలనీ, దానితోపాటు తెలుగు భాషా వికాసం కోసం, భాషోద్యమ చైతన్యాన్ని ప్రజల్లో పెంపొందించడం కోసం సరికొత్త పుస్తకాలను వెలువరించాలనీ, ప్రచార సేవా కార్యక్రమాలను చేపట్టాలని సంకల్పించాము. అందుకొరకై – 2014లో 'తెలుగుజాతి' ట్రస్టు (92 / 2014) ను స్థాపించాము. దీనికి డా॥ సామల రమేష్‌బాబు వ్యవస్థాపక ట్రస్టీగా ఉన్నారు.

2015 మార్చి నుండి 'అమ్మనుడి' పేరుతో పత్రికను మొదలుపెట్టి ఏ ఆటంకమూ లేకుండా ప్రతినెలా వెలువరిస్తున్నాము.

దేశంలో తెలుగు రాష్ట్రాలలోని తెలుగువారికి సమంగా బయటి రాష్ట్రాల్లో అంతే సంఖ్యలో వున్న తెలుగువారి భాష, చరిత్ర, సంస్కృతులను పరిశోధించి, స.వెం.రమేశ్ వ్రాసిన విలువైన వ్యాసాల సంకలనం **'ఎల్లలు లేని తెలుగు'** ను ప్రచురించాము.

భాషాశాస్త్రజ్ఞుడు, హైదరాబాదు విశ్వవిద్యాలయ ఆచార్యులు డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు పరిశోధనాత్మక రచనలు

**1.తెలుగు రాష్ట్రాల్లో భాషా సంక్షోభం. 2. ద్రావిడ – మంగోలు భాషల జన్యు సంబంధం** పుస్తకాలను ప్రచురించాము.

మరికొన్ని విశిష్ట ప్రచురణలు త్వరలో రానున్నాయి.

## దాతలకు విన్నపం

**ఈ ట్రస్టును బలమైన పునాదులపై, తగినన్ని వనరులతో నిర్వహించటానికి మీ అందరి చేయూత కావాలి. విరాళాలనిచ్చి తోడ్పడగోరుతున్నాము.**

| | | | |
|---|---|---|---|
| రాజ పోషకులు | రు.1,00,000/- | పోషకులు | రు.25,000/- |
| విశిష్ట పోషకులు | రు.50,000/- | ప్రోత్సాహకులు | రు.10,000/- |

- దాత ఫొటోను, క్లుప్తంగా పరిచయాన్ని **'అమ్మనుడి'** పత్రికలో ప్రచురిస్తాము.
- దాతలందరినీ శాశ్వత చందాదారులుగా పరిగణించి పత్రికను ప్రతినెలా పంపిస్తాము.
- ట్రస్టు ప్రచురించే పుస్తకాలను కూడా వెనువెంటనే పంపిస్తాము.

సొమ్మును ఆన్‌లైన్‌లో 'TELUGUJAATHI' పేర **యాక్సిస్ బ్యాంక్, సికిందరాబాదు**కు పంపాలి.

అక్కౌంట్ నెం. 914020020387880

I.F.S.C.Code : UTIB0000068.

లేదా– అదే బ్యాంకు పేర బ్యాంకు డ్రాఫ్టుగా పంపాలి. డ్రాఫ్టును పంపుటకు, ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా : డా॥ సామల లక్ష్మణబాబు, ట్రస్టీ, తెలుగుజాతి (ట్రస్టు),8–386, జీవక భవనం, **అంగలకుదురు** పోస్టు, **తెనాలి.** గుంటూరు జిల్లా – 522 211. ఫోన్ : 9440448244

**(3వ అట్టపై ఇటీవలి దాతల వివరాలు చూడండి)**

## తెలుగువారంతా చదువవలసిన పుస్తకాలు

స.వెం.రమేశ్ రచన




**ఎల్లలు లేని తెలుగు**

వెల : రు.200/-లు

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు రచనలు



**తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభం**

వెల :రు. 100/-




**ద్రావిడ, మంగోలు భాషల జన్యుసంబంధం**

వెల : రు.350/-

విద్యార్థులు, ఉపాధ్యాయులు, పరిశోధకులు, సామాజిక కార్యకర్తలు రచయితలు, భాషోద్యమకారులు, ఆసక్తిగల వారంతా ఈ రచనలను చదివి ప్రయోజనం పొందగోరుతున్నాము

పుస్తకాల వెలను ఎం.ఒ. చేస్తే వాటిని కొరియర్ / రిజిస్టర్డ్ బుక్ పోస్టులో పంపిస్తాము.

**తెలుగుజాతి (ట్రస్టు)** – జీవక భవనం, 8–346, **అంగలకుదురు** పోస్టు **తెనాలి** – 522211ఫోన్ : 9440448244

# సైద్ధాంతిక నిబద్ధతకూ,ఆదర్శ ఆచరణకూ, స్నేహశీలతకూ ప్రతీక గొప్ప అనువాదకుడు, పలు భాషల పండితుడు, సాహితీమూర్తి నిర్మలానందకు జోహార్లు



'ప్రజాసాహితి' గౌరవ సంపాదకుడుగా అందరికీ తెలిసినవాడు, ఆ పత్రికకొక రూపాన్నీ స్థాయినీ కలిగించిన మార్గదర్శకుడు 'నిర్మలా నంద'. 'నడుస్తున్న చరిత్ర' పత్రికను ఎంతో అభిమానించేవారు. కొద్దిసార్లు ప్రత్యే కంగా రచనలు చేశారు కూడా. తెలుగంటే మిక్కిలి అభిమానం. ఆ మాటకొస్తే – అన్ని భాషలపట్లా సమమైన ప్రేమే. సాహిత్యానికీ – భాషలకూ ఉండే బంధాన్ని ఎంతో చక్కగా వివరించేవారు. ఎంతటి ఉన్నత స్థాయిగల సాహితీమూర్తి అయినా, సంపాదకుడయినా, చిన్నా పెద్దా అందరిపట్లా అభిమానాన్ని, ప్రేమనూ చూపిన 'నిగర్వి'.

ఆయన హిందీ సాహిత్య పరిచయంతో పెట్టుకున్న కలం పేరు – నిర్మలానంద వాత్స్యాయన్. ఇదొకటే కాదు – 'తెలుగు దాసు' ఆయనే, 'విపుల్' అయనే, ఇలా 'విపుల' పత్రిక కోసం ఎన్నెన్నో పేర్లతో అనువాదాలు చేసేవారు. ఆయన అసలు పేరు ముప్పన మల్లేశ్వరరావు. 1935 లో అక్టోబరు 20న జన్మించారు. 84వ ఏట హైదరాబాద్‌లో సాహిత్య కృషి చేస్తూ 24-7-2018న మరణించారు.

హైస్కూలు చదువు పూర్తయ్యే నాటికే జాతీయోద్యమ ప్రభావం వున్న తండ్రి సలహాతో హిందీలో పరీక్షలు ప్యాసయ్యారు. స్వగ్రామమైన అనకాపల్లిలోని ప్రసిద్ధ శారదా గ్రంథాలయం ఆయన్ను సాహిత్య రంగంలో ప్రవేశపెట్టింది. ఆ తర్వాత రైల్వేలో పనిచేస్తున్న క్రమంలో రాష్ట్రేతర ప్రాంతాల్లో ఉద్యోగం చేస్తూ ఒరియా, బెంగాలీ, ఇంగ్లీషు భాషల్లో ప్రవేశం సంపాదించారు. ఎక్కడ సాహిత్య సభలు జరిగినా వాటికి తప్పనిసరిగా హాజరై రచయితలతో, రచనలతో సాన్నిహిత్యం పెంచుకునేవారు.

జనసాహితి సంస్థ, ప్రజాసాహితి పత్రికలతోనే ఆయన జీవితాంత అనుబంధం.

1979లో విజయనగరంలో జనసాహితి రెండవ మహాసభల నాటికి ఆయన శృంగవరపు కోటలో ఉద్యోగం చేసేవారు. ఆ మహాసభల ఆహ్వానసంఘ సభ్యులుగా కృషి చేశారు. ఆ సభల్లోనే ఆయన జనసాహితి సభ్యునిగా చేరారు. ఆ మహాసభలనాటికే ఆయన నిర్మలానందగా ప్రసిద్ధుడు. తాను తన మిత్రులు హిందీలోకి అనువదించిన శ్రీశ్రీ కవితల పుస్తకం "ఆగ్ ఉగల్తా హువా! ఆస్మాన్ కీ ఓర్ బఢతా హువా" అనే కావ్య సంగ్రహాన్ని 1970 జనవరిలో శ్రీశ్రీ షష్టిపూర్తి సందర్భంగా వెలువరించారు. స్వతంత్ర రచనలు, అనువాదాలు ఎన్నో వెలయించారు.

ఇతర భాషల్లోని సాహిత్యం తెలుగు చేసుకోడానికి తెలుగులోని సాహిత్యం ఇతర భాషల్లోకి వెళ్లటానికీ అనువాదకులు కావాలి. అనువాదమూ ఒక సృజనాత్మక కళే. ఆయన కొత్త రచయితలను ప్రోత్సహించి రాయించ టానికి ప్రాముఖ్యతనిచ్చారు. వారిని కవులుగా, అనువాద కులుగా, విమర్శకులుగా తీర్చిదిద్దారు. ఆయన పని రాక్షసుడు. అతివాద, మితవాద ధోరణులకు లోనుగాకుండా, ప్రజామార్గంలో పోరాటం చేస్తూ, భావ విప్లవరంగంలో కృషి చేస్తున్న ప్రజా సాహిత్యకారులకు నిర్మలానంద ఒక స్ఫూర్తి – ఒక ప్రేరణ.

ఏ రాజకీయ సిద్ధాంతంమీద పని చేస్తున్నా నిబద్ధత కలిగి వుండేవారు కరువై పోతున్న యీ రోజుల్లో 'నిర్మలానంద' గొప్ప ఆదర్శం. ఆయన మృతి మొత్తం సమాజానికే లోటు. ఆ లోటు తెలుగు భాషా సాహిత్య రంగాలకు తీరని లోటు.

– సంపాదకుడు

# తెలుగుభాషోద్యమ కార్యకర్త పూడిపెద్ది నాగేశ్వరరావు కనుమరుగు




బరంపురం (ఒరిస్సా) కు చెందిన భాషోద్యమ కార్యకర్త శ్రీ పూడిపెద్ది నాగేశ్వరరావు 2018 జూన్ 13న అనారోగ్యంతో కన్నుమూసినట్లు తెలుగుభాషోద్యమ సమాఖ్య ఒరిస్సా రాష్ట్ర కార్యదర్శి శ్రీమతి తుర్లపాటి రాజేశ్వరి తెలియజేశారు.

కీ.శే. పూడిపెద్ది నాగేశ్వరరావు 1957 జూన్ 5న బరంపురంలో జన్మించారు. తల్లిదండ్రులు చిదంబర శాస్త్రి – నాగమ్మ దంపతులు. స్థానిక సిటీ హైస్కూలు, కళ్ళికోట కళాశాలలో చదువుకున్నారు. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా అసిస్టెంట్ మేనేజర్‌గా ఉద్యోగం చేశారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. నాగేశ్వరరావు వివిధ బాధ్యతల్లో తెలుగు భాష సాహిత్య రంగాల్లో సేవలందిం చారు. ఆంధ్ర విజ్ఞాన మండలి కార్యదర్శిగా, ఒరిస్సా తెలుగు భాషోద్యమ సమాఖ్యకి సంయుక్త కార్యదర్శిగా ఆయన సేవలు చిరస్మరణీయం" అని డా॥రాజేశ్వరి తమ గాఢ సంతాపాన్ని తెలియజేశారు.

'నడుస్తున్న చరిత్ర' పత్రికకు శ్రీ నాగేశ్వరరావు ప్రగాఢ అభిమాని. పత్రిక ప్రచురణ 2013లో ఆగిపోయినప్పుడెంతో బాధపడ్డారు. మళ్లీ తెలుగుజాతి ట్రస్టును ప్రారంభించి, 'అమ్మనుడి' పత్రికను మొదలు పెట్టిన తర్వాత ఎంతో సంతోషించారు. ట్రస్టుకోసం ప్రోత్సాహకులుగా రు. 10,000లు పంపించారు కూడా. కొద్దికాలంగా అనా రోగ్యంతో బాధపడ్డారు. ఆయన కనుమరుగు కావడం భాషోద్యమానికి ఎంతో నష్టం.

– సంపాదకుడు

సంపుటి : 4 సంచిక : 6
**అమ్మనుడి**
ఆగస్టు 2018

సంపాదక హృదయం

# తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను స్వాగతిద్దాం

ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్ తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ ఏర్పాటుకు ఉత్తర్వు వచ్చేసింది – జి.ఒ. ఎం.ఎస్. సంఖ్య 40 / 10.7.18. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న వ్యవస్థను ఏర్పర్చుతున్నారు గనుక దానిని మనం స్వాగతించాలి.

పదిహేనేళ్ల నుండీ భాషోద్యమకారుల కోరిక ఇది. క్రమక్రమంగా 2009 నుండి ఇది బలవత్తరమయింది. 1966 నుండీ వున్న ఆం.ప్ర. అధికార భాషా చట్టం ప్రకారం ఒక 'అధికార భాషా సంఘం' అప్పుడప్పుడు నియమితమవుతూ రెండేళ్లకొకసారి అదృశ్యమవుతూ ఉండేది. ఒక తాత్కాలిక సలహా సంఘం అది. దానికొక నిరంతర వ్యవస్థగాని, చిరునామా, తలా తోకా ఏమీ లేని విచిత్రం అది. దానికి అధ్యక్షులుగా వచ్చిన కొందరూ, వారితో పనిచేసిన సభ్యులూ ఎంతో కొంత కృషి చేశారు. కాని అదంతా ఏలినవారి పట్టనితనం వల్ల బూడిదలో పోసిన పన్నీరయింది. ఎటువంటి అధికారాలు, ప్రభుత్వ సహకారమూలేని పనికిమాలిన సంఘం అది. అందువల్ల దానిని నిరసించి, దాని స్థానంలో ఒక ప్రాధికార సంస్థ (అథారిటీ) ని ఏర్పరచాలని తెలుగుభాషోద్యమ సమాఖ్య, మిత్ర సంఘాలూ ఒక బలమైన 'డిమాండు' ను ముందుకు తెచ్చాయి. తెలుగుకు ఒక ప్రత్యేక మంత్రిత్వశాఖనూ, దానితోపాటు ఒక ప్రాధికార సంస్థను ఏర్పరచాలనే నిక్కచ్చు (డిమాండు) తో పాటు తొమ్మిది తీర్మానాలను 2009 నుండీ సమాఖ్య ప్రభుత్వం ముందుపెట్టి, నాలుగేళ్లపాటూ నిరసన కార్యక్రమాలను చేసింది. చివరకు గిడుగు 150వ జన్మదినోత్సవ సందర్భంగా నిరసన కార్యక్రమాన్ని బలవత్తరం చేసింది. 2012లో ప్రభుత్వం తిరుపతిలో నడుప తలపెట్టిన ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా సమాఖ్య ఈ డిమాండ్లతో రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని నిర్వహించింది. సమాఖ్య అధ్యక్షుడు రెండుసార్లు ముఖ్యమంత్రిని కలిసి వివరించినా ఫలితం లేకపోయింది. అదంతా ఒక చరిత్ర. మొత్తంమీద ఉద్యమ ప్రభావంతో కొన్ని కోరికలకు ముఖ్యమంత్రి ఆమోదం తెలుపుతూ మహాసభల తొలి రోజున ప్రకటన చేశారు. మూడవ రోజున తీర్మానాలను ప్రకటించారు. మొత్తం మీద సరిగ్గా ఒక ఏడాదికి 31 – 12 – 2013న జి.ఒ. 909 ద్వారా తెలుగు భాషా మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశారు. అయితే యువజనాభివృద్ధి, పర్యాటకంతో చేరివున్న సాంస్కృతిక శాఖను వేరుపరచి భాషాశాఖను దానిని జోడించి, 'తెలుగుభాష, సాంస్కృతిక శాఖను ఏర్పాటు చేస్తున్నట్లు జి.ఒను ఇచ్చారు.

ఆ తర్వాత కొద్ది నెలలకే రెండు రాష్ట్రాలుగా విభజనై, ఎన్నికలు జరిగిన తర్వాత కొత్త ఆంధ్రప్రదేశ్‌లో వచ్చిన వరుస బడ్జెట్లలో భాషా మంత్రిత్వ శాఖకోసం కేటాయింపులేనాడూ లేవు. ఈ విషయాన్ని ప్రభుత్వ దృష్టికి తెచ్చినా, ఏమీ పట్టించుకోలేదు. సరే. భాషా మంత్రిత్వశాఖను ఇచ్చారేగాని, దానికి ప్రాణావసరమైన 'తెలుగుభాషాభివృద్ధి ప్రాధికార సంస్థ' కోరికను ప్రపంచ మహాసభలప్పుడే విస్మరించింది ప్రభుత్వం. పెద్దలు అధికార భాషా సంఘం అనే బూచిని ఇంకా వదులుకోలేదు. ఆత్మహనన రాజకీయ మేధస్సులు ఏం పని చేశాయో గాని ప్రాధికార సంస్థ డిమాండును పక్కన పెట్టేశారు. తర్వాత – మళ్లీ ఈ డిమాండును ప్రజల దృష్టికీ, ప్రభుత్వ దృష్టికీ, తేవడానికి తెలుగు భాషోద్యమ సమాఖ్య తన కృషిని కొనసాగించింది. ముఖ్యమంత్రికి బహిరంగ లేఖలు వ్రాసి, రాష్ట్రవ్యాప్తంగా సభల్లో ఈ అంశానికి ప్రచారం తెచ్చింది. ప్రభుత్వంలోని కొందరి పెద్దలకు వివరించి వారి సమర్థనను పొందింది. మొత్తం మీద 2016 తెలుగు భాషాదినోత్సవం నాడు ముఖ్యమంత్రిగారి బహిరంగ ప్రకటనను పొందగలిగాం. మళ్ళీ 2017 లో ఇదే రోజున ముఖ్యమంత్రిగారు బహిరంగ సభలో మాట్లాడుతూ, రానున్న శాసనసభ సమావేశాల్లో బిల్లును ప్రవేశపెట్టి పటిష్టంగా చట్టాన్ని తేనున్నామని ప్రకటించారు. అయితే – ఏ సాంకేతిక, రాజకీయ కారణాల వల్లనో ఇప్పుడు జి.ఒ.గా తెచ్చారు. గమనించండి – ఈ జి.ఒ. నెం. 40ను 'యువజనాభ్యుదయం, పర్యాటక

మరియు భాషా సాంస్కృతిక (పిఎంయు) శాఖ' వెలువరించింది! దీనిలో రెండు సూచికల్ని (రిఫరెన్సు) ఇచ్చారు.

1. ఆంధ్రప్రదేశ్ అధికార భాషాచట్టం నెం. 9/1566.

2. ఆంధ్రప్రదేశ్ పర్యాటకం సంస్కృతి మరియు వారసత్వ మండలి చట్టం (2017 ఆం.ప్ర. చట్టం నెం.4) ఆంధ్రప్రదేశ్ గెజిట్ (పార్ట్ 4 - బి. అసాధారణ సంచిక) నెం.4 తేదీ 26.4.2017. ఈ రెండు సూచికల ఆధారంగా ఇప్పుడీ జి.ఒ. 40 ను వెలువరిస్తున్నట్లు, ఇది ది. 18-07-2018 నుండి అమలులోకి వస్తుందని గెజిట్‌లో ప్రకటించారు.

మరి – కొత్త సంగతి కాదుగాని, తెలుగుభాషాభివృద్ధి ప్రాధికార సంస్థ ఏర్పాటు జి.ఒ కూడా సంప్రదాయం చెడకుండా ఇంగ్లీషులోనే వచ్చింది! గతంలో తిరుపతి ప్రపంచ తెలుగు మహాసభలపై ఇచ్చిన జి.ఒగాని, మంత్రిత్వశాఖ ఏర్పాటు జి.ఒ.గాని అన్నీ ఇంగ్లీషులోనే వచ్చాయని మనం మరిచిపోరాదు. అయితే నిబద్ధత కలిగిన అధికారులు కొందరైనా ఇంకా ఉన్నారు గదా! సృజనాత్మకత సంస్కృతి కమిషన్ సి.ఇ.ఒ.గారు 24 గంటలలోనే తెలుగు అనువాదాన్ని స్వయంగా తయారుచేసి, పరువు దక్కించారు. ప్రభుత్వంలో 'రాజకీయ సంకల్పం' (మామూలుగా దీన్నే ఇంగ్లీషులో 'పొలిటికల్ విల్' అంటారు) ఉందా అనేది ప్రధాన సమస్య. ఈ జి.ఒ. వచ్చిన తర్వాత ప్రభుత్వం తరపున ఒకటో రెండో శిలాఫలకాలు కూడా ఇంగ్లీషులోనే ఆవిష్కృతమైనట్లు సచివాలయ పాలన అంతా ఇంగ్లీషులోనే నడుస్తున్నట్లు – తెలిసినవారు చెప్తున్నారు. అందుకు బాధ్యులైన వారికి ఈ జి.ఒ. ప్రకారం శిక్షలు పడతాయా?!

ఇక ఈ జి.ఒ. లో మనం గమనించాల్సిన ముఖ్యమైన సంగతులు : **భాగం -2 లో 2వ అంశం :** ప్రాధికార సంస్థకు ఒక ఛైర్మన్ (అధ్యక్షుడు) ; సాధారణ పరిపాలన, న్యాయ, కార్మిక, పర్యాటక, సాంస్కృతిక మరియు విద్యాశాఖలు నిర్వహించే వివిధ స్థాయి కార్యదర్శులు, రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి కమిషన్ సిఇఒ తోపాటు – "తెలుగు సాహిత్యం, పరిపాలన మరియు న్యాయ వ్యవహారాలలో విశిష్ట అనుభవం కలిగిన పలువురు నిపుణులు"ంటారని పేర్కొన్నారు. దీనిలో కావలసింది సాహితీ వేత్తలు కాదు. ఆ వాక్యం ఇలా ఉండాలి : 'తెలుగు భాష, బోధన, పరిపాలన మరియు న్యాయ వ్యవహారాలలో విశిష్ట అనుభవం కలిగిన నలుగురు నిపుణులు' అని ఉండాలి.

**అదేభాగంలో 3వ అంశం :** 'ప్రభుత్వం నియమించిన తెలుగుభాష, సాహిత్యం, పరిపాలనా రంగాలలో విశిష్ట అనుభవం కలిగిన ముగ్గురు సభ్యులతో కూడిన సెర్చికమిటీ ఎంపిక చేసినవారిని అధ్యక్షులు మరియు సభ్యులుగా ఆం.ప్ర. ప్రభుత్వం నియమిస్తుంది'. ఇందులోకూడ 'సాహిత్యం' బదులు విద్య అని ఉండాలి. సాహితీ వేత్తలకు ఇందులో పనిలేదు. సాహితీ వేత్తల సేవలు పొందడానికి సాహిత్య అకాడమీ, వివిధ స్థాయి సాహితీ సంస్థలు, సంఘాలు ఉన్నాయి.

ఈ రెండు విషయాలను స్పష్టం చేస్తూ ఈ జి.ఒ.కు వెంటనే సవరణలు తేవాలి. ఈ అంశాన్ని సి.ఇ.ఒ. గారి దృష్టికి తీసుకు వెళ్ళగా, వారూ మా అభిప్రాయంతో ఏకీభవించారు. దీన్ని అత్యవసర అంశంగా భావించాలని వారి ద్వారా ప్రభుత్వానికి విన్నవిస్తున్నాము.

ఆధునిక అవసరాలన్నిటినీ తీర్చగల భాషగా తెలుగుకు శక్తి వుంది. దాన్ని ఉపయోగించే కొద్దీ అది అభివృద్ధి చెందుతుంది. అంటే అన్ని రంగాలలో తెలుగునే సాధనంగా చేసుకోవాలి. అందుకు తగ్గట్టుగా ఆ రంగాల్ని నియంత్రించడం, మార్గదర్శనం చెయ్యడం కోసమే ఈ సంస్థ. భాష అంటే కేవలం సాహిత్యం కాదు. భాషా వ్యవహర్తలు పెరిగితేనే, భాషా వినియోగం పెరిగితేనే సాహిత్యాన్ని చదివే వాళ్ళుంటారు; లేకపోతే సాహిత్యానికి ఆదరణ కృశించిపోతుంది. భాషలేకపోతే సాహిత్యం లేదు. సాహిత్య వికాసంతో భాషా వికాసమూ జరుగుతుంది కాని, ఈ రోజుల్లో భాష కేవలం సాహిత్యం కోసం కాదు. ఈ ఆధునిక యుగంలో ప్రజల భాష ప్రజాస్వామ్య సాధనం. ప్రజల హక్కు. జనులందరి ఊపిరిగా, వారి నిత్య చైతన్యానికి, అన్ని రంగాలలో అభివృద్ధికి వారి భాష వారికి ఆధారం కావాలి. అందుకోసం ప్రజలభాషలో చదువూ పరిపాలనా కావాలి. అప్పుడే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది. ఈ స్పష్టమైన ఆశయాన్ని దృష్టిలో పెట్టుకొని జి.ఒల నిర్మాతలూ, రాష్ట్ర నేతలూ భాషాభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకొని పనిచెయ్యాలి.

పై రెండు దోషాల సవరణతోపాటు, మరేమైనా మార్పులు, చేర్పులు కావాలేమో ఆలోచించండి. చట్టాన్ని రూపొందించకుండా, దానికి తగిన 'నియమాలు' (రూల్సు) ఏర్పరచకుండా – ఆశించిన లక్ష్యాలు నెరవేరుతాయా? **భాగం – 7 అంశం 10 :** 'నేరాలు మరియు జరిమానాలు' లో విధించిన జరిమానాల విధింపుకు, వసూళ్ళకు ఈ జి.ఒ. సరిపోతుందా? ఇంతవరకు ఈ జి.ఒ.ను పరిశీలించిన ఇద్దరు న్యాయ నిపుణులు – ఇందులో చాలా లొసుగులున్నాయంటున్నారు. అధికారులు పరిశీలించాలని విన్నవిస్తున్నాము.

ఏది ఏమైనా ప్రాధికార సంస్థ ఏర్పడుతున్నందుకు మనం సంతసించాలి. స్వాగతించాలి. లోటుపాట్ల సవరణను కోరాలి. ఆచరణలో పూర్తిగా జి.ఒ.ను విజయవంతం చేసేందుకు తోడ్పడాలి. పోరాడాలి కూడా.

**జి.ఒ.నెంబరు 40 పూర్తి పాఠాన్ని ఈ తరువాతి పుటలో చూడండి...**

సామల రమేష్‌బాబు

తేదీ : 27-7-2018

# ప్రభుత్వ ఉత్తర్వు ఆంధ్రప్రదేశ్ తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ

# A.P. TELUGU LANGUAGE DEVELOPMENT AUTHORITY

# ఏర్పాటుకు ప్రభుత్వ ఉత్తర్వు

**ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం**

సంక్షిప్తి

2017 సం॥ ఆంధ్రప్రదేశ్ 4వ చట్టం-ఆంధ్రప్రదేశ్ తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏర్పాటు) - నియమములు, 2018 - నోటిఫికేషన్ - ఉత్తర్వులు జారీ.

**యువజనాభ్యుదయం, పర్యాటక మరియు భాషా సాంస్కృతిక (పియంయు)**

**శాఖ జి.ఓ.ఎమ్.ఎస్.సంఖ్య. 40**

**తేది.10-07-2018**

క్రింది వాటిని పరిశీలించండి

1. ఆంధ్రప్రదేశ్ అధికార భాషా చట్టం, 1966 (ఆం.ప్ర.అధికార భాషా చట్టం నెం.9,1966)

2. ఆంధ్రప్రదేశ్ పర్యాటకం, సంస్కృతి మరియు వారసత్వ మండలి చట్టం, 2017 (2017 ఆం.ప్ర. చట్టం నెం.4) ఆంధ్రప్రదేశ్ గెజిట్ ( పార్ట్ IV - బి, అసాధారణ సంచిక ) ) నెం.4, తేది. 26-04-2017

✦ ✦ ✦

**ఉత్తర్వు:**

సూచిక 1 నందు ఆంధ్రప్రదేశ్ అధికార భాషా చట్టం 1966 (ఆంధ్రప్రదేశ్ చట్టం నెం.9) తెలుగు, ఉర్దూ భాషలను రాష్ట్ర అధికార భాషలుగా అధికారిక విధుల ఉపయోగార్థం మరియు రాష్ట్ర శాసన పరిషత్తు కార్యక్రమాల నిర్వహణార్థం ఉపయోగించుటకు మరియు రాష్ట్ర ప్రభుత్వం యొక్క కొన్ని అధికారిక విధుల ఉపయోగార్థం ఆంగ్ల భాష కొనసాగింపుపై, అదేవిధంగా శాసన పరిషత్తు కార్యక్రమాల నిర్వహణలో ఆంగ్ల భాషను వినియోగించుటపై ప్రభుత్వ ఉత్తర్వులు ఇచ్చు వరకు అధికారభాషగా తెలుగు ఉపయోగం పైన, రాష్ట్రంలోని కొన్ని ప్రకటిత ప్రాంతాలలో అధికారిక వ్యవహారాలలో ఉర్దూ భాష వినియోగంపై అధికార భాషాసంఘం సమీక్షించుటకు నిబంధనలు పొందుపరచడమైనది.

2. 2 వ సూచికలోని ఆంధ్రప్రదేశ్ పర్యాటకం, సంస్కృతి మరియు వారసత్వ మండలి చట్టం, 2017 (2017 ఆంధ్రప్రదేశ్ చట్టం-4) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యాటక అభివృద్ధి, ప్రాచుర్యం, కళా సంస్కృతుల అభివృద్ధి, తెలుగు ప్రజల వారసత్వ పరిరక్షణ ప్రాచుర్యానికి అవసరమైన స్వయం ప్రతిపత్తిగల ప్రాధికార సంస్థలను ఏర్పాటు చేయుటకు అధికారమును కలిగియున్నది.

3. తదనుగుణంగా ఈ క్రింద పేర్కొన్న ప్రకటన తేది. 18-07-2018, ఆంధ్రప్రదేశ్ అసాధారణ గెజిట్ సంచిక నందు ప్రకటించడమైనది.

**నోటిఫికేషన్**

ఆంధ్రప్రదేశ్ పర్యాటక, సంస్కృతి మరియు వారసత్వ మండలి చట్టం, 2017 నందున సెక్షన్ - 6, 10 (1) (బి) మరియు 42 ద్వారా ఒసగబడిన అధికారాలననుసరించి ఈ క్రింది నియమములను జారీ చేయడమైనది.

**భాగము - I**

**1. సంగ్రహనామము విస్తరణ మరియు ప్రారంభం.**

1. ఈ నియమాలను ఆంధ్రప్రదేశ్ తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ (ఏర్పాటు) నియమాలు - 2018 అని పిలువవచ్చు.

2. ఈ నియమాలు ఆంధ్రప్రదేశ్ అంతటికిని వర్తించవలెను.

3. ఈ నియమాలు 18-7-2018 తేదీన అనగా గెజిటు ప్రచురణ తేదీ నుండి అమలులోకి రావలెను.

2. నిర్వచనాలు :

ఈ నియమాలలో ఈ క్రింది పదాలు ఇతర విధముగా కోరబడిననే తప్ప

I. ప్రాధికార సంస్థ (అథారిటీ) అంటే (సెక్షన్-6 క్రింద ఏర్పాటు చేయబడిన) ఆంధ్రప్రదేశ్ తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ

II. 'ఛైర్మన్' అనగా తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ ఛైర్మన్ (అధ్యక్షులు)

III. అప్పటి శాఖ అనగా అధికార భాషా సంఘం

IV. నిధి అనగా నియమం 8 ప్రకారం ఏర్పాటయ్యే తెలుగు భాషాభివృద్ధి నిధి

V. ప్రాజెక్టులు మరియు ప్రొగ్రాములు (ప్రణాళికలు మరియు కార్యక్రమములు) అనగా రాష్ట్రంలో తెలుగు భాషాభివృద్ధి మరియు ప్రాచుర్యం కొరకు తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ యొక్క ఆమోదం పొందినవి

2. ఈ నియమాలలో నిర్వచించని పదాలు మరియు వ్యక్తీకరణలు, చట్టంలో వాడే అర్థాలను కలిగి ఉండవలెను.

## భాగము - 2

## తెలుగు భాష అభివృద్ధి ప్రాధికార సంస్థ (అథారిటీ) - ఏర్పాటు

3. ఆంధ్రప్రదేశ్ తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ ఏర్పాటు.

1. చట్టంలోని సెక్షన్-6 ప్రకారం ఒసగబడిన అధికారాలకు అనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయడం జరుగుతుంది. తదుపరి ఈ సంస్థ ప్రాధికార సంస్థ (ఆథారిటి) గా పేర్కొనబడుతుంది. ఈ సంస్థ ఒక పాలక మండలిని కలిగి ఉండి నిరంతరం కొనసాగుతూ తనదైన ప్రత్యేక ముద్ర (సీలు) ను కలిగి వుంటుంది. స్థిరచర ఆస్తుల, క్రయవిక్రయాదులు చేయటానికి అధికారం కలిగి వుండి, ఇతరులతో ఒప్పందాలు కుదుర్చుకొనడానికి మరియు దావాలు వేయుటకు మరియు దానిపై దావాలు వేయబడి కోర్టు ద్వారా పరిష్కరించుకొనడానికి అధికారం కలిగి ఉంటుంది.

2. ప్రాధికార సంస్థ (అథారిటీ) నందు ఈ క్రింద సూచించిన వారు ఉంటారు.

అ) ఛైర్మన్ (అధ్యక్షులు)

ఆ) ప్రభుత్వ సాధారణ పరిపాలన, న్యాయ, కార్మిక, పర్యాటక & సాంస్కృతిక మరియు విద్యాశాఖలు నిర్వహించే కార్యదర్శులు / ముఖ్య కార్యదర్శులు / ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు

ఇ) తెలుగు సాహిత్యం, పరిపాలన మరియు న్యాయ వ్యవహారాలలో విశిష్ట అనుభవం కలిగిన నలుగురు నిపుణులు

ఈ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సంస్కృతి కమీషను యొక్క ముఖ్య కార్యనిర్వహణాధికారి.

ఉ) ప్రాధికార సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు.

3) ప్రభుత్వం నియమించిన తెలుగు భాష, సాహిత్యం, పరిపాలన రంగాలలో విశిష్ట అనుభవం కలిగిన ముగ్గురు సభ్యులతో కూడిన సెర్చ్ కమిటి ఎంపిక చేసిన వారిని అధ్యక్షులు మరియు సభ్యులుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నియమిస్తుంది.

4) ప్రాధికార సంస్థ కూర్పు (కాంపోజిషన్) మరియు ఖాళీలు వలనకాని గైరుహాజరు వలన అవసరమైన సంస్థ పునర్నిర్మాణం మరియు దాని సమావేశ నిర్వహణ చట్టంలోని మొదటి షెడ్యూలు ప్రకారం జరుగుతుంది.

5) ప్రాధికార సంస్థ యొక్క సాధారణ పర్యవేక్షణ మరియు నియంత్రణకు లోబడి దైనందిన వ్యవహారాల నిర్వహణ అధికారం ముఖ్యకార్యనిర్వహణాధికారి కలిగి ఉండవలెను.

6) ప్రాధికార సంస్థ (అథారిటీ) తన లక్ష్యాలు సాధించుటకు అవసరమైన నియమ నిబంధనలు బోర్డు / ప్రభుత్వ ఆమోదమునకు ఆదేశాలకు లోబడి రూపొందించడం జరుగుతుంది.

7) అధ్యక్ష పదవికి ఖాళీ వచ్చినప్పుడు ప్రభుత్వ కార్యదర్శి / ముఖ్య కార్యదర్శులు / ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, పర్యాటక మరియు సాంస్కృతిక శాఖవారు ప్రాధికార సంస్థ (అథారిటీ) అధ్యక్షునిగా వ్యవహరిస్తారు.

8) ప్రాధికార సంస్థ (అథారిటీ) తన అధికారాలను, బాధ్యతలను ముఖ్య కార్యనిర్వహణాధికారికి బదలాయించవచ్చును. ప్రాధికార సంస్థ ఆదేశాలకు లోబడి - ముఖ్య కార్యనిర్వహణాధికారి ఏ అధికారాన్నైనా, విధులనైననూ నిర్వహించవచ్చును.

**4. వివిధ రంగాల కమిటీల నియామకం :**

ప్రాధికార సంస్థ చట్టంలోని సెక్షన్ - 7 అనుసరించి ఈ క్రింద సూచించిన కమిటీలను అర్హులుగా భావించిన సభ్యులతో నియమించ వచ్చును.

అ) అధికార భాషగా తెలుగు అమలుపై కమిటీ

ఆ) విద్యారంగంపై ప్రత్యేక దృష్టితో తెలుగు భాషాభివృద్ధి కమిటీ

ఇ) ఇ-తెలుగు అభివృద్ధి కమిటీ

ఈ) అనువాదాలు, ప్రచురణ కమిటీ

ఉ) అంతర్జాతీయ తెలుగు అభివృద్ధి కమిటీ

## భాగము - 3

## ప్రాధికార సంస్థ కృత్యములు

5. ప్రాధికార సంస్థ యొక్క కృత్యములు :

1. సెక్షన్-11 క్రింద ప్రాధికార సంస్థ (అథారిటీ) విధులు ఈ క్రింది విధంగా ఉంటాయి.

1. సాధారణ కృత్యములు:

ప్రతి సంవత్సరం తెలుగు భాష అభివృద్ధికి (ప్రాజెక్టు మరియు ప్రొగ్రామ్‌ల) ప్రణాళికల, కార్యక్రమాలు సిద్ధంచేసి ప్రభుత్వ ఆమోదానికి పంపవలెను.

II. అధికార భాషగా తెలుగు అమలు :

అ) అధికార భాషగా తెలుగు అమలుకు ఉన్న ఇబ్బందులను గుర్తించి వాటిని పరిష్కరించటానికి తగిన చర్యలు తీసుకొనుట.

ఆ) ప్రజాసేవకు అనుగుణంగా వారు పలు శాఖలలో ఉపయోగించే వివిధ నమూనాలను తెలుగు భాషలోకి అనువదించి వాటిని నిపుణతతో రూపకల్పన చేయుట.

ఇ) ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యాయాల్లో ఉపయోగించే రిజిష్టర్లను, కరపత్రాలను, ప్రచురణలను, ఇతర ప్రచార సామాగ్రిని సులభంగా అర్థమయ్యే తెలుగులో ముద్రించేందుకు ముద్రణ చర్యలు చేపట్టుట.

ఈ) రాష్ట్రంలోని హైకోర్టు మరియు ఇతర న్యాయస్థానాల్లో తెలుగులో తీర్పులిచ్చేందుకు ఆయా న్యాయస్థానాలతో సమన్వయపరచుట.

ఉ) ప్రభుత్వ సిబ్బంది తమ విధి నిర్వహణలో తెలుగు భాషను ఉపయోగించే విధంగా వారికి తగిన శిక్షణా కార్యక్రమాలు, ప్రదర్శనలు, చర్చా వేదికలు, సెమినారులు నిర్వహించుట

ఊ) తెలుగు బోధనాంశాను (సిలబస్), పరీక్షా విధానాలను ఎప్పటికప్పుడు సమీక్షించటమే కాకుండా ప్రజా సేవకు కాలానుగుణంగా పాఠ్య ప్రణాళికలు, పరీక్ష విధానాల్లో చేసే మార్పు

తెలుగు భాషలోనే ఉండాలి.

ఎ) కేంద్ర ప్రభుత్వ సంస్థలైన విమానాశ్రయాలు, బ్యాంకులు, పోస్టాఫీసులు మరియు ఇతర సేవా కేంద్రాలు, ప్రజలతో సంబంధాలున్న ప్రభుత్వ రంగ సంస్థలు ఏర్పాటు చేసే ప్రదర్శన బోర్డులు, నోటీసులు, నామ ఫలకాలు మొదలైన కేంద్ర ప్రభుత్వ భాషావిధానానికి అనుగుణంగా ప్రాంతీయ భాషలో కూడా ఉండేటట్లు చర్యలు చేపట్టుట.

ఏ) పరిపాలనకు సంబంధించిన విషయాలపై రిఫరెన్స్ గ్రంథాలను తయారు చేయించుట, ముద్రించుట, పంపిణీ చేయుట మొదలగు విషయాలపై నిర్ణయాలు తీసుకొని ప్రగతిని సమీక్షించి ఇందుకు అవసరమైన సూచనలు చేయుట

ఐ) ప్రభుత్వ పాలనలో ఆఫీసు నోటు తయారీ దగ్గర్నుండి రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టే బిల్లు వరకు, తెలుగుభాషలో జరిగే విధంగా ప్రోత్సహించుట.

ఒ) గ్రామ సచివాలయం మొదలు ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ తెలుగులోనే జరిగే విధంగా ప్రోత్సహించాలి.

ఓ) తెలుగు అధికార భాషగా అమలు జరుగుతున్న తీరును డివిజనల్ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు క్రమం తప్పక అన్ని స్థాయిల్లోను సమీక్షలు జరిగేటట్లు చర్యలు తీసుకొనుట.

ఔ) శాస్త్ర, సాంకేతిక, న్యాయ పరిపాలనా రంగాలలో ఇతర భాషలలో వస్తున్న పారిభాషిక పదాలను తెలుగులో ప్రత్యామ్నాయ పదాలను తయారు చేసుకోవటానికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించి దానిని అమలు చేసి 'పద నిధి' (పద బ్యాంకు) ని ఏర్పాటు చేయుట.

అం) వివిధ ప్రభుత్వ శాఖల ఉపయోగార్థం పరిపాలనా పదకోశాలను తయారుచేసి ముద్రించుట.

అః) నామ ఫలకాలు, బోర్డులు, ఫ్లెక్సీలు, బ్యానర్లు మరియు ఇతర ప్రచార సామాగ్రి తెలుగు భాషలో ఉండేటట్లు ఉత్తర్వులు ఇచ్చి వాటిని ఉల్లంఘించే వారిని దండించేందుకు అవసరమగు చర్యలు చేపట్టుట.

క) ప్రభుత్వ కార్యాలయాల నామఫలకాలు, పునాది మరియు ప్రారంభోత్సవ శిలా ఫలకాలు తెలుగు భాషలోనే స్పష్టంగా వ్రాసి పెట్టేటట్లు చర్యలు తీసుకోవాలి. ఉల్లంఘనదారులను దండించేందుకు చర్యలు చేపట్టుట.

**III. తెలుగు భాషాభివృద్ధి :**

**విద్య :**

అ) విద్య మరియు సాంస్కృతిక రంగాల్లో తెలుగు భాషకు ప్రాచుర్యం, ప్రాధాన్యత ఉండేటట్లు చర్యలు చేపట్టుట.

ఆ) తెలుగు పాఠ్యపుస్తకాల ప్రమాణాలు పరిశీలించి వాటిలో ఉన్న లోపాలను సరిదిద్దుటకు అవసరమైన ఆదేశాలు జారీచేయుట.

ఇ) ఇంటర్మీడియట్ (మాధ్యమిక) లేదా సమానమైన స్థాయి వరకు విద్యార్థుల అధ్యయన ప్రమాణాలను పరీక్షించుట.

ఈ) విద్యార్జన దశలో మొదటి 12 ఏళ్ల వరకు తెలుగు పాఠ్యాంశంగా ఎంచుకొనేటట్లు విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించుట.

ఉ) ప్రపంచ వ్యాప్తంగా మానవ జీవనశైలిని, ఆలోచనా విధానాన్ని మలుపు తిప్పిన తత్వ, విజ్ఞాన, వైద్య, గణిత, ఆర్థిక, చారిత్రక శాస్త్రాలలో, ఇంజనీరింగ్, కళా రంగాలలో వచ్చిన ఉత్తమ రచనలను ( ప్రచురణ లేదా డిజిటలైజేషన్) అనువదింప చేయుట.

ఊ) తెలుగు భాషేతరులు, తెలుగు నేర్చుకొనటానికి వీలుగా అవసరమైన పాఠ్యాంశాలను (సిలబస్), సాహిత్యాన్ని డిజిటల్ కంటెంట్‌ని మార్చి బోధనా తరగతులను నిర్వహించుట.

ఎ) తెలుగు విద్యార్థులకు నిర్దేశించిన పాఠాలు, భాష పరంగాను, విషయ పరంగాను సరైన ప్రమాణాలతో ఉన్నవా? లేదా? అని నిర్ధారించుట.

ఏ) తత్వ, వైద్య, విజ్ఞాన, న్యాయ, ఇంజనీరింగ్ శాస్త్రాలకు సంబంధించిన బృహత్ నిఘంటువులు నవీకరించి అవసరమైన వాటిని ముద్రించుట.

ఐ) వివిధ కాలాలలో ఆయా కవులు వారి సాహిత్యంలో ఉపయోగించిన అచ్చ తెలుగు పదాలను గుర్తించి వాటిని తిరిగి జన సామాన్యంలోకి పంపి ఆ పదాలకు వ్యాప్తి కలిగించుట.

ఒ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత సంస్కృతి సమితి సమన్వయంతో తెలుగు భాష యొక్క ప్రాచీన విశిష్టత, అక్షర రమ్యత, శబ్ద సౌందర్యం వ్యాప్తిలోకి తీసుకొని వచ్చుట.

ఓ) యువత తెలుగు భాషపట్ల మక్కువ పెంచుకొని ఆ భాషను వినియోగించే విధంగా వారిని ప్రోత్సహించడానికి అవసరమైన చర్చాగోష్ఠులు, కార్యశాలలు, వివిధ రకాల పోటీలు నిర్వహించుట.

ఔ) తెలుగు భాష, సంస్కృతి మరియు వారసత్వ రంగాల్లో పరిశోధనలను ప్రోత్సహించుట.

అం) భారత ప్రభుత్వ సంస్థలు సమన్వయంతో పనిచేయుట.

అః) ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి ప్రపంచ మహాసభలను నిర్వహించి ఆ సభను తెలుగు భాష, సంస్కృతి, వారసత్వాల అన్ని అంశాల చర్చా వేదికగా రూపొందించుట.

**IV. ఇ - తెలుగు అభివృద్ధి**

అ) తత్వశాస్త్రం, విజ్ఞాన శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, గణితం, వైద్యం, చరిత్ర, కళలు, ఇంజనీరింగ్, ఆర్కిటెక్చర్ మరియు ఇతర రంగాలకు సంబంధించిన శాస్త్ర జ్ఞానాన్ని డిజిటల్ రూపంలో తయారుచేయుట.

ఆ) తెలుగు భాషను అంతర్జాలంలోను, ఇతర ప్రసిద్ధ వెబ్‌సైట్‌లలోను మరియు ఐ.టి.అప్లికేషన్స్‌లోను తెలుగు విరివిగా వాడకానికి ప్రోత్సహించుట.

ఇ) తెలుగు భాష అధ్యయనంకోసం ఆన్‌లైన్ కోర్సు నిర్వహించుట.

ఈ) ప్రాధికార సంస్థ వెబ్‌సైట్‌లో అన్ని కావ్యాలను నిక్షిప్తం చేయుట.

ఉ) ప్రాధికార సంస్థ వెబ్‌సైట్‌లో అన్ని శాసనాలు మరియు తాళపత్ర గ్రంథాలను డిజిటలైజేషన్ చేసి పొందుపరచటం.

ఊ) ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాల్లో యూనికోడ్ వాడకాన్ని ప్రోత్సహించి మొత్తం సమాచారాన్ని యూనికోడ్‌లోనే పొందుపరచటం.

ఎ) ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఐ.టి.) సంస్థల సమన్వయంతో తెలుగు భాషలో అన్ని ప్రముఖమైన (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ టూల్స్) సమాచార సాంకేతిక సాధనాలు (సాఫ్ట్‌వేర్) తెలుగులో లభించేటట్లు కృషిచేయుట.

**V ఎ. అనువాదాలు మరియు ప్రచురణలు :**

అ) వివిధ శాఖ సమన్వయంతో, ఆయా శాఖలకు సబంధించిన పారిభాషిక మరియు పరిపాలనా పదకోశాలను ఇతర సమాచారాన్ని తెలుగులోకి అనువదింప చేసి, తెలుగును అధికార భాషగా మరింత పటిష్టంగా అమలు చేయుటకు కృషిచేయుట.

ఆ) తెలుగు నిఘంటువులను, బృహత్ నిఘంటువులను ముద్రించి, భద్రపరచి తెలుగు భాష సంస్కృతి వారసత్వాలపై ఇతర భాషలలో లభ్యమవుతున్న పరిశోధనా గ్రంథాలతో పాటు అనువదింప చేయుటకు కృషి చేయుట.

ఇ) అనువాదాలు సాధారణ పదాలతో సామాన్యుడికి కూడా అర్థమయ్యే రీతిలో ఉండేటట్లు జాగ్రత్తలు తీసుకొనుట

ఈ) అధికారిక ఉత్తర ప్రత్యుత్తరాలు తెలుగులో జరిగే విధంగా అనువాదానికి సంబంధించిన మార్గదర్శక సూత్రాలు రూపొందించుట.

ఉ) మాతృభాషను పాలనా భాషగా, బోధనా భాషగా ఉపయోగించడం వలన కలిగే ప్రయోజనాలను తెలియజేసే కథలు, పద్యాలు, నాటకాలు ప్రోత్సహించి వాటి ముద్రణ చేపట్టుట.

**(బి) పురోభివృద్ధి ప్రచార వ్యూహం :**

అ) గోడ పత్రికల , కరపత్రాలు, హోర్డింగ్స్, వినియోగ సూచీలు (యూజర్ మ్యానువల్), డిజిటల్ కంటెంట్ తయారుచేసి ముద్రించుట.

ఆ) మాతృభాష వినియోగంపై ఉద్యోగుల మరియు ప్రజలలో అవగాహన కలిగించటానికి ప్రయత్నం చేయుట.

ఇ) రాష్ట్రంలో తయారవుతున్న కంప్యూటర్ హార్డ్‌వేర్ పరికరాల వినియోగం కోసం ఉపయోగిస్తున్న యూజర్ మాన్యువల్స్ (వినియోగ సూచీలు) తెలుగులో రూపొందేటట్లు సహకరించుట.

ఈ) రాష్ట్రంలో నడిచే విమానాలు, రైళ్లు, బస్సుల్లో వ్రాత మూలకంగా గాని లేదా మౌఖికంగా జరిగే సంభాషణలన్నీ (అనౌన్స్‌మెంట్) తెలుగు భాషలో జరిగేటట్లు చర్యలు చేపట్టుట.

ఉ) తెలుగు భాషలో క్రొత్త మరియు వినూత్న ఖతుల (ఫాంట్ల) తయారీకి తోడ్పడుట.

**(సి) అంతర్జాతీయ తెలుగు భాషాభివృద్ధి :**

అ) తెలుగు భాషీయులు అల్ప సంఖ్యాకులుగా (మైనార్టీలుగా) ఉన్న ఇతర రాష్ట్రాలలో ఆయా ప్రభుత్వాలతో చర్చలు జరిపి అక్కడ తెలుగు బోధనకు చర్యలు చేపట్టుట.

ఆ) హిందీ రాష్ట్రాలో తెలుగు మూడవ భాషగా అమలు జరిగే విధంగా చర్యలు తీసుకొనుట.

ఇ) భారతదేశ ప్రభుత్వం యొక్క ఆధికారిక భాషా సంఘంతో చర్చించి కేంద్ర అధికార భాషా సంఘం పరిధిని కేవలం హిందీ భాషకే పరిమితం కాకుండా భారత రాజ్యాంగం 8వ షెడ్యూలు లో పేర్కొన్న అన్ని భారతీయ భాషలకు విస్తరింప చేయుటకు ప్రయత్నించుట.

ఈ) సరిహద్దు మండలాల్లో పొరుగు రాష్ట్రాల భాష ద్వారా తెలుగుపై జరుగుతున్న వ్యతిరేక పరిణామాల నుండి తెలుగు భాషను రక్షించుకునేందుకు అవసరమైన ప్రత్యేక పథకాలను, కార్యక్రమాలను రూపొందించి అమలు చేయుట.

ఉ) ఇతర రాష్ట్రాలలో తెలుగు భాషకు సంబంధించి విద్య, పాలనా పరంగా తలెత్తే సమస్యలను పరిష్కరించడానికి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయంతో కృషిచేయుట.

2. సబ్‌రూల్ -1 ప్రకారం నిర్దేశించిన విధులే కాకుండా ప్రాధికార సంస్థ ప్రభుత్వం ఎప్పటికప్పుడు అప్పగించిన విధులను నిర్వర్తిస్తుంది. అటువంటి విధుల నిర్వహణలో ప్రాధికార సంస్థ చట్టం అప్పగించిన బాధ్యతలను నిర్వహిస్తున్నట్లుగానే పరిగణించబడును. అట్టి బాధ్యతల నిర్వహణలో చట్టంలోని నిబంధనలు (ప్రొవిజన్స్) ప్రాధికార సంస్థకు వర్తిస్తాయి.

3. ఈ చట్టాన్ని తగిన విధంగా అర్థం చేసుకొని అమలు జరిపిన అధికారి ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని బాధ్యులు కారు. కోర్టు నందు కూడా వారి విధి నిర్వహణను ప్రశ్నించడానికి అధికారం లేదు.

## భాగము -4

## ప్రాధికార సంస్థ - అధికారాలు (అథారిటీ పవర్స్)

**6. ప్రాధికార సంస్థ అధికారాలు-**

1. చట్టం సెక్షన్-13 ప్రకారం ప్రాధికార సంస్థ ఈక్రింద సూచించిన అధికారాలలో ఏ ఒక్కటి గాని, అంతకన్న ఎక్కువ గాని అధికారాలు ఉపయోగించవచ్చును.

అ) వివిధ శాఖలకు తెలుగు భాష వినియోగంపై ఆదేశాలు ఇస్తూ వాటి అమలుపై కాల పరిమితితో కూడిన పద్ధతిలో సాంకేతిక, ఆర్థిక మరియు సామర్థ్యాలను దృష్టిలో ఉంచుకొని సమీక్షించవచ్చు.

ఆ) తెలుగు భాష అమలుకు సంబంధించిన సమాచారం ఏ ప్రభుత్వాధికారి నుండి, శాసన పరిషత్తు నుండి లేదా హైకోర్టు నుండి పొందవచ్చును. ఆయా అధికారులు ప్రాధికార సంస్థ కోరిన సమాచారం అందజేయడం తప్పని సరి విధి.

ఇ) ప్రాధికార సంస్థ రాష్ట్ర ప్రభుత్వానికి తన ప్రణాళికలు (ప్రాజెక్టులు), కార్యక్రమాలు (ప్రోగ్రామ్స్) పై సలహాలు ఇవ్వవచ్చు.

ఈ) ప్రాధికార సంస్థ ఆదేశాలను అతిక్రమించిన లేదా విధి నిర్వహణలో నిర్లక్ష్యం ప్రదర్శించిన ప్రభుత్వ ఉద్యోగులపై దండన విధించుటకు నియామక అధికారికి ( అపాయింటింగ్ అథారిటి) తగు సూచనలు ఇవ్వవచ్చును.

ఉ) రూల్స్‌లో పేర్కొనబడిన జరిమానాలు విధించి వాటిని వసూలు చేయవచ్చును.

ఊ) ప్రభుత్వ ఉద్యోగుల కొరకు నిర్వహించే తెలుగు పరీక్ష పాఠ్యప్రణాళిక (సిలబస్) నిర్ణయించి మరియు ఎప్పటికప్పుడు సమీక్షించవలెను.

ఎ) ప్రజలు తరచుగా సందర్శించే కేంద్ర ప్రభుత్వ వ్యవస్థల తెలుగు భాష వాడకంపై తగు ఆదేశాలు జారీ చేయవచ్చును.

ఏ) తెలుగు మీడియం సంస్థల స్థితిగతులు సమీక్షించి మరియు

వాటి కొనసాగింపుకు అవసరమైన చర్యలు చేపట్టవలెను.

ఐ) రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయిలలో అవసరమైన కార్యాలయాలను ఏర్పాటు చేయవలెను.

ఒ) ఇంటర్మీడియట్ (మాధ్యమిక విద్య) లేక తత్సమానమైన తరగతుల వరకు తెలుగు మొదటి భాషగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేయవలెను.

ఓ) ఇంటర్మీడియట్ లేదా తత్సమానమైన తరగతి విద్యార్థుల అధ్యయన స్థాయిని పరీక్షించ వలెను.

ఔ) డిగ్రీ స్థాయి వరకు అన్ని సెమిస్టర్‌లో తెలుగు భాషను ఒక పాఠ్యాంశంగా బోధించేటట్లు చర్యలు తీసుకొనవలెను

అం) వైద్యం, ఇంజనీరింగ్ మరియు లా వంటి అన్ని సాంకేతిక కోర్సులలో తెలుగు భాషను ఒక పాఠ్యాంశంగా బోధించేటట్లు చర్యలు తీసుకొనవలెను.

అః) అన్ని ఆంగ్ల మాధ్యమ విద్యా సంస్థలలో తెలుగు భాషను ఒక పాఠ్యాంశంగా బోధించేటట్లు చర్యలు తీసుకొనవలెను.

క) అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక విద్య తెలుగు మాధ్యమంలో జరిగేటట్లు చర్యలు తీసుకొనవలెను.

ఖ) భారత ప్రభుత్వ ప్రాచీన తెలుగు భాషా కేంద్రం (సెంటర్ ఫర్ తెలుగు క్లాసికల్ లాంగ్వేజ్) నిర్వహించే ప్రాజెక్టు వర్కును సమన్వయం చేసుకొనవలెను.

## భాగము - 5

### సిబ్బందికి సంబంధించిన నిబంధనలు

**7. సిబ్బంది నియామకం :**

సర్వీసు కాంట్రాక్టు ద్వారా లభ్యమయ్యే హౌస్ కీపింగ్, సెక్యూరిటీ, హాస్పటాలిటి మరియు ఇతర సేవలకు సంబంధించిన ఏ సిబ్బందిని పొరుగు సేవల సంస్థ (ఔట్ సోర్సింగ్ ఏజన్సీ) ద్వారా నియమించరాదు.

## భాగము - 6

### ఆర్థిక నిబంధనలు

**8. స్థాపన మరియు పరిపాన తెలుగు భాషాభివృద్ధి నిధి :**

1) ప్రభుత్వ ఆదేశాలకు లోబడి తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ అజమాయిషి మరియు పాలనా వినియోగం కొరకు 25 కోట్ల రూపాయల మూలధనం (సీడ్ క్యాపిటల్) తో ఏర్పాటు చేసిన నిధి "తెలుగు భాషాభివృద్ధి నిధి" గా వ్యవహరించబడుతుంది.

2) ప్రభుత్వం ప్రత్యేక ఆదేశాలు ఇస్తే తప్ప ఈ నిధికి సమకూరే ధనమంతా ఒక షెడ్యూలు బ్యాంకునందు జమ చేయవలెను.

3) పన్ను వసూళ్లలో ప్రభుత్వం నిర్ణయించిన శాతం ఈ నిధికి జమ చేయబడుతుంది.

4) ప్రభుత్వ కార్పోరేషన్‌లు వారి మిగులు ఆదాయంలో 15 శాతం మించకుండా వారి విచక్షణ మేరకు ఈ నిధికి గ్రాంటుగా ఇవ్వవచ్చును.

5) ప్రైవేటు వ్యక్తుల విరాళాలు మరియు ఇతరులు వన మార్గాల ద్వారా అనగా రాత మూలకంగా సంక్రమించే నిధులు, వస్తువులు, ఆస్తులు, సేవలు మరియు స్వచ్ఛందంగా ఇచ్చిన వాటితో నిధులు సమకూర్చు కొనవచ్చును.

6) ఆదాయం పన్ను మరియు కార్పొరేట్ పన్ను విషయంలో ఈ నిధి ప్రభుత్వ నిధిగా పరిగణించబడుతుంది.

7) ముఖ్య కార్యనిర్వహణాధికారి రోజువారి నిధి నిర్వహణలో బాధ్యత వహించవలసి ఉంటుంది.

**9. ఆర్థిక అధికారాలు బదిలీ చేయుట :**

బోర్డు మరియు ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఇచ్చే ఆదేశాలకు లోబడి చట్టంలోని సెక్షన్ - 26 ప్రకారం డెలిగేషన్ ఆఫ్ పవర్ ద్వారా ఈ నిధి నుండి ముఖ్య కార్యనిర్వహణాధికారి రూ.10.00 లక్షల వరకు పాలనాపరమైన మంజూరు ఇవ్వవచ్చును.

## భాగము - 7

### ఇతర నిబంధనలు

**10. నేరాలు మరియు జరిమానాలు :**

1) ఏదైనా సంస్థ యజమాని తన సంస్థ పేరును తెలిపే నామ ఫకాన్ని తెలుగులో ప్రదర్శించక పోతే ఆ యజమాని రూ.50,000/- వరకు విధించే జరిమానాలతో శిక్షార్హుడు. ఆ యజమాని రెండుసార్లు అదే నేరానికి పాల్పడినట్లయితే జరిమానాతో పాటు మూడు నెలలకు మించకుండా జైలు శిక్ష విధించవచ్చును.

2) ప్రభుత్వం నిర్దేశించిన విధంగా శంకుస్థాపన లేదా ప్రారంభోత్సవ సమయాలలో బాధ్యులైన ప్రభుత్వ శాఖాధిపతి లేదా సంస్థాధిపతి తెలుగులో శిలాఫలకాల తయారీలో విఫలమైతే రూ. 10,000/- వరకు జరిమానా విధించ వచ్చును.

3) ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఇతర శాఖలతో గాని, ప్రజలతో గాని తెలుగులో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపని శాఖాధిపతి లేదా సంస్థాధిపతికి రూ. 5,000/- వరకు జరిమానా విధించవచ్చును.

4) ప్రభుత్వం నిర్దేశించిన విధంగా అధికార భాషగా తెలుగు అమలును సమీక్షించని శాఖాధిపతికి రూ. 5,000/- వరకు జరిమానా విధించవచ్చును.

5) ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి ప్రజలతో జరిపే కార్యకాలాపాలలో తెలుగు భాషను ఉపయోగించని యెడల రూ. 10,000/- వరకు జరిమానా విధించవచ్చును.

6) ప్రభుత్వం నిర్దేశించిన విధంగా తెలుగును పాఠ్యాంశంగా గాని, బోధనా మాధ్యమంగా గాని అమలు చేయని ఏదైనా విద్యా సంస్థాధిపతికి రూ. 50,000/- జరిమానా లేదా 6 నెలలకు మించకుండా జైలు శిక్షను విధించవచ్చును.

11. పరివర్తనకాలిక నిబంధనలు : అప్పటి శాఖలో గల ఆస్తులు, బాధ్యతలు, విధులు మరియు ఉద్యోగుల యొక్క బదిలీలకు సంబంధించిన నిబంధనలు చట్టంనందు మూడవ షెడ్యూలు నందు ఏర్పాటు చేసియున్నారు.

ఈ నియమము ఆర్థిక ( ఎఫ్ఎమ్‌యు- జిఏడి.- ॥) శాఖ వారి యు.ఓ.నోటు నెం.37027/80/ఎఫ్ఎమ్‌యు- జిఏడి/ 2017, తేది.06-04-2018 ద్వారా ఇచ్చిన ఆమోదముతో జారీ చేయబడినవి.

(ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ గారి ఉత్తర్వుల మేరకు వారి పేరు మీదుగా జారీ చేయడమైనది)

ముఖేష్ కుమార్ మీనా ఐఏఎస్.
ప్రభుత్వ కార్యదర్శి

కీ.శే. జె. వీరాస్వామి
ఆంధ్రప్రదేశ్ పబ్లిక్‌సర్వీస్ కమీషన్ పూర్వ సభ్యులు

# అధికార భాషగా తెలుగు – చట్టనిర్మాణం : న్యాయపాలన

మన రాజ్యాంగ చట్టములో, మన దేశ అధికారభాష విషయమై కొన్ని నిబంధనలు చేయబడియున్నవి. ఈ రాజ్యాంగ చట్టపు 343వ ఆర్టికల్ ప్రకారము, హిందీ మన* జాతీయభాషగ ఆమోదింపబడియున్నది. అయితే, ఆర్టికల్ 348 ప్రకారము, పార్లమెంటు మరొక విధముగ నిబంధన చేయువరకు, పార్లమెంటులో ప్రవేశ పెట్టబడు బిల్లుల యొక్కయు, వాటికి చేయబడు సవరణల యొక్కయు, పార్లమెంటుచేగాని రాష్ట్ర విధాన మండలులచే గానీ చేయబడు చట్టముల యొక్కయు, రాష్ట్రపతిచేగాని, గవర్నర్లచేగాని జారీచేయబడు ఆర్డినెన్సుల యొక్కయు, రాజ్యాంగ చట్టము క్రిందగాని పార్లమెంటు లేక రాష్ట్ర విధాన మండలులచే చేయబడు చట్టముల కిందగాని చేయునియమములు, రెగ్యులేషన్లు మొదలైన వాటి యొక్కయు అధికారిక పాఠములు ఇంగ్లీషు భాషలోనే ఉండవలసి యున్నది. ఈ నిబంధనను పురస్కరించుకొని అధికార భాషల చట్టము 1963లో కేంద్రచట్టము చేయబడినది. ఈ చట్టపు 5వ సెక్షను ప్రకారము, ఏదేని కేంద్రచట్టము లేక రాష్ట్రపతిచే జారీ చేయబడిన ఏదేని ఆదేశముయొక్క లేక రాజ్యాంగ చట్టము క్రిందగాని ఏదేని కేంద్ర చట్టము క్రిందగాని జారీచేయబడిన నియమములు, రెగ్యులేషన్లు మొదలైన వాటి యొక్క హిందీ అనువాదము రాష్ట్రపతి అధికారము క్రింద అధికారిక గెజెట్‌లో అందు నిమిత్తమై నియమింపబడిన తేదీనుండి ప్రచురింపబడనిచో, అది చట్టము యొక్క లేక ఆ నియమములు, లేక రెగ్యులేషన్ల యొక్క అధికారిక పాఠమై యుండును. రాజ్యాంగ చట్టపు 345వ ఆర్టికల్ ప్రకారము రాష్ట్రములు ఆయా రాష్ట్రములలో వాడుక యందున్న భాష, లేక భాషలను, తమ తమ అధికార భాషలుగ చేసుకొనవచ్చును. ఈ నిబంధనను పురస్కరించుకొని, ఆంధ్రప్రదేశ్ అధికార భాషా చట్టము 1966లో చేయబడినది. ఈ చట్టపు 2వ సెక్షను ద్వారా తెలుగు మన రాష్ట్రపు అధికార భాషయై యుండునని నిబంధన చేయబడింది. రాష్ట్ర విధాన మండలిలో ప్రవేశపెట్టబడు బిల్లులలోను, విధానమండలిచే చేయబడు చట్టములలోను, గవర్నరుచే జారీచేయబడు ఆర్డినెన్సులు మొదలగు వాటిలోను, వాడబడు భాష ఇందునిమిత్తమై అధికారిక గజెట్‌లో నోటిఫికేషన్ ద్వారా నియమింపబడు తేదీనుండి తెలుగు భాషయై యుండవలెనని మూడవ సెక్షను ద్వారా నిబంధన చేయబడి యున్నది. పై చెప్పబడిన నోటిఫికేషను జారీ చేయబడువరకు ఆ ప్రయోజనము కొరకు ఇంగ్లీషు భాషయే వాడబడవలెనని నాల్గవ సెక్షను చెప్పు చున్నది. ఏదేని కేంద్రచట్టము యొక్క లేక రాష్ట్ర చట్టముయొక్క, లేక గవర్నరుచే జారీచేయబడిన ఏదేని – ఆర్డినెన్సు, లేక రెగ్యులేషన్ యొక్క లేక కేంద్రచట్టముల క్రిందగాని, రాష్ట్ర చట్టముల క్రిందగాని జారీ చేయబడిన నియమములు మొదలగు వాటియొక్క తెలుగు అనువాదము గవర్నరు అధికారము క్రింద, అధికారిక గెజెట్స్‌లో ఇందునిమిత్తమై జారీ చేయబడు నోటిఫికేషన్‌లో నిర్దిష్టపరచబడిన తేదీన ~~ప్రచురింపబడినచో, అది ఆయా చట్టము లేక నియమములయొక్క~~ తెలుగు భాషా అధికారిక పాఠముగ పరిగణింపబడునని ఆరవ సెక్షను ద్వారా నిబంధన చేయబడియున్నది.

**పై చెప్పబడిన వివిధ నిబంధనల వలన చట్టనిర్మాణము మౌలిక ముగ తెలుగుభాషలోనే జరుగుటకు బదులు, ప్రస్తుతము, అమలునందున్న చట్టములన్నియు తెలుగుభాషలోకి అనువదింపబడ వలసియున్నవి.** ఇంగ్లీషుభాషలో నున్న చట్టములను తెలుగులోకి అనువాదము జరుపుట చాల కష్టమైనపని అని చెప్పవచ్చును. ఇంగ్లీషుభాష అంతర్జాతీయ భాష యగుటచే అది చాల అభివృద్ధి నొందిన భాషయైయున్నది. తెలుగుభాష పరిపాలనా కార్యక్రమాలలో అంతగా అభివృద్ధి చెందిన భాష కాదు. ఇంగ్లీషు భాషలో ఏ భావము నైనను వ్యక్తీకరించుటకు చాలినంత పద జాలమున్నది. అదియునుగాక, ఒకే ఇంగ్లీషు పదమునకు ఒకటికన్న ఎక్కువ అర్థములున్నవి. అందువలన ఒకే ఇంగ్లీషు పదమునకు వేరు వేరు అర్థములతో అది ఉపయోగింపబడిన సందర్భమును బట్టి వ్యాఖ్యానము చేసికొనవచ్చును. ఇది న్యాయస్థానముల తీర్పుల ద్వారా ఖరారు చేయబడినది. కనుక ఇట్టి ఇంగ్లీషు పదమునకు ఒక తెలుగు పదము నియమించినచో అదే పదము ఆ ఇంగ్లీషు పదము వాడబడిన అన్ని సందర్భములలోను వాడుటకు వీలు పడదు. దీనికి ముఖ్యకారణము తెలుగు పదములకు న్యాయస్థానముల తీర్పుల వ్యాఖ్యానాలు లేవు. అందువలన సందర్భమునుబట్టి తెలుగు సమానార్థకము మార్చబడవలసియున్నది. కొన్ని ఇంగ్లీషు పదములకు తెలుగు భాషలో సమానార్థ పదములుగాని భాషలోని పదములనుగాని వెదుకవలసి యున్నది. అట్టి సందర్భములలో తెలుగు భాషలో ఇమిడియుండి, ఆ భావమును వ్యక్తీకరించు పరభాషా పదములను గూడా వాడవలసి యున్నది. కొన్ని ఇంగ్లీషు పదములు సామాన్య నిరక్షరాస్యునిచే గూడ నిత్యము వాడబడుచున్నవి. అట్టి పదములకు తెలుగుభాషలో సమానా ర్థకములు సులభముగ దొరకవు. అందువలన అట్టి పదములకు సామాన్య మానవుని కర్థముకాని ఏ పరభాషా పదములనో లేక వినసొంపుగా నుండని ఏ అచ్చ తెలుగు పదములనో సమానార్థకములుగ వాడి ఆ భావమును వ్యక్తీకరించుటకు బదులు అట్టి ఇంగ్లీషు పదములనే అను వాదములో ఉపయోగించుట బాగుగనుండును.

న్యాయస్థానములు రాష్ట్ర చట్టముల నే గాక కేంద్రచట్టములను కూడ అమలు పరచవలసియున్నది. కాన కేంద్రచట్టములలోను రాష్ట్ర చట్టములలోను వాడబడు తెలుగు పదజాలము, వాక్య నిర్మాణము ఒకటి గనే ఉండవలెను. కేంద్రచట్టములతోపాటు అన్ని రాష్ట్రముల చట్టములను కూడ సుప్రీంకోర్టు అమలు పరచవలసి యున్నందున సమైక్యతకొరకై కొన్ని సాంకేతిక పదములకును, పదబంధములకును సమానార్థ కములనబడు కొన్ని సమానార్థపదములను కేంద్ర అధికారభాష లెజి స్లేటివ్ కమీషనువారు రూపొందించినారు. వీటిని వాడుటవసరమే. కాని అట్టి కొన్ని సమానార్థకములు మనభాషలో వేరు అర్థమునిచ్చుచు ఆయా సందర్భములలో వాడబడుటకు వీలుండక పోవచ్చును. అట్టి సమానార్థక ములు మినహా మిగిలిన అఖిల భారత

* హిందీ మన కేంద్ర ప్రభుత్వ అధికారభాష (official language) మాత్రమే. జాతీయ భాష కాదు – సంపాదకుడు

సమానార్థకములను వాడుట ఎంతైనను సమంజసముగ తోచుచున్నది. న్యాయస్థానములు చట్ట నిర్మాణములో వాడబడిన కొన్ని పదముల, పదబంధముల పైనను, వాడ బడిన వాక్య నిర్మాణము పైనను కొన్ని వ్యాఖ్యలను చేసియున్నవి. అట్టి వ్యాఖ్యలు కోట్లాది ప్రజల జీవితములతోను, వారి ఆస్తిహక్కులతోను ముడి పెట్టబడి యున్నవి. అందువలన అనువాదమును జరుపుటలో ఈ వ్యాఖ్యల ద్వారా ఆ పదములకును పదసంబంధములకును, వాక్యనిర్మాణమునకును న్యాయస్థానములచే ఈయబడిన భావము రూపొందింపబడునట్లు చూచుట అనువాదకుని ముఖ్య కర్తవ్యమైయున్నది.

ఏ భాష ఉపయోగించాలో ప్రకటించడానికి సివిలు ప్రొసీజర్ కోడు యొక్క 137వ సెక్షన్ ప్రభుత్వానికి అధికారమిస్తున్నది. క్రిమినల్ ప్రొసీజరు కార్యాలకొరకు ఏభాష హైకోర్టు, క్రింది న్యాయస్థానాల భాషగా ఉండాలో నిర్ణయించడానికి క్రిమినల్ ప్రొసీజరుకోడు యొక్క 272వ సెక్షను, ప్రభుత్వానికి అధికారమిస్తున్నది. హైకోర్టు విషయంలో రాజ్యాంగంలోని 348వ ఆర్టికలులో అనుమతిదాయకమైన నిబంధన ఒకటి ఉంది.

**తెలుగును న్యాయస్థానాల అధికార భాషగా ప్రకటించడానికి పూర్వం తీసికొనవలసిన చర్యలలో ముఖ్యమైనవి :**

**1. ఇప్పుడు అమలులోనున్న చట్టాలు, ఆదేశాలు మొదలైన వాటన్నింటికి తెలుగు అనువాదాలు తయారు చేయించడం.**

**2. ఇప్పుడు, ఇకముందు చేసే చట్టాల, బిల్లుల మౌలిక ముసాయిదాలను తెలుగులోనే విధానమండలిలో ప్రవేశ పెట్టడం.**

ఇప్పుడు అమలులోనున్న చట్టాలు మొదలైనవాటికి తెలుగు తర్జుమాలు చేయించడానికి ప్రభుత్వం 1964లో న్యాయశాఖలో కొంతమంది సిబ్బందిని నియమించి, వారు చేసిన అనువాదాలను పరిశీలించి ఆమోదించడానికై ఒక అనువాద కమిటీని ఏర్పాటు చేసింది. న్యాయశాఖలోని, అనువాద విభాగంలో పెక్కు రాష్ట్ర మరియు కేంద్ర చట్టాలను తెలుగులోనికి అనువదించినట్లు చెప్పబడుతున్నది. కాని ఆ అనువాదాలు అనువాద కమిటీ పరిశీలించి ఆమోదించినవే తప్ప అధికారిక అనువాదాలు కాజాలవు. ఈ కమిటీ స్థానంలో ఎవరేని ఒక సమర్థుడైన ప్రత్యేకాధికారిని నియమించినట్లయితే ఈ పని శీఘ్రంగా జరుగడానికి వీలవుతుందేమో ప్రభుత్వం పరిశీలించాలి. నేటివరకు ప్రధానంగా సాహిత్యరంగంలో మాత్రమే అభివృద్ధి చెందిన తెలుగుభాషను ఇప్పుడు పరిపాలనా రంగంలో చట్టాలలో కూడా ఉపయోగించినప్పుడు భాషాపరమైన కొన్ని ఇబ్బందులను ఎదుర్కొనక తప్పదు.

ఆంగ్ల భాషలోకూడ, చట్టాల రచనలో ఉపయోగించబడు పదజాలము, వాక్యనిర్మాణం కొంచెం వింతగానే ఉంటాయి. ఒక చట్టానికి కేవలం అనువాదం చేయటంలో ఉండే భాషాపరమైన స్వాతంత్ర్యం ఆ చట్టం యొక్క అధికారిక పాఠంగా ఉండగల అనువాదం చేయడంలో ఉండదనే విషయం మనం స్పష్టంగా గ్రహించాలి. ఆంగ్లపాఠంలో వాడబడుతున్న పదబంధాలు కొన్ని రూఢియైన అర్థాలను ఏర్పరచుకొన్నాయి. ఆ పదబంధాలన్నింటికి సరియైన అర్థాలలో మనకు తెలుగులో వాడుకలో ఉన్న పదాలు దొరకకపోవచ్చు. ఇలాంటివి ఎన్నో చిక్కులు తెలుగును సాంకేతిక రంగంలో ఉపయోగించినప్పుడు ఎదురవుతాయి.

న్యాయశాస్త్రం సాంకేతికమైనది. ఇది ఇతర విజ్ఞానశాస్త్రాలకంటే ఎక్కువ సాంకేతిక లక్షణం గల శాస్త్రం. ఎందుచేతనంటే విజ్ఞాన శాస్త్రాలలో ఉపయోగించబడిన పదాలకు విపరీత అర్థాలు ఆపాదించి వ్యాఖ్యానం చేయటానికిగల అవకాశాలు చాల తక్కువ. కాగా చట్టాలు న్యాయస్థానాల్లో ఎల్లప్పుడూ వ్యాఖ్యానించబడుతుంటాయి. ఇట్టి వ్యాఖ్యానాలవల్ల కోట్లాది ప్రజల ఆస్తులు, హక్కులు ప్రభావితం అవుతుంటాయి. కాబట్టి చట్టాల్లో వాడబడే సాంకేతిక పదజాలాన్ని ఎంచుకోవడంలోను, వాక్య నిర్మాణంలోనూ స్పష్టమైన సూత్రాలను పాటించడం అవసరం కాబట్టి ప్రభుత్వం ముందుగా ఇట్టి సూత్రాలను రూపొందించడానికి న్యాయశాస్త్రజ్ఞు లతోను, భాషావేత్తలతోను కూడిన ఒక నిపుణుల సంఘాన్ని నియమించాలి. అన్ని చట్టాలలోను సర్వ సామాన్యముగ ఉప యోగింప బడుచుండు కొన్ని నిబంధనలకు నమూనా తర్జుమాలను కూడా ఆ సంఘం తయారుచేయాలి. న్యాయశాఖలో చట్టాల అనువాదాలకు అట్టి సూత్రాలు మరియు నమూనాలు ఆధారంగా ఉండాలి. ఆ ప్రకారం అనువాదాలకు తుదిరూపమిచ్చే బాధ్యత న్యాయశాఖలో ఒక ప్రత్యేకాధికారికి అప్పగించవలెను. అట్టి అధికారి ఆ అనువాదాలను ఆమోదించిన మీదట అవి గవర్నరు అధికారం కింద ప్రచురింపబడినపుడు న్యాయస్థానాలు వాటిని ప్రామాణిక పాఠాలుగా గుర్తిస్తాయి.

**అయితే ఎల్లకాలం ఈ చట్టాలు అనువాదాల రూపంలోనే ఉండడం సమంజసం కాదు. ఏదేని చట్టంలో మౌలిక మైన మార్పులు చేయడానికి ప్రభుత్వం తలపెట్టినపుడు ఆ మార్పులతో సహా ఆ మొత్తం ఆంగ్ల చట్టంలోని నిబంధనలను పొందుపరుస్తూ విధానమండలిలో తెలుగులోనే బిల్లును ప్రవేశ పెట్టాలి. ఆ బిల్లు చట్టరూపం దాల్చినమీదట ఆ ఆంగ్ల చట్టం రద్దుకావడానికి అందులో నిబంధన చేయబడాలి. ఈ విధంగా ఒక నిర్ణీత కాలవ్యవధిలో ఇప్పుడున్న ఆంగ్ల చట్టాలను రద్దుచేసి వాటిస్థాయిలో చట్టాలు తెలుగులోనే వచ్చినప్పుడు అనువాదాల అవసరం లేకుండా పోతుంది.**

ఇక తెలుగులోనే మౌలిక ముసాయిదా రచనలను గురించి పరిశీలిద్దాం. రాష్ట్ర విధానమండలిలో ప్రవేశ పెట్టే బిల్లులు, గవర్నరు జారీ చేసే ఆర్డినెన్సులు మొదలైన వాటికి అధికార గెజిట్‌లో ప్రకటన ద్వారా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించు తేదీ నుండి తెలుగు ఉపయోగించాలని ఆంధ్రప్రదేశ్ అధికార భాషాచట్టం 1966 యొక్క 3 వ సెక్షను నిబంధన చేస్తున్నది. అయితే చట్టాలను తెలుగులోనే చేసినప్పటికి సుప్రీంకోర్టులోను, హైకోర్టులలోను ఉపయోగించే భాషలో కూడ అధికార పాఠాలను సమకూర్చక తప్పదు. సుప్రీంకోర్టు మరియు హైకోర్టుల భాష ఇంగ్లీషు కానీ, హిందీకాని అయి యుండవచ్చును. అందుకోసం విధానమండలి ఇంగ్లీషు, హిందీ భాషలలో కాకుండ ఏదేని ఇతర భాషలో ఒక చట్టాన్ని ఆమోదించినట్లయితే ఆ చట్టాన్ని ఇంగ్లీషు, హిందీ భాషలలోనికి అనువదించి గవర్నరు అధికారం క్రింద ప్రచురించా లని, ఆ అనువాదాలను చట్టం యొక్క ఇంగ్లీషు, హిందీ అధికారిక పాఠా లుగా భావించాలని రాజ్యాంగం యొక్క 348వ

గుండెలోతుల్లోంచి వచ్చేదీ, మనసు విప్పి చెప్పగలిగేది అమ్మనుడిలోనే.

# సాంస్కృతిక వైవిధ్యం విభిన్న భాషల వల్లనే సాధ్యం

డా॥విలయనార్ ఎస్. రామచంద్రన్ కాలిఫోర్నియా విశ్వ విద్యాలయంలో నాడీ శాస్త్రం (నృశాస్త్రం)లో ప్రొఫెసర్. ప్రపంచ ప్రఖ్యాతి చెందినవారు. వారొక పత్రికకు చాలా ఏళ్ళక్రితం ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పిన మాటలు :

*"మనిషిలోని ముఖ్య లక్షణం మానవత్వం. ఇది సాంస్కృతిక వైవిధ్యం వల్లనే సాధ్యమౌతుంది.*

*ఒక పిల్లవాడిని ఒక తోడేలు అడవిలోని తన గుహలో పెంచిందనుకుందాం... ఆ పిల్లవానికి మానవత్వం అబ్బదు. మనిషిలో సంస్కృతి ఉంటేనే మానవత్వం ఉంటుంది. కాని నైతిక కారణాల వలన కాదు. మనం మన సాంస్కృతిక వైవిధ్యాన్ని కాపాడుకొనకపోతే మానవ జాతి మనుగడే ప్రశ్నార్థకమౌతుంది.*

*మనకు రంగురంగుల పువ్వులు ఉన్నాయి. మన మెదడు ఆ రంగులనన్నిటినీ పోల్చుకుంటుంది. ఆ రంగుల కలయిక వలన వచ్చిన అందాన్ని గుర్తిస్తుంది. అదే, అన్ని పువ్వులూ ఒక్క తెలుపు రంగులోనే ఉన్నాయనుకోండి. ఆ రంగే దానికి తెలుస్తుంది. ఇన్ని రంగుల వలన వచ్చిన మానసిక ఆనందం అప్పుడు ఆ మెదడుకు తెలియదు. ఫలితం ఆ దిశలో మెదడుకు ఎదుగుదల ఉండదు. ఇలాగే ఇది అన్ని విషయాలకూ వర్తిస్తుంది మెదడుకు ఎదుగుదల లేకపోతే మనిషి మనిషిగా ఉండలేడు. అందుచేత మానవ మనుగడకు సాంస్కృతిక వైవిధ్యం ఎంతో అవసరం. అందువలన అనేక దేశాలు, అనేక జాతులు, అనేక భాషలు, అనేక సంస్కృతులు ఎంతో అవసరం. సాంస్కృతిక వైవిధ్యం మానవ మనుగడకే మూలం".*

ఇప్పుడు రవాణా సౌకర్యాలు, వార్తా సౌకర్యాలు బాగా పెరిగాయి. మన ప్రపంచం ఇప్పుడు ప్రపంచగ్రామం కాబోతున్నదనే మాటలు వింటున్నాం. ఒకే రకమైన భాష మాట్లాడడం, ఒకే రకమైన దుస్తులు ధరించడం, ఒకే రకమైన ఆహారం తీసుకోవడం, ఒకే రకమైన ఆటలు ఆడడం. ఒకే రకమైన హావభావాలు ప్రకటించడం సుదూర కాలంలోనే చూస్తామంటున్నారు.

ఆ మధ్య ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ఒక ఆంగ్లమాసపత్రికలో భవిష్యత్తులో మనం తినే ఆహార వస్తువులు కేవలం బియ్యం, మొక్కజొన్నలు, పెసలు, కాకరకాయలు, అరటి పళ్లేనని, మిగిలినవి నశించి పోతాయని, ప్రపంచీకరణ వలన ఈ విధమైన సాంస్కృతిక విధ్వంసం జరగబోతుందని, సాంస్కృతిక వైవిధ్యం లేకపోతే ఇంత ప్రమాదం ఉందని రాశారు.

సాంస్కృతిక వైవిధ్యం విభిన్న భాషల వల్లనే సాధ్యం. అందుకైనా మనం మన మాతృభాషను సజీవంగా ఉంచుకోవాలి. సుసంపన్నం చేసుకోవాలి.

కణుగుల వేంకటరావు
8330949562

ఆర్టికలులోను, కేంద్రంచేసిన అధికార భాషల చట్టం యొక్క 6 వ సెక్షనులోను నిబంధన చేయబడింది. అందువల్ల తెలుగులోనే చేయబడిన చట్టాలను ఇంగ్లీషు లేక హిందీలోనికి విధిగా అనువదించవలసి ఉంటుంది.

ఒకటిన్నర శతాబ్దానికి పైబడి ఆంగ్ల భాషలో చట్టాలు చేయబడుతున్నాయి. అట్టి చట్టాలలోని పదబంధాలు కొన్ని రూఢియైన విశిష్టార్థాలను సంతరించుకొన్నాయి. గడచిన అనేక దశాబ్దాలలో ప్రీవీ కౌన్సిలు లేదా సుప్రీంకోర్టు మరియు హైకోర్టులు ఆ చట్టాల వ్యాఖ్యానానికి సంబంధించి కొన్ని సువ్యవస్థిత సూత్రాలను రూపొందించాయి. ఆంగ్ల భాషలో చట్టాల ముసాయిదా రచన గురించి అనేక ప్రామాణిక గ్రంథాలు వెలువడ్డాయి. కాగా, ఏ కాలంలోను ఇదివరకెన్నడును తెలుగుభాషలో చట్టాలు చేయబడలేదు. తెలుగులో మౌలిక ముసాయిదా రచన గురించి ప్రామాణిక గ్రంథాలేవియు వెలువడలేదు. ఇప్పుడు చట్టాల ముసాయిదా రచనను తెలుగుభాషలో ఒకకొత్త ప్రక్రియగా రూపొందించవలసి ఉంటుంది.

**చట్టాలు ఏ భాషలో రచించినప్పటికి ముసాయిదా రచనకు సంబంధించిన ప్రాతిపదిక సూత్రాలు మారవు. కాబట్టి ఆంగ్లభాషలో చట్టాల రచన కొరకు స్థిరపడిన సూత్రాలనే తెలుగులో చట్టాల ముసాయిదా రచనలో దృష్టిలో ఉంచుకొని తెలుగుభాషా సంప్రదాయాన్ని, విశిష్టతను సాధ్యమైనంతవరకు పాటిస్తూ ఉండాలి. ఇప్పుడు అమలులోనున్న ఆంగ్ల భాషా చట్టాలను అనువదించే అనువాదకుని కంటే తెలుగులో మౌలిక రచనకు పూనుకునే ముసాయిదాదారుకు ఎక్కువ స్వేచ్ఛ ఉండగలదు. అయినప్పటికిని తెలుగులో మౌలిక ముసాయిదా రచనా విధానం ఇప్పటి చట్టాల అధికారిక తెలుగుపాఠాలకు భిన్నమైనదిగా ఉండదనీ, ఉండకూడదనీ గుర్తించడంగూడా అవసరం. అనువాద దశ నుండి మౌలిక ముసాయిదా రచన దశకు దారి తీసే పరివర్తన క్రమంలో అస్తవ్యస్త పరిస్థితి ఏర్పడకుండ చూడాలి.**

అనువాదాలలో తుదిరూపం పొందిన తెలుగు శబ్దాలను, పదబంధాలను మౌలిక ముసాయిదా రచనలో కూడ అదే అర్థంలో ఉపయోగించవలెను. చట్టాల అనువాదంలోను, మౌలిక ముసాయిదా రచనా ప్రక్రియలలోను తెలుగు భాషలో కొంతవరకు కొత్త పారిభాషిక పదజాలము, కొన్ని పదాలకు కొత్త అర్థాలు ఏర్పడతాయి. ఇతర భాషా పదాలను కొన్నింటిని తెలుగుభాష తనలో ఇముడ్చుకుంటుంది. తద్వారా తెలుగుభాష యొక్క బహుముఖ వికాసానికి అనుకూల పరిస్థితులేర్పడుతాయి. అ

ఈ వ్యాసాన్ని - తెలుగు అకాడమీ (1976) ప్రచురించిన "ప్రయోజనాత్మకమైన తెలుగుభాషా సదస్సు - (జూన్ 10 -11, 1976 హైదరాబాదు)" పుస్తకం నుండి తీసుకోవడమైనది - తెలుగు అకాడమీకి ధన్యవాదాలు -
సం.

వీవెన్
9963029061

తెలుగు భాషకు ఆధునిక హోదా-7



# తెలుగులో సంపాదన అవకాశాలు

ధనమూలమ్ ఇదమ్ జగత్! నేటి మార్కెట్ - ఆధారిత ప్రపంచంలో డబ్బు చుట్టూనే అన్నీ తిరుగుతున్నాయి. ఎందుకంటే, ఏ మనిషీ స్వయం సమృద్ధితో లేడు లేదా ఉండడు - తనక్కావలసిన వాటన్నిటినీ తనే తయారుచేసుకోలేడు కదా. నిత్యావసరాల నుండి విలాసాల వరకూ ఏమి సమకూర్చుకోవాలన్నా - తేలికగా మార్పిడి అవుతుంది కాబట్టి - డబ్బు కావాలి. సంపాదన అవకాశాలు అంటే ఉద్యోగ అవకాశాలు మాత్రమే కాదు, వ్యాపార అవకాశాలతో కూడి అన్ని రకాల ఉపాధి అవకాశాలు కూడా. తెలుగుకి మార్కెట్ పెరిగితే తెలుగువారికి సంపాదన అవకాశాలు కూడా సహజంగానే పెరుగుతాయి. ప్రపంచీకరణ పెరుగుతున్నకొద్దీ వ్యక్తుల సంపాదనకు అదనపు అవకాశాలు వచ్చి చేరాయి. కానీ అవి అసలు (స్థానిక) అవకాశాలను మింగివేసే స్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలో తెలుగుకి పునర్వైభవం గురించి సంపాదన అవకాశాల గురించి ఆలోచనలు ఈ వ్యాసం.

## మార్కెట్ - స్వచ్ఛందం

వివిధ అవసరాలున్న వ్యక్తులు / సంస్థలు విలువ మార్పిడి ద్వారా ఆ అవసరాలను తీర్చుకోవడం కోసం ఒక దగ్గరికి రావడం వల్ల ఏర్పడిందే మార్కెట్టు. అవసరాలు భౌతికం కావచ్చు, మానసికం కావచ్చు. ఈ ప్రపంచంలో దేనికైనా మార్కెట్టు ఉంటేనే అది ఉన్నట్టు. డిమాండును బట్టే సరఫరా. ఈ లోకంలో ఏదైనా ఉందంటే దానికి డిమాండు ఉన్నట్టే. తెలుగులో సినిమాలు ఎందుకు తీస్తున్నారంటే, వాటిని చూస్తున్నవారు ఉన్నారు కాబట్టే! వస్తువులు, సేవలూ, నైపుణ్యాలూ, మనిషి సమయమూ అన్నీ - కొనుక్కునేవారు ఉన్నారు కాబట్టి - మార్కెట్టులో అందుబాటులో ఉన్నాయి.

అవసరాలు మళ్ళీ రెండు రకాలు: నిజంగా అవసరం ఉన్నవి, ఊహాజనిత అవసరాలు. వ్యాపారసంస్థలు తమ ఉత్పత్తులను అమ్ముకుంటేనే మనుగడ సాగించగలుగుతాయి. తమ వస్తూత్పత్తులకు మార్కెట్టుని సృష్టించుకోడానికి లేదా ఉన్న దానిలో తమ స్థానాన్ని పెంచుకోడానికి ప్రయత్నిస్తాయి. అందుకోసం ఊహాజనిత ప్రయోజనాలను ఎరచూపి, లేనిపోని గొప్పలతో, కల్పనలతో, తళుకు బెళుకు ప్రకటనలతో (కొండొకచో అబద్ధపు ప్రకటనలతో) జనావళిని ఆకర్షిస్తాయి.

**మార్కెట్లు స్థూలంగా జనాల అభిరుచినే ప్రతిబింబిస్తాయి. వ్యాపారసంస్థలు వారి ఉత్పత్తులకు మార్కెట్టు కల్పించే విధంగా ఈ అభిరుచిని తమవైపు తిప్పుకోడానికి తాపత్రయపడుతుంటాయి. ఒకరో ఇద్దరో కోరుకుంటే అది మార్కెట్ అవదు. కానీ, లక్షలాదిమందికి ఒక అవసరం ఉందంటే, దానికోసం కార్పొరేట్లు వరసకడతాయి.**

మార్కెట్ యొక్క ఈ స్వచ్ఛంద లక్షణాన్ని మనం తెలుగు కోసం వాడుకోవచ్చు. అందుకోసం మనం చేయాల్సిందల్లా తెలుగుకి మార్కెట్ ఉందని తెలిసేలా చేయడమే. మరీ ముఖ్యంగా నిద్ర నటిస్తున్న మనవారికి తెలియజేయాలి.

తెలుగు మార్కెట్: రెండు తెలుగు రాష్ట్రాలు, ప్రపంచమంతటా విస్తరించి ఉన్న తెలుగు మాట్లాడేవారు. ఏటా వందలాది తెలుగు సినిమాలు నేరుగా విడుదల అవుతున్నాయి. మరికొన్ని ఇతర భాషల నుండి తెలుగు లోనికి అనువాదమై విడుదల అవుతున్నాయి. 24 గంటలూ ప్రసారాలు అందించే తెలుగు టీవీ ఛానెళ్ళు దాదాపు నూరు ఉన్నాయి. ఆపై అంతర్జాలంలో నడిచే తెలుగు వెబ్ / యూట్యూబు ఛానెళ్ళూ ఉన్నాయి. అనేక తెలుగు రేడియో ఛానెళ్ళు ఉన్నాయి. తెలుగు వార్తా పత్రికలూ, వార / మాస పత్రికలూ, వీటికి తోడు లెక్కలేనన్ని జాల పత్రికలు ఉన్నాయి. ఇవన్నీ తెలుగుకి ఉన్న మార్కెట్టుని సూచించేవే. ఇవన్నీ పెరుగుతూనే ఉన్నాయి కూడా!

అయితే, ఈ పెరుగుతున్న మార్కెట్టు కొన్ని విషయాలను మాత్రం ప్రభావితం చెయ్యలేకపోతున్నది. కొన్ని విషయాల్లో తెలుగు మార్కెట్ లేకుండా పోయింది లేదా అతి వేగంగా పడిపోతూంది.

(అ) వస్తూత్పత్తులపై పేర్లూ, వాటిని వాడుకునే సూచనలూ, వాటిలో వాడిన పదార్థాల వివరాలు, ఇతరత్రా సమాచారం ఇవేమీ తెలుగులో ఉండటం లేదు.

(ఆ) ప్రభుత్వ ప్రయివేటు వ్యవహారాలు, రాతకోతలు దాదాపు అన్నీ ఆంగ్లంలోనే జరిగిపోతున్నాయి.

(ఇ) పై రెంటి ఫలితంగానో లేక ఇతరత్రా కారణాల వల్లనో జనాలకు ఆంగ్లంపై, ఆంగ్ల మాధ్యమంపై మోజు పెరిగిపోయి చదువుల్లో

తెలుగు లేకుండా పోతూంది.

తెలుగుకి మార్కెట్ ఉందని తెలియజేయడానికి, ఉన్న మార్కెటు ప్రభావాన్ని ఇంకా పెంచడానికి ఈ క్రింది సూచనలను అనుసరించవచ్చు. ఇవి పరోక్ష, దీర్ఘకాలిక మార్గాలు.

సామాజిక మాధ్యమాలలో విరివిగా తెలుగు వాడటం. (అ) రాజకీయ, సామాజిక, ఆర్థిక, వైజ్ఞానిక, సాహిత్య, సాంస్కృతిక, చారిత్రక అంశాలన్నింటి గురించి సమగ్రంగా చర్చలు జరగాలి. (ఆ) వివిధ వ్యాపార సంస్థల గురించి, వాటి ఉత్పత్తుల గురించి తెలుగులో సమీక్షలు, అభిప్రాయాలు, సమస్యలు గట్రా చర్చించడం జరగాలి.

కంపెనీల, వ్యాపార సంస్థల అభిప్రాయ సేకరణల్లోనూ, వారి వినియోగదార్ల సహాయం కేంద్రాల తోటి సంప్రదింపుల్లోనూ వారి ఉత్పత్తులూ, సేవలూ, సమాచారమూ తెలుగులో కావాలని అడగాలి.

ఇప్పటికే తెలుగులో లభిస్తున్న వస్తూత్పత్తులను కొనడం,సేవలను వాడుకోవడం, వాటికి ప్రచారం కల్పించడం చేయాలి.

జాతీయ, అంతర్జాతీయ వేదికలపై తెలుగుకీ, తెలుగువారికీ ప్రాచుర్యాన్నీ, ప్రాముఖ్యతనూ పెంచాలి. అది ఏరంగమైనా కావచ్చు: తెలుగు సినిమాలు, తెలుగు వంటలు, ఆటల్లో, శాస్త్ర సాంకేతిక పరిశోధనల్లో, వాణిజ్యంలో, సేవలో. ఈ దిశగా తెలుగు ప్రజలు పాటుపడాలి. అటువంటి వ్యక్తులకు, కార్యక్రమాలకు ప్రోత్సాహమూ, ప్రచారమూ కల్పించుకోవాలి.

తెలుగు వారికి కళలపై మక్కువ పెరగాలి. అనేక రూపాల్లో కళాసృష్టి జరగాలి. తెలుగువారి 'తలసరి సాంస్కృతిక దిగుబడి' పెరగాలి.

వీటన్నింటికీ మించి, తెలుగువారిలో తెలుగుపట్ల అభిమానం పెరగాలి.

## శాసనం, విధానం - నిర్బంధం

మార్కెట్టులో వివిధ పక్షాల పాల్గోలు స్వచ్ఛందమే. కానీ మార్కెట్టు పరిధినీ జోరునీ నిర్దేశించేవి వివిధ దేశాల చట్టాలూ, ఆయా ప్రభుత్వాల విధానాలూ, వివిధ దేశాల మధ్య ఉన్న ఒప్పందాలు గట్రా.

మార్కెట్టుకి సంబంధం లేని చట్టాల, విధానాల వల్ల కూడా మార్కెట్టు ఏర్పడుతుంది. భాష వరకే చూస్తే ఒక దేశ రాజ్యాంగం గానీ, చట్టాలు విధానాలు గానీ అధికార భాషను, పాలన భాషను నిర్దేశించగలవు. కార్యనిర్వాహక / పాలన వ్యవస్థ దాన్ని అమలు చేయగలదు. తద్వారా పరోక్షంగా చెలామణిలో ఉండే వాడుక భాష కూడా నిర్ణయం అయి పోతుంది. ఇలా శాసన, కార్యనిర్వాహక, పాలన వ్యవస్థల అనుగ్రహం ఉంటే, ఆ భాషదే మార్కెట్.

**కనీసం తెలుగు రాష్ట్రాలలో అయినా తెలుగు అధికార, పాలన, వైజ్ఞానిక, బోధన భాషగా ఉండగలిగితే (వాడుక భాషగా ఎలాగూ ఉందనుకోండి), ఇక్కడి మార్కెట్టు తెలుగుదే అవుతుంది. ఇందులో భాషకి సంబంధించి వచ్చే అవకాశాలూ తెలుగు వారికే చెందుతాయి, దక్కుతాయి. ఇందుకు తగ్గ చట్టాలు మన దగ్గర ఉన్నాయి. విధానాలు ఉన్నాయి. కనీసం అందుకుతగ్గ ఫ్రేమువర్కు ఉంది. వాటి అమలూ, ఆచరణే లేదు. అంటే, నిర్బంధంగా ఉండాల్సినది స్వచ్ఛందమైపోయింది. ఒకే భాషను మాత్రమే రుద్దేంత నియంతృత్వం లేకపోయినా, ఈ నేలపలుకును అనుసరించాలన్న కఠినత్వం కూడా లేకపోయింది.**

అయితే చట్టాలు, విధానాలు మారని, మారకూడని శిలాశాసనాలు కాదు. మన ఆకాంక్షలకు, సమాజ అవసరాలకు అనుగుణంగా వాటిని మార్చుకుంటూనే ఉంటాం. పెట్టుబడిదారీ విధానం వచ్చి, కంపెనీలు ఏర్పడి అవి చట్టబద్ధమైన వ్యక్తిత్వం పొందాకా, అవి కల్పించే ఉద్యోగాల మిషతో-లాబీయింగు వంటి దగ్గర తోవల్లో-అవీ చట్టాల, విధానాల రూప కల్పనలో పెద్ద పాత్రే పోషిస్తున్నాయి. (వ్యాపారస్థులు అన్ని స్థాయిల్లో ప్రజాపతినిధులుగా ఉండడం లేదా ప్రజాప్రతినిధులతో దగ్గరి సంబంధాలు కలిగివుండటం వల్ల అసలు పాత్రే వాటిదని అనేవారూ ఉన్నారు.)

## తాడిని తన్నే వాడి తలదన్నేవాడు

చంచలమూ, స్వచ్ఛందమూ అయిన మార్కెట్టు గమనాన్ని తమకు లాభం కలిగేలా మార్చుకోడానికి అందులో పాల్గొనేవాళ్ళందరూ ప్రయత్నిస్తారు. కానీ ఆ గమనాన్ని ప్రభావితం చేయగలిగేది చేస్తున్నది ఎవరు? ఉదాహరణకు, మార్కెట్టులో ఒక సబ్బు కొనుక్కొనే వినియోగదారుడా లేక సబ్బుల మార్కెట్టులో సగం వాటా ఉన్న వ్యాపార సంస్థా? వ్యాపారసంస్థలే! తమ వస్తువులు అమ్ముకోడానికి వ్యాపార సంస్థలు ప్రకటనలపైనా ప్రచారంపైనా చేస్తున్న ఖర్చుని చూస్తే మార్కెట్టు గమనంపై నియంత్రణ ఎంత ముఖ్యమో తెలుస్తుంది.

సహజంగా నిశ్చలమూ, నిర్బంధమూ అయిన చట్టాలను విధానాలను కూడా వ్యాపార సంస్థలు తమకు అనుకూలంగా మార్చుకోగలుగుతున్నాయి కదా!

లాభమే శ్వాసగా బతికే ఆ పెట్టుబడిదారీ వ్యవస్థ / వ్యాపార సంస్థల తలదన్నాల్సింది మనమే! చిన్నప్పుడు చదువుకున్న 'కలిసివుంటే కలదు సుఖం' కథలో లాగ ప్రజలందరూ 'నాకు నేనే, ఎవడెటుపోతే నాకేంటి' అని విడి కట్టెలలా ఉంటే వంచడమో లేకపోతే విరగగొట్టడమో అవతలి వాడికి తేలికవుతాయి. కట్టెల మోపులాగ కట్టగా ఉంటే వంగకుండా, విరిగిపోకుండా ఉంటాము.

దీన్నే భాష విషయంలో ఆపాదించి చూస్తే-

**తెలుగు వాడాలని ఒకరిద్దరు అనుకుంటే సరిపోదు, లక్షలాది మంది వాడాలి అనుకొని వాడుతూంటేనే తెలుగుకి మార్కెట్టు ఉంటుంది. ఈ ఆకాంక్షలని చట్టాలు విధానాల రూపంలోనికి మార్చుకోగలగాలి కూడా. అవి అమలయ్యేలాగనూ చూసుకోవాలి. మార్కెట్టునీ, చట్టాలనూ, విధానాలనూ, వాటి గతినీ, దిశనూ స్వలాభం కోసం మార్చుకునే వారూ ఉంటారు. ఆ మార్పులూ అందుకోసం ప్రయత్నాలు ప్రత్యక్షంగా ఉండొచ్చు, పరోక్షంగానూ ఉండొచ్చు. జాగురూకతతో వాటిని గమనించి మార్కెట్టునీ, చట్టాలనూ, విధానాలనూ ఎప్పటికప్పుడు గాడికి తెచ్చుకుంటూండాలి.**

ఒక్క ముక్కలో చెప్పాలంటే, తెలుగు వెలిగితేనే తెలుగులో సంపాదన అవకాశాలు ఉంటాయి. (తెలుగు ఎలా వెలగాలి అన్నది ఇదే శీర్షికలో జూన్ నెల వ్యాసం "ఆధునిక హోదా అంటే ఏమిటి?" వ్యాసంలో చూడగలరు.)

అ

వాడని భాష వాడిపోతుంది...భాష నశిస్తే జాతి నశిస్తుంది.

# తెలుగువారి 'నటసార్వభౌముడు' యస్వీ రంగారావు

-డా॥కత్తి పద్మారావు
9849741695



నటసార్వభౌముడు యస్వీ రంగారావు తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీక. భాషా విన్యాస చతురుడు. పౌరాణిక పాత్రలకు ప్రాణ ప్రతిష్ఠ చేసిన విశాల నేత్రుడు, స్ఫురద్రూపి, భావితరాలకు నటనా దిక్సూచి. హావభావ విన్యాస చతురుడు, రౌద్ర, వీర, కరుణ, హాస్య రసజ్ఞుడు. మానవ సంబంధాల సౌజన్యుడు. విద్యా సంపన్నుడు, స్నేహ భూషణుడు, బహు భాషా కోవిదుడు. సంభాషణా చతురుడు. తెలుగువారి గుండెల్లో నిలిచిన చిరస్మరణీ యుడు, తమిళుల మనసుల్ని దోచిన నటుడు. కన్నడిగులకు నటనా మిత్రుడు. హిందీ వారికి స్మృతిపాత్రుడు. కుల, మత, భాష, ప్రాంత విభేద రహితుడు. హిమాలయ శిఖరోన్నత స్వభావుడు. యస్వీ రంగారావుగారి శత జయంతి ఆంధ్రులకు ఒక స్ఫూర్తి. ఈ రోజు (జులై 3, 2018)కి, మూడు దశాబ్దాలు తెలుగువారిని తన నటనా సామర్ధ్యంతో మైమ రపించిన ఆ మహానటుడు ఎస్వీ రంగారావు పుట్టి, వంద సంవత్సరాలు నిండాయి. ఒక మహోన్నతమైన వ్యక్తి యొక్క సామర్థ్యాన్ని ప్రతి భని, నటుడుగా అంచెలంచెలుగా ఎదిగిన విధానాన్ని మనం తెలుసుకుంటే మనలో కొత్త చైతన్యం కలుగుతుంది.

యస్వీరంగారావుగారి పూర్తి పేరు సామర్ల వెంకట రంగారావు. ఆయన 1918 జులై 3వ తేదిన నూజివీడులో జన్మించాడు. ఆయన తాతగారు సామర్ల కోటయ్యా నాయుడు నూజివీడులో పేరున్న సర్జన్. తండ్రి కోటేశ్వరనాయుడు గారు ఎక్సయిజ్ ఇన్స్పెక్టర్. మేనమామ బడేటి వెంకటరామయ్య గారు గొప్ప రాజకీయ వేత్త, న్యాయశాస్త్ర నిపుణులు. ఎస్వీరంగారావు గారిది కలిగిన కుటుంబం. అందువల్లే ఆయన హైస్కూల్ చదువు మద్రాస్ ట్రిప్లికేన్‌లోని హిందూ హైస్కూల్లో జరిగింది. ఇంటర్ విశాఖపట్టణంలోని ఎ.వి.యన్. కాలేజీలో చదివారు. బి.యస్సి. కాకినాడలో పి.ఆర్.కాలేజీలో చదివారు. మొదటి నుండి ఆయన పుస్తక పఠనంలో ఆరితేరారు. 1936లో ఆంధ్రనాటక కళాపరిషత్ ఉత్సవాల్లో బళ్లారి రాఘవాచారి, గోవిందరాజుల సుబ్బారావు, డి.వి.సుబ్బారావు, స్థానం నరసింహారావు వంటి గొప్ప నటుల నాటకాలు చూసి నటనకి సంబంధించిన మెలకువలను చిన్నప్పటి నుంచి అభ్యసనం చేశాడు. స్కూల్లో చదివే రోజుల్లోనే నాటక అభినివేశం కలిగింది. కాకినాడ యంగ్‌మెన్స్ హ్యాపీక్లబ్ తరపున నాటకాల్లో అంజలీదేవీ, ఆదినారాయణరావు, బి.ఎ. సుబ్బారావు, రేలంగిలతో నాటక అనుభవాన్ని పంచుకొన్నారు. 22 యేండ్ల వయస్సులోనే పీష్వానారాయణరావు యోధ అనే ఒక గొప్ప నాటకంలో 65 యేండ్ల వృద్ధ పాత్రను ధరించి మెప్పిం చారు. ఖిల్జీ రాజ్యపతనం అనే నాటకంలో మాలిక్ కాఫర్ వేషం వేసి ఆ పాత్రలో జీవించారు. స్ట్రీట్ సింగర్‌లో విలన్ పాత్ర వేశారు. ఇక షేక్స్పియర్ నాటకాల్లోనైతే సీజర్, యాంటోనీ, షైలాక్ పాత్రలు ధరించారు. అయితే నాటకాల మీద వున్న అభిమానం ఉద్యోగం చేయనివ్వలేదు. బి.యస్.సి. పూర్తి అయ్యాక 1944-46 వరకు ఫైర్ ఆఫీసర్‌గా బందరులోను, విజయనగరంలోను ఉద్యోగం చేశారు. మేనమామ కూతురు లీలావతితో 1947 డిసెంబర్ 27న వివాహం జరిగింది. ఆయన 1947లోనే వరూధిని సినిమాలో ప్రవరాఖ్యుడి పాత్ర వేశాడు. అది ఫ్లాప్ అయింది. వెంటనే జంషెడ్‌పూర్‌లో ఉద్యోగానికి వెళ్ళి నటన మీద వున్నటువంటి ఆసక్తితో మళ్ళీ షావుకారు సినిమాలో సున్నం రంగడు పాత్రవేసి మెప్పిం చాడు. ఈ రంగడి పాత్రగా రూపొందడానికి సంబంధించి యస్వీరంగారావుగారు ఎంతో శ్రమ చేశారు. ఆ రోజుల్లో ధనిక కుటుంబాల నుంచి త్వరగా సినిమాల్లోకి రావడానికి ఒప్పు కునే వారు కాదు. అయితే నటనాసక్తివల్ల తాను ఎలా సినిమాల్లోకి వచ్చిందీ, ఒక ఆఫీసరు అయ్యుండి కూడా ఒక రౌడీ పాత్రలోకి ఎలా ఒదిగిపోయాడో యస్వీఆర్ ఇలా చెప్తున్నాడు:

"నేను మొదట నా పదిహేనో ఏట రంగస్థలంలోకి ప్రవేశించా. యదార్థానికి సిరి సంపదలకు లోటులేని కుటుంబంలోనే నేను పుట్టా. లలిత కళలను అర్థం చేసుకోలేక పోవడంచేతనో, లేక అవి చాలా నీచమైన కళలుగా అపార్థం చేసుకోవడం చేతనో...మా వాళ్ళెవరికీ నన్ను నటుడిగా పిలవడం ఇష్టం లేదు. సరిగదా...అది కేవలం అవమాన హేతువుగా భావించేవారు. నటునిగా ఉండాలని నేను, వద్దని వాళ్ళు, ఎలాగైతేనేం.. మా వాళ్ళకు తెలియకుండా స్కూల్లో స్టేజీ ఎక్కా అది కూడా ఒక మాంత్రికుని అసిస్టెంటుగా. అదే నా జీవితంలో నటునిగా మొదటి అనుభూతి. నా నటన చూసి నలుగురూ మెచ్చుకున్నారు. మా హెడ్ మాస్టర్ గారు 'శభాష్!' అని వెన్నుతట్టారు. ఆ దెబ్బతో ఆ రాత్రి నాకు నిద్రపడితే ఒట్టు. తీయని కలలు ఎన్నో వచ్చినా, మధ్య మధ్య తేలిపోతూ ఉండేవి. లేచి కూర్చున్నా ఒకసారి నా నటనా నైపుణ్యం వైపు సింహావలోకనం చేసుకున్నా,

అన్నీ తప్పులే అనిపించింది. అన్ని తప్పులుండి కూడా అంతమందీ మెచ్చుకున్నప్పుడు, ఏ తప్పులూ లేకుండా నటించగలిగితే నా జీవితం ఎంత ధన్యత చెందుతూ అనుకునే సరికి నాలో ఏదో ఒక ఆత్మవిశ్వాసం తొలకరి మెరుపులా మెరిసింది. అంతే. ఆ రోజునే నిశ్చయించుకున్నా.. నా జీవితంలో ఏనాటికైనా ఒక ఉత్తమ నటుడు అనిపించుకోవాలని! ఇకపోతే షావుకారులో సున్నం రంగడు, 'పాతాళభైరవి'లో నేపాళ మాంత్రికుడు, 'పెళ్ళి చేసి చూడు'లో ధూపాటి వియ్యన్న, 'సంతానం'లో గుడ్డివాడు.. ఇలా ప్రతి పాత్రనూ ఏదో విధమైన ఆధారంతోనే ప్రదర్శిస్తాం.. నిజజీవితంలో సామాన్య ప్రజల్లో ఎంతోమంది ఎన్ని తరహాల మంది (ఇలాంటి పాత్రల పోషణకు) నాకు గురువులయ్యారో! మానవ జీవితంలో ప్రతి ఒక్కరూ ఒక నటుడే. ఒక్కొక్కరికీ ఒక్కొక్క విధమైన మానసిక తత్త్వం ఉంటుంది. వాటిని చూడగల శక్తి, చూసి ఉపయోగించుకోగల శక్తి నటుడికి కావాలి" అన్నారు. ఆ రోజుల్లో సినిమాల్లోకి రావడానికి బాగా చదువుకున్నవాళ్ళు ఇష్టపడేవారు కాదు. నిజానికి ఆ రోజుల్లో యస్వీరంగారావు గారు బి.యస్.సి. చదివి ఉద్యోగం చేయడం అంటే చిన్న విషయం కాదు. కానీ ఆయన నటనాసక్తే ఆయన్ని సినిమాల్లోకి తెచ్చింది. చాలా మంది తల్లిదండ్రులు ఉద్యోగమే చాలా గొప్ప అనుకొంటారు. కానీ దర్శకత్వంలో, నటనలో, కెమెరా, టెక్నిక్‌లలో ఆరితేరిని వారు ప్రపంచ ఖ్యాతిగాంచడానికి ఎక్కువ అవకాశం వుందని తల్లిదండ్రులు గుర్తించరు. అలా గుర్తించకపోవడం వల్ల కూడా ఎంతో మంది ప్రతిభ బుగ్గిపాలయింది. ఎస్వీరంగారావు గారు తన ఉద్యోగాన్ని కూడా వదులుకొని వచ్చి సినిమా రంగానికి ఒక నూతన మార్గాన్ని రూపొందించారు. యస్వీరంగారావు గారు గొప్ప తెలుగు వాచకుడు. గ్రహణశక్తి ఎక్కువ, పాత్రను అర్థం చేసుకొని నటించడంలో ఆయనను మించిన వారు లేరు. తెలుగు భాష నిండా సంస్కృత పదజాలం వుంటుంది. ఋ ఋ, ఖఛఠథఫ, ఘఝఢధభ శషలు సంస్కృతం నుండి తెలుగులో వచ్చి చేరాయి. వాటిని పలకగలిగినపుడే సాంఘ్మిక పాత్రలనే గాక, జానపద పౌరాణిక పాత్రలకు న్యాయం చేయగలుగుతారు. అందునా అప్పుడు రచయితల్లోను టెక్నీషియన్స్‌లోను బ్రాహ్మణుల ఆధిపత్యం వుంది. వీరిని మెప్పించడం సామాన్యం కాదు. ఎంతో ప్రతిభను వ్యక్తం చేయవలసి వుంటుంది. ఏదైనా కొత్త రంగంలోకి వెళ్ళినపుడు మనల్ని మనం నిరూపించుకోవడం చాలా కష్టం.

యస్వీ రంగారావు తన నటనా కౌశలాన్ని అనేక రూపాల్లో అనేక సినిమాల్లో ప్రదర్శించారు. కరుణ రసాన్ని పండించడంలో ఆయన దిట్ట. ఆయనది కరుణ వీరం. నిజానికి ఆయన అక్బర్ పాత్రలోని గాంభీర్యత, ప్రేమ, కరుణ భావం, కళాపోషణ చూపించిన తీరు అమోఘం, అద్భుతం. కన్నాంబ ఆయన భార్యగా నటించిన తీరు కూడా ఇప్పటి మర్చిపోలేము. మనమెవ్వరమూ అక్బర్‌ను చూడలేదు. కానీ ఆయన దర్బారులో నడిచే తీరు, ఆయన హుక్కా తాగే హుందాతనం. అనార్కలి పాటను అస్వాదించిన విధానం అబ్బురం. ఆయన కళ్ళలో ధీరోదాత్తత, సంభాషణలోని విన్నాణం. ఒక చరిత్రలా మన కళ్ళముందు కనబడుతుంది. ఈ రోజుకీ అక్బర్ అనగానే మన కళ్ళకి యస్వీరంగారావుగారే కనిపిస్తారు. కొడుకు ఒక నాట్యగత్తెను ప్రేమించినప్పుడు, కొడుకు తన మీదే యుద్ధం ప్రకటించినప్పుడు, భార్యతో ఆయన చేసిన సంభాషణ కన్నాంబ నటనా సామర్థ్యాన్ని, ఇటు యస్వీఆర్ గంభీరతను మనం మర్చిపోలేం. అక్కినేని సలీం పాత్రలో వున్నారు. అంజలి అనార్కలి పాత్రలో వున్నారు. చిత్తూరు నాగయ్య గారు సైన్యాధక్షుడుగా వున్నారు. అయితే యస్వీ రంగారావు గారు సీన్‌లో వున్నంతసేపూ మనకు ఆ పాత్రలేవీ కనిపించవు. అది ఆయన గొప్పతనం. ఆయన చేసిన ధీరోదాత్త పాత్రలతో పాటు కరుణరస పాత్రలు – బంగారు పాప వంటి సినిమాలు ప్రేక్షకుల్ని ఏడ్పించాయి. పాత్రలోకి ప్రవేశించడం ఆయనకే తెలుసు. ఆయన ఏ పాత్ర చేస్తుంటే ఆ పాత్రే మనకు కనపడుతుంది. ఆ రోజుల్లో దుఃఖ భరితమైన పాటల్ని కూడా ప్రజలు స్వీకరించేవారు... ఎందుకంటే మనుషుల్లో దుఃఖం వుంది కాబట్టి, సమాజంలో దుఃఖం వుంది కాబట్టి. శిశువుల పట్ల చూపే ప్రేమ జీవితంలో వుంటే తప్ప, నటనలో రాదు.

నటన అంటే ఏ పాత్రను మనం చేస్తున్నామో ఆ పాత్రలోకి పరకాయ ప్రవేశం చేయగలిగిన శక్తి. అది నిజానికి ఒక చార్లీ చాప్లిన్, ఒక దిలీప్‌కుమార్...యస్వీఆర్ స్థాయిలో సహజత్వానికి రూపమయ్యాడు. యస్వీరంగారావు కన్నీరు పెడితే ఆంధ్రలోకం మొత్తం కన్నీరు పెట్టింది. యస్వీరంగారావు నవ్వితే దక్షిణభారతం మొత్తం నవ్వారు. నటుడు పాత్రలో వున్నప్పుడు తనను గుర్తుపెట్టుకున్న వారెవ్వరూ నటుడు కాలేరు. తెలుగులో చాలా మంది నటులు తమ అహాన్ని మర్చిపోకుండా నటిస్తారు. అందుకే యస్వీఆర్ ముందు వాళ్ళు ఓడిపోయారు. నిజానికి యస్వీఆర్‌కు జీవితం వుంది. జీవితంలో ఆర్ద్రత వుంది. జీవితంలో ప్రేమ వుంది. జీవితంలో పోటీ వుంది. జీవితంలో పోరాటం వుంది. పోయినదాని గురించి దేన్ని గురించీ ఆయన ఆలోచించలేదు. ఉన్నదాన్ని ఆయన ఉపయుక్తం చేశాడు. కొడుకులు, కూతుళ్ళు వారికి ధనం విలువ తెలియనప్పుడు ధనమేరా అన్నిటికి మూలమనే పాటలో చూపిన అభివ్యక్తి మన కళ్ళలో కదులుతూ వుంటుంది. అనేక భోగాలు అనుభవించిన దశ నుంచి అనేక కష్టాలు అనుభవించినప్పుడు చూపిన నటవైదుష్యం కొలవలేనిది. వాక్యం రసాత్మకం కావ్యం అన్నారు. రసయుక్తంగా వ్రాస్తేనే కాదు వాక్యం పలికినా కావ్యమే. యస్వీ రంగారావు గారు మృదు హృదయులు. జీవన వర్తనలో సానుకూలత ఎక్కువ. ఇతరులపై ద్వేషపడిన ఘటనలు లేవు. ఇతరుల ద్వేషాన్ని ప్రతిభతో జయించాడు. ముఖ్యంగా ఆయన సినిమాల్లో మిస్సమ్మ తెలుగు వారి కళ్ళముందు కదులుతున్న చిత్రం. సావిత్రి కూతురు లాంటిది. రామారావు గారు నిరుద్యోగిగా తనను ఆశ్రయించిన పాత్ర. మేనల్లుడు– అక్కినేని నాగేశ్వరరావు, జమున – కూతురు. అన్ని పాత్రల్లోను ఆయన పాత్ర ఒక సమన్వయ కర్త, ఒక గంభీరుడు. అనేక సందర్భాల్లో బహురసాల కలబోత. కొన్నిసార్లు హాస్యాన్ని మాటలు లేకుండా పలికించాడు. అనునయం, ఆత్మీయతలు ఆయన కనబరచినప్పుడు ఎక్కడా యస్వీఆర్ నటిస్తున్నాడని చెప్పలేం. అది సాధించటం సామాన్యమైన విషయం కాదు. ఎన్నో అవార్డులు తెచ్చిపెట్టిన ఘటోత్కచుడు పాత్రలో వికృతిని ప్రకృతిగా, బీభత్సరసాన్ని వీరరసంగా ఇంకా నిలువెల్ల హాస్యంగా నటించడమే గాక తల్లికి కొడుకుగా, భీమునికి తమ్మునిగా నటించిన కథలో మూలవాసుల తోటి క్షత్రియ వివాహాలు. యుద్ధకాలంలో, ఆపద కాలంలో వారి యుద్ధ విద్యలు వీరికి ఉపయోగపడతాయి. వీరం, శృంగారం కలబోతగా చిత్రం నడవడం. యస్వీఆర్, సావిత్రుల ఇద్దరి ప్రతిభా సమన్వయం. ఆశ్చర్యాన్ని గొలిపే సన్నివేశాలు మనల్ని నవ్విస్తాయి, కవ్విస్తాయి.

**తెలుగు ప్రాధికార సంస్థ ఏర్పాటుకై చట్టాన్ని వెంటనే తేవాలి**

యస్వీరంగారావు గారు అమేయమైన ప్రతిభావంతుడు. స్నేహంలో ఆయన్ని మించిన వారు లేరు. ఈ స్వభావమే ఆయన్ని సినీ ప్రపంచంలో ధృవతారగా నిలిపింది. ఆయన పౌరాణికాలు మాయాబజార్, నర్తనశాల, పాండవ వనవాసం, భక్తప్రహ్లాద,బాలభారతం, సంపూర్ణ రామాయణం, యశోదాకృష్ణ, జానపదాల విషయానికి వస్తే బాలనాగమ్మ, విక్రమార్క విజయంలలో నటించారు. ఇక చారిత్రకాల్లో అనార్కలిలో అక్బర్‌గా, బొబ్బిలి యుద్ధంలో తాండ్రపాపారాయుడుగా, భక్తపోతనలో శ్రీనాధుడిగా నటించి తెలుగు చలన చిత్ర పరిశ్రమలో తనదైన శైలికి ఒక ముద్ర వేశారు. సాంఘిక చిత్రాలకు వస్తే – బంగారు పాప, పెండ్లిచేసిచూడు, మిస్సమ్మ, ఆత్మబంధువు, లక్ష్మీనివాసం, తాతామనమడు పండంటి కాపురం వంటి ఎన్నో చిత్రాల్లో వైవిధ్యమైన పాత్రల్ని చేసి చూపించారు. ఇక ఆయన మార్పుని చూపించిన చిత్రాలు మొనగాడికి మొనగాడు, కత్తుల రత్తయ్య, జగత్ జెట్టీలు. రంగారావు గారి డైలాగ్ డెలివరీలో వున్న ప్రత్యేకతను అప్పుడు సౌండ్ ఇంజనీర్‌గా వున్న కె.విశ్వనాథ్ గారు ఇలా వర్ణించారు :

“యస్వీఆర్ నటించిన అన్నపూర్ణా వారి చిత్రాలు ‘తోడికోడళ్ళు’ (1952) ‘మాంగల్యబలం’ (1959) తదితర చిత్రాలకు నేను స్వయంగా సౌండ్ రికార్డిస్టుగా పనిచేశా. ఆర్టిస్టులు ఎవరైనా గబగబా డైలాగ్ చెబుతూ, మాటలు దొర్లించేస్తుంటే, రికార్డిస్టుగా నా లాంటి వాళ్ళు వెళ్ళి చెప్పే వాళ్ళం. మా మాట విని ఆ రోజుల్లో రీటేక్ చేసేవారు. కానీ, యస్వీఆర్‌ది చాలా విలక్షణమైన డైలాగ్ డెలివరీ. ఆయన చాలా తొందరగా మాట్లాడినట్లు ఉంటుంది కానీ, ఎంత తొందరగా మాట్లాడినా, ఆయన మాటల్లో, డైలాగ్ విరుపులో చాలా క్లారిటీ ఉండేది. డైలాగ్ విషయంలో ఆయనను నేనెప్పుడూ రీటేక్ అడగాల్సిన అవసరమే రాలేదు. అవసరం ఉండేది కాదు. ఆయన నాతో ఎప్పుడూ చాలా మర్యాదగా ఉండేవారు.

చాలామందికి విచిత్రం ఏమిటంటే, అంత పరిచయం ఉన్న నేను ఆయనతో సౌండ్ రికార్డిస్టుగా పనిచేశానే తప్ప, డైరెక్టర్‌ను అయ్యాక పనిచేయకపోవడం! అలాగే, భానుమతి గారితోనూ నేను చేయలేదు. దానికి కారణం నేనే. నిజానికి వాళ్ళిద్దరూ నాకు చాలా సన్నిహితులు. నేనంటే ఎంతో గౌరవం ఉన్నవాళ్ళు కానీ, యస్వీఆర్, భానుమతి లాంటి వాళ్ళు చాలా స్పెషల్ కేటగిరీకి చెందిన నటులు. అభినయంలో తమదైన పంథా ఉన్న నిష్ణాతులు. కాబట్టి, సహజంగానే వాళ్ళ టెంపర్‌మెంట్స్‌లో బాగా హెచ్చుతగ్గులు ఉంటాయి. కాబట్టి, స్నేహం, అనుబంధం కొనసాగాలంటే, వాళ్ళతో ఎలాంటి వృత్తిపరమైన లావాదేవీలూ పెట్టుకోకూడదని అనుకున్నా. అందుకే నేనెప్పుడూ వాళ్ళతో సినిమాలు డైరెక్ట్ చేయలేదు.

యస్వీఆర్ నటించిన సినిమాల్లో నాకు నచ్చినవంటే.. చాలానే ఉన్నాయి. అయితే, ఆల్‌టైమ్ బెస్ట్ అంటే.. ‘మాయాబజారే! ఆ చిత్రంలో కృష్ణుడికి ఎంత ప్రాముఖ్యం ఉందో, ఘటోత్కచుడికీ అంత ప్రాముఖ్యం ఉంది. యస్వీఆర్ నటన అపూర్వం. కెమెరా వెనుక నుంచి ముందుకు వచ్చి నేను నటించడం మొదలు పెట్టిన కొత్తలో తెలుగు తెరకు మరో యస్వీఆర్ దొరికాడు అని చాలా మంది పొగిడారు కానీ, నేనేమీ పొంగిపోలేదు. ఎందుకంటే నాకు నిజం తెలుసు. కాస్తంత గుబురు మీసాలు, నిలువెత్తు విగ్రహం అన్నంత మాత్రాన ప్రతి ఒక్కరూ యస్వీఆర్ అయిపోతారా? కారు. అసలు ఆయనకూ, మనకూ పోలిక ఏమిటి? ఆయన చేసిన విభిన్నమైన పాత్రలు, వివిధ కోవల సినిమాలు మనమెక్కడ చేశాం. అందుకే నా దృష్టిలో ఒకే ఒక్కడు.. యస్వీఆర్. (ఆంధ్రజ్యోతి, 1-7-2018)

యస్వీఆర్‌తో పోటీపడి చేయగలిగిన వ్యక్తి దక్షిణాది సినీ ప్రపంచంలో ఒక సావిత్రికే సాధ్యమైంది. మాయాబజార్‌లో శశిరేఖ పాత్ర నుండి ఆమె ఘటోత్కచుని పాత్రలా నటించడంలో నటనా సామర్థ్యాన్ని చూపించింది. యస్వీఆర్, సావిత్రి నర్తనశాలలో పోటీ పడి నటించారు. అరి వీర భయంకరుడైన కీచకుడు క్షత్రియరాజు విరాటుని బావమరది. సైరంధ్రివేషంలో వున్న ద్రౌపదిని మోహిస్తాడు. మోహితుడైన తన హావభావాలు ఎలా ఉంటాయో యస్వీఆర్ అద్భుతంగా చూపాడు. ఇక్కడ ద్రౌపది పాత్రలోవున్న సావిత్రి ముగ్ధకాదు – ప్రౌఢ. అప్పటికీ వీరుల్లో, ధీరుల్లో, బలవంతుల్లో భీమునికి సాటిగా చెప్పబడుతున్న కీచకుడు తన వెంటబడుతున్నాడు. తన భర్తలు అశక్తులుగా ఉన్నారు. అయినా ఆమెకు బెరుకులేదు. ఆ కళ్ళల్లో ఎక్కడా తొణుకులేదు. సౌందర్యంతో పాటు కీచకుని మోహాన్ని నివారించే ప్రౌఢ స్త్రీగా అసమానమైన ప్రతిభతో సావిత్రి నటించింది. సినిమా మొత్తం కీచక ద్రౌపదీయంగా...యస్వీఆర్ సావిత్రి నటనతో అపూర్వమైన హావభావ విన్యాసంతో నడిచింది. పాండవ వనవాసంలో భీముని పాత్రలో యన్.టి.రామారావు రాబోయే యుద్ధంలో దుశ్శాసనుని తొడలు చీల్చి రక్తం తాగుతాను అని అంటారు:

*“కురువృద్ధుల్ గురు వృద్ధ బాంధవు లనేకుల్ చూచుచుండన్*
*మదోద్ధురుడై ద్రౌపది నిట్లు సేసిన ఖలున్ దుశ్శాసనున్ లోకభీ*
*కరలీలన్ వధియించి తద్విపులవక్షశ్శైలరక్తౌఘ ని*
*ర్ఘర మూర్వీపతి చూచుచుండ నని నాస్వాదింతు నుగ్రాకృతిన్”*

(కురు వంశపు పెద్దలు, గురువులు, వృద్ధులు, బంధువులు పెక్కుమంది చూస్తుండగా–పొగరెక్కి చెలరేగి, ద్రౌపదిని ఈ విధంగా చేసిన దుశ్శాసనుణ్ణి రాజు (దుర్యోధనుడు) చూస్తుండగానే యుద్ధంలో లోకభయంకరమైన రీతిలో వధించి, అతని విశాల వక్షస్థలమనే పర్వతంలోని రక్తప్రవాహమనే సెలయేటిని భయంకరాకారం ధరించి త్రాగుతాను.) అలా అన్నప్పుడు కూడా యస్వీఆర్ దుర్యోధనుని పాత్రలో ‘బానిస’ అనే ఒక్క మాట విరుపులో తేల్చాడు. ఇప్పటికీ ఆ ఒక్క మాట ఆంధ్రుల గుండెల్లో ముద్రపడిపోయింది. ద్రౌపదిగా వున్న సావిత్రి ‘ధర్మరాజు తన్నోడి నన్నోడెనా, నన్నోడి తన్నోడెనా అనే ఒక్క మాటతో సభాస్థలిలో వున్న నటులందరిని జయించేసింది. వీరిద్దరూ తెలుగు వారి నటనకు రెండు కళ్ళుగా భాసించారు. ఇద్దరూ అసమాన ప్రతిభావంతులు. హావభావ విన్యాసంతో తమకు తామే సాటిగా జీవించినవారు. యస్వీఆర్ గురించి ఒక సందర్భంలో గుమ్మడి చెబుతూ హిందీ నటులు అశోక్‌కుమార్‌లోని ఉదాత్తత, ప్రాణ్‌లోని చతురత, ఓం ప్రకాష్‌లోని సౌమ్యం, ప్రేమనాథ్‌లోని ధిక్కారం కలగలిపిన నటుడు అని చెప్పారు. యస్వీఆర్ సినిమా దృశ్యం తీసే సందర్భంలో ఎవరితో రాజీపడడు. ఆయన ఆ పాత్రలోకి పరకాయ ప్రవేశం చేస్తారు. సామాన్యంగా తెలుగు వారి ఇళ్ళలో పెద్దన్న కుటుంబానికి మొత్తానికి తండ్రిలా వ్యవహరిస్తారు. పండంటి కాపురంలో పెద్దన్నగా యస్వీఆర్

**తెలుగు మాధ్యమాన్ని తీసివేస్తే తెలుగు వర్ధిల్లదు**

తన నటనా సామర్థ్యాన్ని చూపించారు. ఆయా దృశ్యాల్లో దుఃఖాన్ని పండించారు. ప్రతి ఇంట్లో అన్న పాత్ర గుర్తుకు వచ్చింది.

నర్తనశాలకు అంతర్జాతీయ అవార్డు వచ్చిన సందర్భాన్ని చూద్దాం. 'నర్తనశాల'లో ఎన్.టి.ఆర్. హీరో. అంత పెద్ద వీరుడు- అర్జునుడు - మారువేషంలో బృహన్నలగా మారి విరాట్ రాజు కొలువులో తల దాచుకుని ఉన్నాడు. ధర్మరాజుగా మిక్కిలినేని, చేతగాని పెద్దమనిషి భీముడు గాడిపొయ్యి దగ్గర కండలు కరిగిస్తున్నాడు. వీళ్లు వీరులు, పరాక్రమవంతులు. వీళ్ల గొప్ప తనం చూడటానికే ప్రేక్షకులు సినిమాకు వచ్చారు. కాని ఏం చేస్తాం? అందులో గెస్ట్‌రోల్ లాంటిది ఉంది. కొంచెం సేపు కలకలం సృష్టించే పాత్ర ఉంది. అది వేరెవరో వేస్తే ఎలా ఉండేదో...యస్వీఆర్ వేశాడు. విరాట్‌రాజు కొలువులో చెప్పాపెట్టని తుఫానులా అడుగుపెట్టాడు. పాట పాడుతున్న పాంచాలిని అదే... సైరంధ్రిని..., అదే సావిత్రిని చూసి, మనసుపడి 'ఎంతకాలమైంది ఈ అలివేణి అంతఃపురంలో అడుగుపెట్టి ...అన్నాడు. చూడండి వింత!' దీనికి కొంతకాలం ముందే ఇదే సావిత్రిని 'మిస్సమ్మ'లో ఇదే యస్వీ రంగారావు కన్నకూతురిలా చూస్తూ 'అమ్మి' 'అమ్మి' అని అనురాగంగా పిలుస్తూ ఉంటే తండ్రి అంటే ఇలా ఉండాలి అనుకున్నారు జనం. అదే యస్వీఆర్ ఇప్పుడు అదే సావిత్రిపై వక్రదృష్టి పెట్టి సొంతం చేసుకోవడానికి ఆత్రపడుతూ రాక్షసుడిలా మారుతుంటే 'అమ్మో.. కీచకుడంటే ఇలా ఉంటాడా' అనుకున్నారు జనం. 'నా గర్వము సర్వము ఖర్వము అయినది' అని అంతెత్తు మనిషి సావిత్రి ముందు మోకరిల్లడం చూస్తే కోపానికి బదులు జాలి కలిగితే ఆ దోషం ప్రేక్షకులది కాదు, పాత్రదీ కాదు...దానిని వేసిన యస్వీఆర్‌ది. ఆరో భర్తగా నన్ను కూడా కట్టుకో తప్పులేదులే అంటూ సావిత్రిని వేధించిన యస్వీఆర్ కామంతో పాటు వెర్రి వ్యామోహం కూడా ప్రదర్శిస్తాడు. చివరకు అతి బలాఢ్యుడైన భీమసేనుడి చేతిలో ఊపిరి కోల్పోతాడు. సినిమా పెద్ద హిట్ అయ్యింది. 1964లో 'జకార్తా'లో 'ఆఫ్రో-ఆసియా ఫిలిమ్ ఫెస్టివల్' జరిగి అందులో 24 దేశాలు పోటీ పడితే అందులో 'నర్తనశాల' కూడా పాల్గొంటే అవార్డు కమిటీ ఆ సినిమాతో పాటు అన్ని సినిమాలనూ జల్లెడ పట్టింది. ఈ 24 దేశాల నుంచి ఉత్తమ నటుడుగా ఎవరిని ప్రకటించాలి? వేదిక మీద పేరు పిలిచారు. సామర్ల వెంకట రంగారావు...ఒక తెలుగువాడికి అంతర్జాతీయంగా మొదటిసారి చప్పట్లు వినిపించిన సందర్భం అది.

యస్వీఆర్ పాండవ వనవాసంలో చేసిన దుర్యోధన పాత్రను శ్రీకృష్ణ పాండవీయంలో యన్.టి.రామారావు గారు చేయలేకపోయారు. ఆయన కృష్ణుని పాత్రకే మార్కులు పడ్డాయి. మిస్సమ్మలో రామారావు గారు, నాగేశ్వరరావు గారు, సావిత్రి, యస్వీఆర్ పాత్రలు చూస్తే, ఆ పాత్రలో యస్వీఆర్ తండ్రిపాత్ర - అందునా కుమార్తెను పోగొట్టుకున్న తండ్రిపాత్ర అసామాన్యంగా చేశారు. యస్వీఆర్ పాత్రల్లో ఒదిగిపోతారు. హిరణ్యకశ్యపుడి పాత్రలో కుమారుడు ప్రహ్లాదుడు ప్రత్యర్థి నారాయణుని నామస్మరణ చేస్తూ వుంటే, భార్య కూడా అతన్ని సమర్థిస్తుంటే అటుప్రక్క పుత్ర ప్రేమ, ఇటు ఇంటిలోనే ప్రత్యర్థి నామజపం. యస్వీఆర్ ముఖంలోని హావభావాలు, వీర, రౌద్ర రసావిష్కరణ, అద్భుతం, ఆశ్చర్యం, అతులిత నటనా సామర్థ్యం,తెలుగువారి మెదడులపై ముద్రపడింది. హిరణ్యకశ్యపుని పాత్ర అసురరాజు, మహాధైర్యశాలి, మూడులోకాలను జయించిన వాడు. యస్వీఆర్ అనేక సందర్భాల్లో డైలాగ్‌కు బదులు ముఖ కవళికలతో భావవ్యాప్తి కలిగిస్తారు. ఇది మాయాబజార్‌లోనే ఒక సన్నివేశంలో జరిగిన విషయాన్ని సింగీతం శ్రీనివాసరావు ఇలా విశ్లేషించారు: "యస్వీ రంగారావు అంటే ఒక్క ముక్కలో మహా నటుడు అంటాను. ఆయన పేరు చెప్పగానే నేను అప్రెంటిస్‌గా పనిచేసిన తొలి సినిమా 'మాయాబజార్' నుంచి ఎన్నెన్నో గుర్తుకువస్తాయి. 'మాయాబజార్' లో ఒక సన్నివేశం తీస్తున్నప్పుడు జరిగిన సంభాషణ నాకు ఇప్పటికీ గుర్తు. శశిరేఖను ఎత్తుకు పోవడానికి ఘటోత్కచుడు పాత్రధారి శశిరేఖ మంచం దగ్గరకు వచ్చి నిలబడే దృశ్యం తీస్తాం. కట్ చేస్తే - లో యాంగిల్‌లో ఘటోత్కచుడి క్లోజప్ షాట్. అక్కడ ఘటోత్కచుడి పాత్రధారి యస్వీఆర్, మంచం మీద నిద్రిస్తున్న శశిరేఖ పాత్రధారిణి సావిత్రిని చూస్తాడు. అక్కడ స్క్రిప్టులో యాక్షన్ పార్ట్‌లో ఒక డైలాగ్ ఉంది. 'ఆహా.. నా సోదరునికి తగిన కన్య, అని. కె.వి.రెడ్డి గారంటే గురుభావమున్న యస్వీఆర్‌కు డైరెక్టర్ తన నుంచి ఏం ఆశిస్తున్నట్లు అనాలా? లేక రాక్షసుణ్ణి గనక బిగ్గరగా అనాలా? అని రెండు, మూడు పద్ధతులు చెప్పారు. వెంటనే దర్శకుడు కె.వి.రెడ్డి గారు, 'మిస్టర్ రంగారావ్ అక్కడ డైలాగ్ ఏమీ పైకి చెప్పనక్కరలేదు. 'శశిరేఖను ఘటోత్కచుడు సంతోషంగా చూస్తాడు అనేది అక్కడ యాక్షన్ కానీ, ఊరకే సంతోషంగా చూడమంటే కొన్నిసార్లు తప్పుడు ఎక్స్‌ప్రెషన్ వచ్చే ప్రమాదం ఉంది. కాబట్టి ఈ డైలాగ్ ఇచ్చాం. ఈ డైలాగ్ మనసులో అనుకుంటూ దానికి తగ్గ ఎక్స్‌ప్రెషన్ ఇవ్వడం కోసమని అది రాశాం అన్నారు. యస్వీఆర్ ఆ డైలాగ్ పలకకుండానే పలికినంత ఎఫెక్టివ్‌గా హావభావాల్లో అంతటి భావం, అర్థం చెప్పకనే చెప్పిన దృశ్యం మాయాబజార్‌లో చూడవచ్చు.

యస్వీ రంగారావు గురించి ప్రసిద్ధ సినీనటి జానకి ఏమంటున్నారో చూద్దాం..."మాది రాజమండ్రి, యస్వీఆర్ గారిది ఆ పక్కన ధవళేశ్వరం. ఆయనకూ, నాకూ తొలి గుర్తింపు 'షావుకారు' (1950) సినిమాయే. ఒక్కసారి వెనక్కి వెళితే అది 1949 ప్రాంతం. అప్పటికి నాకు పద్దెనిమిదేళ్ళు ఉంటాయేమో సన్నగా, బక్కగా, ఎలుకపిల్లలా ఉండేదాన్ని. మా పెద్దమ్మాయి యజ్ఞప్రభ అప్పుడే పుట్టింది. మూడు నెలల బాలింతరాలిని. పుట్టెడు కుటుంబ కష్టాలతో పొట్ట నింపుకోవడానికి మార్గం వెతుకుతూ సినిమాల్లోకి వచ్చా 'విజయా' వారి 'షావుకారు' నా తొలి సినిమా. యస్వీఆర్ 'షావుకారు'లో సున్నం రంగడు అనే అద్భుతమైన రౌడీపాత్ర చేశారు. ఈ సినిమా అందరికీ పెద్ద బ్రేక్. అప్పటి నుంచి షావుకారు జానకిని అయ్యాను. యస్వీఆర్ గుర్తింపు తెచ్చుకున్న సినీ నటుడయ్యారు. ఆ తరువాత 'పాతాళభైరవి'తో పాపులర్ అయ్యారు. 'మాయాబజార్' ఘటోత్కచుడిగా జనసామాన్యంలో స్టార్ అయ్యారు.

నటుడిగా యస్వీఆర్ అంటే నాకు అమితమైన గౌరవం. నన్నడిగితే ఆయన యాక్టర్స్ యాక్టర్...నటులను మించిన నటుడు. ఆయనది ఒక విలక్షణమైన డైలాగ్ డెలివరీ. డైలాగ్‌ను ముక్కలు ముక్కలుగా విరుస్తూ, చాలా విలక్షణంగా మాడ్యులేట్ చేస్తూ, ఒక వేగంతో ఆయన డైలాగ్ చెప్పే పద్ధతి ఇంకెవరికీ లేదు. మేము కలసి నటించిన సినిమాల్లో నా మనసులో బాగా గుర్తుండిపోయినవి రెండున్నాయి. ఒకటేమో ఏ.వి.ఎం. వారి తమిళ చిత్రం 'అన్నై' (1962)

**వినియోగించే కొద్దీ భాష వికసిస్తుంది**

పెద్ద హిట్. అందులో యస్వీఆర్, భానుమతి, నేను నటించాం. భానుమతి గారి చెల్లెలి వేషం నాది. భానుమతి గారి భర్త వేషం యస్వీఆర్‌ది. ఆ సినిమాలో ఆయన ఎంత అద్భుతంగా చేశారంటే, కొన్ని సన్నివేశాల్లో ఆయన భానుమతి గారితో సహా అందరినీ మింగేశారు. తెలుగులో ఈ సినిమా 'పెంచిన ప్రేమ' పేరుతో డబ్ అయింది. అలాగే కె.బాలచందర్ దర్శకత్వంలో జెమినీ స్టూడియోస్ తీసిన 'భలే కోడళ్ళు' (1968) చిత్రం. అది తమిళంలో వాళ్ళే తీసిన 'భామావిజయం' చిత్రానికి రీమేక్. అందులో నేను, కాంచన, జయంతి ముగ్గురు కోడళ్ళం. మాకు మామ గారు యస్వీఆర్. కోడళ్ళు తమ పరిధి దాటి సినిమా స్టార్లను అనుకరిస్తుంటే, మామ గారు చాలా నేర్పుగా వాళ్ళకు బుద్ధి చెప్పి, దోవలోకి తెచ్చే పాత్ర. అందులో యస్వీఆర్‌ది చాలా మంచి వేషం. అందులోనూ ఆయన అందరినీ తినేశారు.

యస్వీఆర్‌ది ఎంత మంచి విగ్రహం!. ఎంత మంచి నటన అంటే, తెర మీద ఎంత మంది పెద్ద నటీనటులున్నా, మన దృష్టి యస్వీఆర్ పైకే వెళ్తుంది. ఆయన అంతటి వాళ్ళం అనుకొనే ఆర్టిస్టులు చాలామంది ఉన్నా, ఆయన స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేకపోయారు. యస్వీఆర్ ఇవాళ ఉండి ఉంటే, ఆయనకు వందేళ్ళు అనుకుంటున్నాం. ఆయన ఒక వందేళ్ళే కాదు.. సినిమా గనక మరో వందేళ్ళుంటే ఆ వందేళ్ళూ ఆయన సజీవంగానే ఉంటారు".

యస్వీఆర్ జీవితంలో కొంత కోపం వుంది, కాని ఆర్ద్రతే ఎక్కువ వుంది. ఆయనది కరుణ స్వభావం. తన ఇంటికి ఎప్పుడూ బంధువులు కొల్లలుగా వచ్చేవారు. వారందరిని క్రమంగా చూసి పంపేవారు యస్వీఆర్. ఆయన చాలా శుభ్రతగా వుండేవారు. ఆయన వేటకు వెళ్ళడానికి గాను ఒక తుపాకీ ఉండేది. ఆ తుపాకీ లైసెన్స్, రెన్యువల్ కోసం పోలీస్టేషన్‌కు వెళితే డి.యస్.పి. తుపాకిని ఇంత శుభ్రంగా ఉంచుకోవాలని తన సహచరులకు చెప్పాడంటే ఆయన తన వస్తువులను ఎంత శుభ్రతగా ఉంచుకొంటారో అర్థం చేసుకోవచ్చును. యస్వీఆర్ కుళ్ళు కపటం లేని మనిషి. తాను భోజనం చేసేటపుడు తన సహచరులందరికీ అదే భోజనం అన్ని కూరలతో పెట్టించేవాడు. ఆయన నిర్మాతలను పీడించేవాడు కాదు. నిర్మాతలకు పెన్నిధిగా ఉండేవాడు. యస్వీఆర్ నటనలో పోటీ తత్వం దసరాబుల్లోడుల్లో తన అన్న కొడుకులు సత్రంలో ఉన్నపుడు తన దత్త కొడుకు వారితో ఉన్నపుడు తన భార్య సూర్యకాంతం గయ్యాళి తనానికి లొంగిపోయినపుడు, ఆ నలిగిపోయిన ఘట్టాల్లో గుమ్మడి, నాగేశ్వరరావులను అధిగమించి తన నటనా కౌశలాన్ని పండించాడు. కళ్ళల్లో కనుబొమ్మల్లో, నొసలవిరుపుల్లో ముఖ కవళికల్లో తన హావభావాలను ప్రదర్శించగల నేర్పువల్లే ఆయన తనకు ముందున్న సీనియర్స్‌ను దాటవేసి ముందుకొచ్చాడు. ఈ అంశం గూర్చి సినీ ప్రముఖులు ఇలా వ్యాఖ్యానించారు. "సి.హెచ్.నారాయణరావు తెలుగు వెండి తెరకు తొలి అందాల నటుడు. కాని ఆయన ప్రభ ఎన్.టి.ఆర్. రావడంతోనే కనుమరుగు అయ్యింది. అలాగే తెలుగు తెర మీద ఎందరో ప్రతిభావంతమైన కేరెక్టర్ ఆర్టిస్టులు గోవిందరాజుల సుబ్బారావు, ముదిగొండ లింగమూర్తి, ముక్కామల, యస్వీఆర్. నాగయ్య.. వీరందరినీ దాటేసి ముందుకు వచ్చినవాడు యస్వీఆర్. రంగారావు మింగేస్తాడు. అది ఆయన బలం. రంగారావు నమిలేస్తాడు. అందుకే సాటి ఆర్టిస్టులకు జంకు.

"ఎంతటి గొప్ప నటుడైనా హాస్యం చేయకపోతే పరిపూర్ణమైన నటుడుగా గణింపబడడు. గొప్పనటులంతా మంచి హాస్యం చేసినవారే. 'మిస్సమ్మ', మాయాబజార్, 'గుండమ్మకథ', 'మంచి మనసులు' 'తోడి కోడళ్లు'.. ఈ సినిమాలన్నింటా యస్వీఆర్ సున్నితమైన హాస్యాన్ని చూపించారు. నేపాళ మాంత్రికుడిగా భయపెట్టిన వ్యక్తి సూర్యకాంతం మొగుడిగా చేతులు నలుముకుంటూ నిలబడి మెప్పించడం వింతే కదా, 'కలసి ఉంటే కలదు సుఖం' 'వెలుగునీడలు', 'దసరాబుల్లోడు'.. 'మాట్లాడరేమండీ' అని సూర్యకాంతం అంటే 'నిన్ను కట్టుకున్నాక ఎప్పుడు మాట్లాడాను కనుక, అని యస్వీఆర్ అనడం తెలుగువారికి మాత్రమే సొంతమైన నటనా వినోదం. ఏదైనా కొత్త రంగంలోకి వెళ్ళినపుడు మనల్ని మనం ప్రూవ్ చేసుకోవడం చాలా కష్టం. ప్రతి సినిమాని అప్పుడే కొత్తగా చేస్తునట్టు ప్రతి ఫ్రేమ్‌లో కొత్తగా నటిస్తున్నట్టు యస్వీఆర్ భావించేవారు. సావిత్రి జెమినీగణేశన్‌ను చేసుకోవడం, రంగారావు శివాజీతో స్నేహం చేయడం దీనివల్ల వారికి తమిళ భాష బాగా వచ్చింది. నూట యాభై తెలుగు సినిమాలతో పాటు 87 తమిళ సినిమాలు చేశారు. రెండు కన్నడ, మూడు మలయాళం సినిమాలు చేశారు. మూడు హిందీ సినిమాలు చేశారు. ఆయన ఆతిథ్యం గొప్పది. రోజు 25 లీటర్ల పాలు పోయించుకునే వారంటే ఎంత మంది వారింట్లో భోజనం చేసేవారో అర్థమౌతుంది. ముఖ్యంగా వాళ్ళ మేనల్లుడిని ఆయన పెంచిన ఘట్టం చూస్తే ఆయన ప్రేమ ఎటువంటిదో మనకు అర్థమౌతుంది. మేనల్లుడు బడేటి ఉదయ్‌కుమార్ మాటల్లోనే చూద్దాం.. "మా మేనమామ గురించి ఏమని చెప్పను. ఎన్నని చెప్పను! ఆయన నాకు మామయ్యే కాదు.. పసివాడినైన నన్ను తన దగ్గరే ఉంచుకొని, పెంచి పెద్ద చేసిన తండ్రి తరువాత తండ్రి అని చెప్పనా!

మామయ్యది చాలా పెద్ద మనసు. ఆ రోజుల్లో దీపావళి వచ్చిందంటే ఆయనకు ఇంటా, బయటా పెద్ద పండగే. బ్యాంకు నుంచి కొత్త నోట్లు డ్రా చేసి తెచ్చి తనతో కలసి పనిచేసే స్టూడియో సిబ్బందికీ, వర్కర్స్‌కీ ఇచ్చేవారు. అలాగే దసరా వచ్చిందంటే.. ఇంట్లో బొమ్మల కొలువు పెట్టించే వారు. సినీరంగానికి చెందిన కుటుంబాల వారిని పిలిచి, పండుగ చేసేవారు. ఇక, అత్తమ్మ ఏమో ఇంటి వ్యవహారాల పట్ల బాధ్యతగా ఉండేవారు. ఆయన హఠాత్తుగా మరణించిన రోజు అంతా గందరగోళం. మామయ్య చనిపోయేనాటికి నాకు పట్టుమని పదమూడేళ్ళు. ఆయన పోయి ఇప్పటికి 44 ఏళ్ళు. కానీ, ఇప్పటికీ ఆ దృశ్యం మర్చిపోలేకపోతున్నా, ఏదో తీరని లోటు నన్ను వెంటాడుతుంటుంది. 2000లో అత్తయ్య చనిపోయే వరకు అదే ఇంట్లో, వాళ్ళతో పాటు ఆమె బాగోగులు చూసుకుంటూ గడిపా, ఆ కుటుంబాన్ని అంటిపెట్టుకొని ఉండడం నాకు దక్కిన ఏ పూర్వజన్మ పుణ్యమో" అని అన్నారు.

రంగారావుగారు పిల్లల్ని క్రమశిక్షణగా పెంచారు. మంచి చదువులు చదివించారు. వారిప్పుడు అమెరికాలో సముచిత స్థానంలో జీవిస్తున్నారు. వాళ్ళనాన్న అంటే వాళ్ళకు దైవంతో సమానం. తాను ఎప్పుడూ నటనారంగంలో గుర్తుండిపోయేవాడిగా మరణించాలని ఆయన అనుకునేవారు. వాళ్ళ అమ్మాయిలు యస్.విజయలక్ష్మి (డల్లాస్), కె.ప్రమీలారాణి (ఏథెన్స్, ఒహాయోస్టేట్, అమెరికా) ఆయన

తెలుగులో పరిపాలించనప్పుడు మనవి తెలుగు రాష్ట్రాలెలా అవుతాయి?

గురించి ఇలా చెప్తున్నారు. "నాన్నంటే మాకు దైవం. మా నాన్న నటుడనే తప్ప అన్ని కుటుంబాల్లో లానే మమ్మల్నీ చాలా పద్ధతిగా, క్రమశిక్షణతో పెంచారు. మేమిద్దరం అమెరికాలో స్థిరపడ్డాం. ఆయన చాలా హార్డ్‌వర్కింగ్. ఆయనెప్పుడూ తాను నటనారంగంలో ఉన్నత స్థాయిలో ఉండగానే కన్నుమూయాలి అనుకొనే వారు. తాను లేకపోయినా, జనంలో తన పేరు గుర్తుండిపోవాలనే వారు. 'అదేంటి నాన్నా.. ఆ మాటలు అని వారించేవాళ్ళం. నాన్న కోరుకున్నట్టే జరిగింది. ఇవాళ ఆయన లేకపోయినా అభిమానులు గుర్తుంచుకొన్నారు. హైదరాబాద్, ఏలూరు.. అన్ని చోట్లా ఉత్సవాలు చేసుకొన్నారు. అది మా యస్వీఆర్ కుటుంబం. బంధుజనం అందరికీ చాలా ఆనందం. నాన్న ఉండి ఉంటే బాగుండేది అనిపిస్తోంది".

యస్వీఆర్ డబ్బు మనిషి కాదు. నిర్మాతలను పీడించేవాడు కాదు. అనేక సందర్భాల్లో నిర్మాతలకు అండగా నిలబడ్డాడు. తాను సొంతగా సినిమాలు తీశాడు. సావిత్రంత అమాయకంగా డబ్బు పోగొట్టుకోలేదు. మోసాన్ని వెంటనే పసిగట్టేవాడు. యస్వీఆర్, సావిత్రి ఇళ్ళు ఎదురు ఎదురుగా ఉండేవి. యస్వీఆర్ జాతికుక్కలను పెంచేవాడు. సావిత్రీ జాతికుక్కల్ని పెంచేది. యస్వీఆర్ గుర్రపు రేసులకెళ్ళేవారు, సావిత్రి కార్ రేసులకు వెళ్ళేది. అయితే వారిద్దరికి చాలా పోలికలున్నాయి. వారికి సినిమా బంధమే ఉండేది. సినిమాలో పనిచేసే స్త్రీ నటులందరికి యస్వీఆర్ అంటే గౌరవ భావం వుండేది. సావిత్రి, జానకి, కృష్ణకుమారి, భానుమతి ఇలా అందరూ ఆయన్ని ఎంతో గౌరవించేవారు. కల్లా కపటం లేని మనిషి. నాగేశ్వరరావు, యన్.టి.రామారావులకు ప్రొఫెషనలిజమే ఉండేది. అనుబంధాలు, సహాయ సహకారాలు వారు పెద్దగా చేసేవారు కాదు. యస్వీఆర్‌ది భిన్నమనస్తత్వం. బయట ఆయనది నాయక మనస్తత్వం. అందుకే ఆయన ప్రజల గుండెల్లో ఉన్నాడు. "స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రాలు ప్రశంసల్ని, అవార్డుల్నీ పొందినా రంగారావు దర్శకత్వం కంటే నటనకే ప్రాధాన్యం ఇచ్చేవారు.

ఆర్టిస్ట్‌గా డిమాండ్ ఉన్నా పారితోషికం విషయంలో లిబరల్‌గా ఉండేవారు. మీ డిమాండ్‌కు తగ్గట్లు పారితోషికం పెంచవచ్చు కదా' అని పాత్రికేయుడు ప్రశ్నిస్తే 'ఎందుకయ్యా పెంచి నిర్మాతలను ఇబ్బంది పెట్టడం... ఒకవేళ పెంచినా ఆ మొత్తాన్ని ఆదాయపు పన్ను అధికారులకు కట్టాల్సిందే కదా' అనేవారు. అయినా, ఎన్టీఆర్, ఏయన్నార్ కంటే ఒక్క రూపాయైనా తన పారితోషికం ఎక్కువ ఉండాలని పట్టుబట్టిన సంఘటనలున్నాయి. ఇవ్వాల్సిన పారితోషికాన్ని గట్టిగా అడిగి తీసుకోవడం లేదని లీలావతి, భర్తతో కలహించిన సందర్భాలూ ఉన్నాయి. యస్వీ రంగారావు గారు చాలా సున్నితమైన హృదయం గలవాడుగా పేరు. నిజానికి ఆయన మేనల్లుడిని గుండెల మీద పడుకోబెట్టుకొని నిద్రపోయేవాడనే విషయం వింటుంటే ఈ రోజుల్లో అలాంటి వారు వున్నారా అనిపిస్తుంది. ఉమ్మడి కుటుంబాల్లో ఈ ప్రేమలు వుండేవి. చెల్లెలు పిల్లలు, అన్నదమ్ముల పిల్లలు అందరూ కలసి పెరిగేవారు. అందుకే 'పండంటి కాపురం'లో తమ్ముడు కొడుకు చనిపోయినప్పుడు ఆ సమాధి దగ్గర యస్వీ రంగారావు చూపిన ఆ దుఃఖాన్ని మర్చిపోలేం. అంతేకాదు, ఆ ఘట్టం తెలుగు వారి గుండెల మీద ముద్రపడింది.

యస్వీఆర్ ఇంకా కొంత కాలం బ్రతికే అవకాశం వుంది. ఆయన కొన్ని సందర్భాల్లో అతిగా త్రాగడం, రోజూ చేపలు, మాంసం తినడం, గుండెజబ్బు వచ్చినా, డాక్టర్ల మాట వినకుండా సినిమాలకు డేట్స్ ఇవ్వడం ఈ కారణాల వల్ల ఆయన త్వరగా మరణించారు. ఏ అలవాటు అయినా మితిమీరితే మరణం తథ్యం. గొప్ప వ్యక్తులు మరణిస్తే దేశానికి, ప్రజలకు కుటుంబానికి చాలా నష్టం జరుగుతుంది. మనకు తెలుగులో ఇద్దరు ప్రతిభావంతులు – ఒకరు యస్వీఆర్, రెండవ వారు సావిత్రి– సావిత్రిగారైతే అతి తాగుడు, సినిమాలు తీసి నష్టపోవడం, కొందరిని నమ్మి భంగపడడం అనే కారణాల వల్ల చనిపోయింది. కానీ ప్రజల గుండెల్లో వీరిద్దరూ నిలబడిపోయారు. రాను రాను వీరిద్దరికి గుర్తింపు కూడా పెరుగుతుంది. ఆమెను మహానటియని, యస్వీఆర్‌ను నటసార్వభౌముడని కీర్తిస్తున్నారు. వారిలోని దాతృత్వం, దయ, కరుణ భావాలు అనేక కథలుగా ప్రచారం అయ్యాయి. సహాయం పొందిన వారంతా వారి గురించి వేనోళ్ళ కొనియాడుతూనే వున్నారు. వారిరువురిలో మానవత్వం వుంది. కులాతీత, మతాతీత, భాషాతీత ప్రతిభ వారిది.

నాలుగు దశాబ్దాల ఆయన నట జీవితం తెలుగు వారిని ప్రభావితం చేసింది. ఎన్నో అడ్డంకులు ఎదుర్కొని ఆయన వ్యక్తిత్వ శిల్పాన్ని తీర్చిదిద్దుకున్నారు.

ఆయన 1977 జులై 18వ తేదీన మరణించారు. 59 సంవత్సరాలు ఆయన జీవించారు. యస్వీఆర్ జీవితం నటసార్వభౌమత్వానికి గుర్తు. ఎత్తుపల్లాలు ప్రతి జీవితంలో వుంటాయి. వాటిని ఎదిరించి ఎలా నడిచాడనేదే చరిత్ర. యస్వీఆర్ తెలుగు వారి నటసార్వభౌముడు, ఆయనకు మరణం లేదు. చిరస్థాయిగా ఆయన కీర్తి వెలుగుతుంది. తెలుగు వారి కీర్తి కిరీటంలో అది వసివాడని వజ్రం. వారిని స్మరించడం తెలుగువారికి గర్వకారణాంశం.


## 'అమ్మనుడి' లభించుచోట్లు

నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ భవనం ఎదురుగా,
కాచిగుడా. **హైదరాబాదు – 500 027.**
ఫోన్ :040–24652387

మైత్రీ బుక్‌హౌస్, జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు
(ఏలూరు రోడ్డు) **విజయవాడ – 520 002.**
ఫోన్ : 9866211995

మణి బుక్‌స్టాల్, షాప్ నెం.58, సండేమార్కెట్,
**నెల్లూరు**–1. ఫోన్:7386223538.


కన్నవారినీ తోడబుట్టినవారినీ తెలుగులో పిలువలేని బ్రతుకెందుకు?!

భాషోద్యమ కథానిక

# శపథం

చెన్నూరి సుదర్శన్
9440558748

శాన్ ఫ్రాన్సిస్కో విమానాశ్రయం నుండి ఎమిరేట్స్ విమానం గాలిలోకి అత్యంత వేగంగా ఎగిరింది.

అందులో ప్రయాణిస్తున్న అరుణ మనసు అంతకంటే వేగంగా ముందుకు కదిలింది. మనసుకంటే వేగవంతమైనదేదీ లేదీ లోకంలో! అలా గాలిలో తేలిన మనసు తన మాతృదేశంలోని ఇంటి మీద వాలగానే.. ఆనాటి శపథం గుర్తుకు వచ్చి ఒళ్ళంతా ఒక్కసారిగా కంపించి పోయింది. తను ఎంత పెద్ద తప్పుచేసింది...కన్న తండ్రితో ఏ కూతురూ చేయని శపథంమది...మహా ఘోరం. ఒకటా...రెండా...దాదాపు పది సంవత్సరాలు.. పది సంవత్సరాల కిందటి శపథం. ఎంత శోచనీయం. తండ్రి మనసు ఎంత క్షోభ పడిందో..! తలుచుకుంటుంటే తన మీద తనకే ఏవగింపు కలుగుతోంది. విమానం ముందుకు వెళ్తుంటే ఆమె ఆలోచనలు వెనక్కి వెళ్ళసాగాయి..

✦ ✦ ✦

అరుణ ఇంటికి పెద్ద కూతురు. అదీ అరుణ అమ్మ అరుంధతమ్మ గారు ఎన్నో నోములు నోచిన ఫలితం. అతిగారాబంగా పెరిగింది. ఆ గారాబమే తనను ఊళ్ళోని బడిలో తెలుగు మాధ్యమంలోకి తోసేసింది. దానికి కారణం అరుణ నాన్న పరంధామయ్య గారు కూడా..

పరంధామయ్య ఆఊరి బళ్ళో తెలుగు పండితుడు. మాతృభాషాభిమాని. అతడు బడిలో తెలుగు నీతిపద్యాలు చదువుతూ.. వాటి అర్థాలు వివరిస్తుంటే చెవి కోసుకోనివారు లేరంటే అతిశయోక్తి గాదు.

ప్రతీరోజు సాయంత్రం పాఠశాల ప్రాంగణంలో ప్రవచనాలు బోధించడానికి ఒక గంట సమయం వెచ్చించేవాడు. అతని ప్రవచనాలు వినడానికి సుదూర ప్రాంతాల నుండి జనం జాతరలా...తరలి వచ్చేవారు. వాతావరణమంతా తిరుమలలో స్వామి వారి



అరుణ అమెరికా ప్రయాణమవుతుంటే పరంధామయ్య జాగ్రత్తలు చెబుతున్నా విననట్టే నటించింది. తాను చేసిన ఒక్క తప్పుకు అంతగా శిక్షించే అరుణను కనికరించమన్నట్లుగా కంట తడిపెట్టిన పరంధామయ్య ముఖం చూసి కూడా ఆమె హృదయం ద్రవించలేదు.

దర్శనానికై వచ్చిన భక్తజన సందోహంగా గోచరించేది.

పరంధామయ్య రామాయణం, మహా భారతం ఇత్యాది గ్రంథాలలోని మహా పురుషుల వ్యక్తిత్వాలను వివరిస్తూ.. నేటి కాలానుగుణంగా విశ్లేషిస్తూ...చక్కని ఉదాహరణలతో అలరించే వాడు. అతని ప్రవచనాలు ప్రజల వ్యక్తిత్వ వికాసానికి దోహద పడేవి. ఇప్పుడు చాగంటి గారికి ఉన్నంత పేరు అప్పట్లో పరంధామయ్య గారికి ఉండేది. డబ్బు సంపాదనే ధ్యేయంగా పెట్టుకుంటే లక్షలు గడించేవాడేగాని.. ఒక్క పైసా కూడా జనం నుండి ఆశించేవాడు గాదు పరంధామయ్య.

పరంధామయ్య అడుగు జాడల్లో నడుస్తూ సంసారాన్ని గుట్టుగా నెట్టుకు వచ్చేది అరుంధతమ్మ. కాపురానికి వచ్చిన పది వసంతాలకు కడుపు పండింది. 'గొడ్డు వచ్చిన వేళ.. బిడ్డ వచ్చిన వేళ' అన్నట్లు అరుణ ఇంట్లో కలియతిరుగుతున్నట్లే లక్ష్మీదేవి కరుణకు పాత్రులయ్యారు. పరంధామయ్యకు ఉద్యోగ హోదాలో ఉన్నతి లభించింది.

ఊరూ అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతూ...పసిపిల్లల పాఠశాల కాస్తా పదవ తరగతి వరకూ ఎదిగింది.

అయినా పల్లెవాసులు ఆంగ్ల మాధ్యమ వ్యామోహంలో పడి పట్నంలోకి పరుగులు తీయక మానలేదు.

కాని అరుణ.. లేక లేక కలిగిన సంతానమైతేనేమి.. అరుణను అరక్షణం విడిచి ఉండలేని అరుంధతమ్మ గారాబమైతేనేమి.. పరంధామయ్యకు ఆరో ప్రాణమైన తెలుగు మూలాన అదే ఊళ్ళోని తెలుగు మీడియంలో చేరాల్సి వచ్చింది.

అరుణ రెండవ తరగతిలో ఉన్నప్పుడు అరుంధతమ్మ మరో ఆడబిడ్డకు జన్మనిచ్చింది. కరుణ అని పేరు పెట్టారు.

కాలానుగుణంగా అరుంధతమ్మ విన్నపాలు వినలేక, వినలేక పోయాడు పరంధామయ్య. చివరికి తన మనసును చంపుకొని కరుణను పట్నంలోని ఆంగ్లమాధ్యమ పాఠశాలలో చేర్పించక తప్పలేదు.

ఆనాటి నుండి అరుణ మనసులో అలజడి మొదలయ్యింది. తోటి స్నేహితుల వెక్కిరింతలు రోజు రోజుకూ అధికం కాసాగాయి. పసితనంలో అంతగా పట్టించుకోక పోయినా పదవతరగతి వచ్చేసరికి అరుణలో అసహనం

అసాధారణమయ్యింది.

'అక్క తెలుగు.. చెల్లెలు ఆంగ్లం' అని వ్యంగ్యంగా తోటి స్నేహితులు పాడే పాటలు వినలేక పోతోంది. అరుణ మనసులో మొలకెత్తిన అక్కసు బీజం క్రమేణా పెరిగి మహావృక్ష మయ్యింది.

అవ్వాళ పదవతరగతి ఫలితాలు వెలువడిన రోజు. అరుణ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణురాలయ్యింది. పరంధామయ్య ఆనందానికి అవధులు లేవు.

ఆది నుండీ గమనిస్తున్న పరంధామయ్య ఆరోజు అరుణను కూర్చోబెట్టి తెలుగు ప్రాముఖ్యతను చెప్పాలనుకున్నాడు. అదే విషయాన్ని అరుంధమ్మతో చర్చించాడు. కరుణ పట్నం నుండి రాక ముందే అరుణతో మాట్లాడాలని నిర్ణయించుకున్నారు.

అరుణ తన స్నేహితురాండ్లకు మిఠాయిలు పంచుతుంటే.. వారి వ్యంగ్యాస్త్రాలు మరింత అధికమయ్యాయి. కోపమంతా దిగమింగుకొని ఇంట్లోకి అడుగు పెట్టగానే పరంధామయ్య ఆప్యాయంగా అరుణను దగ్గరికి తీసుకొని..

"అరుణా.. తెలుగు మాధ్యమం తీసుకొని నా పేరు నిలబెట్టావమ్మా. ఏమాధ్యమమన్నది కాదు ముఖ్యం. అందులో మనమెంత విజ్ఞానం సంపాదించా మన్నదే ముఖ్యం. " అంటూ ప్రేమగా తలనిమురబోయాడు.

ఉన్నఫళంగా గయ్యిన ఒంటికాలు మీద లేచింది అరుణ.

"మీ ప్రవచనాలు నాదగ్గర కాదు.. ఊరి గొర్రెల మంద ముందర చెప్పుకొండి.." అంటూ త్రాచుపాములా బుసలు కొట్టసాగింది. ముఖం కందగడ్డలా మారింది. ముక్కుపుటాలు ఎగుర సాగాయి.

అరుణ వెనకాలే నిల్చున్న అరుంధతమ్మ విస్తుపోయింది. అప్రయత్నంగా తెరుచుకున్న తన నోటిని ఎడంచేతి వ్రేళ్లతో మూసుకుంది. అరుణ విశ్వరూపం అలా చూడ్డం అదే ప్రథమం. పరంధామయ్యకు నోట మాటరాక దూరంగా జరిగి కుర్చీలో కూలబడిపోయాడు. అరుణ నోట అంత మాట వస్తుందని తను కలలో గూడా ఊహించలేదు.

"కరుణను ఇంగ్లీష్ మీడియం.. నన్నేమో...తెలుగు మీడియం...ఇక నీతో ఈజన్మలో మాట్లాడను..." అంటూ శపథం చేసింది. పరంధామయ్యను తీక్షణంగా చూసుకుంటూ వేగంగా తన గదిలోకి వెళ్ళిపోయింది.

"ఏదో.. చిన్న పిల్ల. స్నేహితులు గేలి చేసి ఉంటారు. ఆ కోపం మీ మీద చూపిస్తోంది. పిల్లలు తల్లిదండ్రుల మీద గాకుండా ఇంకెవరి మీద అలుగుతారు.. మీరేమీ బాధ పడకండి" అంటూ ఉపశమన వాక్యాలు పలికింది అరుంధతమ్మ.

పరంధామయ్య హృదయభారంగా కళ్ళు నెమ్మదిగా మూసుకున్నాడు.

ప్రవచనాలు ప్రక్క వాళ్ళకే గాని ఇంట్లో వారికి పనికి రావు.

మొదట తేలిగ్గానే తీసుకున్నాడు పరంధామయ్య. కాని అరుణ నిర్ణయం అచంచలమయ్యింది. 'నాన్నా..' అని పిలవడం లేదు.. మాట్లాడ్డం లేదు.. ఏమడిగినా సమాధానం లేదు. ఏది కావాలన్నా అరుంధతమ్మను అడుగుతోంది. ఆమె తిరస్కరిస్తే అన్నాహారాలు మాని మూలకు మంచమేస్తుంది. రోజంతా గడిచినా అరుణ వైఖరిలో మార్పుఉండదు. ఆ బాధ చూడలేక తనతో మాట్లాడక పోయినా సరే.. బిడ్డ బాధ పడొద్దని పరంధామయ్య సర్దుకుపోసాగాడు. 'అలిగే బిడ్డతో.. చెలిగే గొడ్డుతో వేగేది కష్టం..' అనుకున్నాడు మదిలో.

అరుణ బియ్యే డిగ్రీ పూర్తయ్యింది.

అదేమి చోద్యమో గాని అరుణకు ఎమ్మేలో తెలుగులో మాత్రమే సీటు లభించింది. నా ఖర్మ.. అని వగచుకుంటూ చదువు కొనసాగిస్తూంది.

ఆంగ్ల మాధ్యమంలో చదివిన స్నేహితురాండ్లకు అమెరికా సంబంధాలు రావడం.. పెళ్ళిళ్ళు చేసుకొని విమానాలలో ఎగిరి పోవడం అరుణ జీర్ణించుకోలేక పోతోంది. ఆ ప్రభావం, తండ్రితో మాట్లాడక పోవడానికి మరింత అఘాతాన్ని సృష్టిస్తోంది.

పెళ్ళి సంబంధాల వేటలో ఉన్న పరంధామయ్యను గమనించి తన తల్లితో నిక్కచ్చిగా చెప్పింది అరుణ..

అమెరికా సంబంధం తప్ప నేను మరొక సంబంధం చేసుకోనని.

ఎలాగూ పరంధామయ్య వల్ల అయ్యే

పని కాదు.. మరొక రకంగా ప్రతీకారం తీర్చుకోవచ్చని అరుణ ఊహ. కాని అరుణ ఊహలను తలక్రిందులు చేస్తూ ఒక అమెరికా సంబంధం వెదుక్కుంటూ వచ్చింది. మంచి సంప్రదాయ కుటుంబమని.. అమ్మాయి అందచందాలతోబాటు ప్రఖ్యాత ప్రవచనాల పరంధామయ్య కూతురని అబ్బాయి ధీరజ్ మక్కువ చూపాడు.

తన్నుకు వచ్చే అదృష్టాన్ని అరచెయ్యి పెట్టి ఆపడమెవరి తరము..?!

ఆశ్చర్యపోవడం అరుణ వంతయ్యింది. వంకబెట్టడానికి ధీరజ్‌లో ఏలోపమూ కనబడ లేదు.

అరుణ, ధీరజ్‌ల వివాహం వైభవంగా జరిగింది.

అరుణ అమెరికా ప్రయాణమవుతుంటే పరంధామయ్య జాగ్రత్తలు చెబుతున్నా విననట్టే నటించింది. తాను చేసిన ఒక్క తప్పుకు అంతగా శిక్షించే అరుణను కనికరించమన్నట్లుగా కంట తడిపెట్టిన పరంధామయ్య ముఖం చూసి కూడా ఆమె హృదయం ద్రవించలేదు.

'నిజమే.. కొందరు స్త్రీలు తాము తీసుకున్న నిర్ణయాన్ని మార్చుకోరు. అలాంటి వారి హృదయాన్ని మార్చడం ఎవరి తరమూ కాదని' తన ప్రవచనాలలో విశదీకరించే పరంధామయ్య నేడు అనుభవించాల్సి వచ్చింది.

రామాయణంలో సీతాదేవి సైతం పిల్లలను శ్రీరామునికి అప్పగించి.. ఎంతగా వేడుకున్నా తన తల్లి భూమాత దరి చేరిందే గాని రాముని చెంతకు తిరిగి రాలేదు.

అయినా తన బిడ్డకు ఏ ఆపదా రానీయకు తండ్రీ.! అని ఆ సర్వాంతర్యామిని మనసులోనే వేడుకుంటూ అరుణను దీవించి సాగనంపాడు పరంధామయ్య.

✦ ✦ ✦

దుబాయి వచ్చింది. ఆలోచనలనుండి తేరుకుంది అరుణ.

దుబాయి నుండి శంషాబాదుకు మరొక విమానం మారాలి. అదీ ఎమిరేట్స్ విమానమే. దాదాపు నాలుగు గంటల వ్యవధి.. నాలుగు యుగాల్లా అరుణ మనసు నానా విధాలుగా తల్లడిల్లసాగింది.

✦ ✦ ✦

దుబాయి నుండి ఎమిరేట్స్ విమానం దూసుకువెళ్తోంది..

అరుణ తిరిగి గతంలోకి జారుకుంది.

అమెరికా వెళ్ళాక అరుణ ఫోన్లో తన తల్లితో మాత్రమే మాట్లాడేది.. చెల్లెలితో అంతంత మాత్రమే. తనకు కరుణపై ఈర్ష్య ఉన్నా కనబడనియ్యక పోయేది.

అరుణకు అమెరికాలో ఉద్యోగం చెయ్యాలనే ఆశ.

తనూ డాలర్లు సంపాదించాలనే వ్యామోహం.

కాని తెలుగు మాధ్యమానికి అమెరికాలో ఉద్యోగం రావడం అసాధ్యమని... ఈ విషయం ధీరజ్‌తో చర్చించి అవమానపాలవడంకంటే మిన్నకుండడం ఉత్తమమని తనలో తానే వగచేది.

కాని అరుణ అనుమానించినట్లుగా జరుగ లేదు. ఒకరోజు అరుణ చేతికి అమెరికా తెలుగు భాషాసంఘంలో ఉద్యోగవిషయమై మౌఖిక పరీక్షకు హాజరు కమ్మంటూ ఉత్తరం వచ్చింది. అది చూసి అరుణకు మూర్ఛవచ్చినంత పనయ్యింది. నమ్మశక్యం కాలేదు.. పదే పదే చదివింది. అచ్చ తెలుగులో ఉందా ఉత్తరం.. అమెరికాలో తెలుగు పంతులు ఉద్యోగం.. పెదవులపై చిన్నగా దరహాసం పుష్పించింది.

ధీరజ్ దూరంగా నిలబడి అరుణ ముఖ కవళికలను చదువుతూ.. "నిజమే అరుణా.. తెలుగు పండితుల కుటుంబంలో నుండి వచ్చిన దానివి. నాకూ మన మాతృభాష తెలుగంటే అమితమైన ప్రేమ. కాని మానాన్న గారి అభిమతం మేరకు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా మారాల్సి వచ్చింది. నాలోని కోరికల్ని నీ ద్వారా సాధించుకోవాలనే నిన్ను ఏరి.. కోరి నాదానిని చేసుకున్నాను.

తెలుగులో నీ సామర్థ్యాన్ని వృధా కానివ్వదల్చుకోలేదు. నేనే ఆటా అమెరికన్ తెలుగు అసోసియేషన్ వారితో సంప్రదించాను" అంటూ లాలనగా అరుణను దగ్గరికి తీసుకున్నాడు. అరుణ కళ్ళల్లో ఆనంద బాష్పాలు దొర్లాయి. కృతజ్ఞతా పూర్వకంగా ధీరజ్‌ను మనసారా హత్తుకుంది.

ఉద్యోగంలో చేరిన రోజు తన కలలు పండాయని.. తనూహించని జీతభత్యాలని.. ఉద్వేగానికి లోనయ్యింది.. పైపెచ్చు మన మాతృభాష సేవలో తరించవచ్చని మొదటిసారిగా ఆలోచన చిగురించింది. తెలుగు కుటుంబాల పిల్లలకే గాకుండా అమెరికావాసుల పిల్లలకూ తెలుగు నేర్పే అవకాశం రావడం చక్కని అనుభూతి కలుగుతోంది. అమెరికావాసులు సైతం తెలుగు నేర్చుకోవాలనే ఉత్సుకత చూపించడం.. విస్మయానికి లోనయ్యింది.. 'విశ్వవ్యాప్తం కావాలి మన తెలుగు' అన్న తన తండ్రిగారు గుర్తుకు వచ్చాడు. అప్రయత్నంగా అరుణ కళ్ళు కన్నీటి కడవలయ్యాయి.

మాతృదేశానికి ఎగిరి వచ్చి పరంధామయ్య కాళ్ళ మీద పడి గుండె పగిలేలా ఏడ్వాలని.. ఎదురు చూసిన రోజు రావడం.. హృదయ స్పందన అధికం కాసాగింది.

✦ ✦ ✦

విమానం నేలపై వాలిన శబ్దానికి అరుణ ఆలోచనలు ఆగిపోయాయి.

శంషాబాదు విమానాశ్రయంలో అడుగు పెట్టగానే అరుణ ముందుగా నేల తల్లిని ముద్దాడుతుంటే.. అరుంధతమ్మ కళ్ళల్లో మెరిసింది. అమ్మకు ఎంత ఓపికో భూదేవికున్నంత. అనుకుంది మనసులో. విసుగనేది ఆమె ముఖంలో చూసి ఎరగదు. తను ఏదడిగినా క్షణాల్లో ప్రత్యక్షమయ్యేది. దాని వెనుకాల నాన్న ఉన్నాడనే సత్యం తెలిసినా.. నిర్లక్ష్యధోరణే తనది. చెమ్మగిల్లిన కళ్ళను కడకొంగుతో ఒత్తుకుంటూ ఫలకంపై కదలాడుతూ.. దరికి చేరిన తన రెండు సూట్‌కేసులను అందుకుంది.

✦ ✦ ✦

గట్టమ్మపల్లె పరిసర ప్రాంతంలో కారు ప్రవేశించగానే అరుణ హృదయం ఉవ్వెత్తున ఎగిసింది. తాను చదివిన పదవ తరగతి పాఠశాల పలుకరించుకుంటూ వెళ్ళింది. నాన్న మెప్పుకోలు గుర్తుకు వచ్చింది. మరో పది నిముషాలలో నాన్న పాదాలపై వాలొచ్చు.. అని మనసులో ఆరాట పడుతూ దూరంగా కనిపించే తమ ఇంటిపై దృష్టి సారించింది.

ఇంటిముందు గుమి గూడిన జనాన్ని చూడగానే అరుణ మనసేదో కీడును శంకించింది. కాళ్ళలో వణుకు పుట్టింది. మరి

**(తరువాయి 37వ పుటలో...)**

మధురాంతకం నరేంద్ర
9866243659

# తెలుగు వచన రచన - సాహిత్య ప్రభావం

**యిటీవల సుంకోజి దేవేంద్రాచారి అనే మిత్రుడు రాసిన నవల "రెక్కాడినంత కాలం" కు ముందుమాట రాశాను. దాన్ని ప్రచురిస్తున్న విశాలాంధ్ర ప్రచురణాలయం నుంచీ నాకో రోజున ఫోనొచ్చింది. అక్కడ ప్రచురణల విభాగాన్ని చూస్తున్న రామారావుగారు "మీ రాతలో ఇ, ఎ, ఋల వంటి అచ్చులకు బదులుగా యి, యె, ర వంటి హల్లులే వాడారు. మేం గూడా ప్రచురిస్తున్నప్పుడు అలాగే వాడాలా? లేకపోతే అచ్చుల్ని వాడొచ్చా?" అని ప్రశ్నించారు. నాకు వెంటనే సమాధానమమేం చెప్పాలో తోచలేదు.**

యిలా అచ్చులకు బదులుగా హల్లులు రాయడమన్న పద్ధతిని నేను 1980 ప్రాంతాల్లో ప్రారంభించినట్టున్నాను. అప్పుడీ పద్ధతిలో రాస్తున్న వాళ్లు చాలామందే వుండేవారు. యీ పద్ధతిని బహుశా వద్దెర చండీదాస్‌గారు ప్రారంభించినట్టున్నారు. తన ప్రసిద్ధ నవల "హిమజ్వాల" కు 'అర్ధానుస్వారం' అనే పేరుతో రాసిన మలి పలుకుల్లో ఆయన యిలా రాశారు.

"తెలుగు లిపి సంస్కర్తను కానుగానీ, అవసరం కనిపించక యీ కింది అక్షరాలు వాడే అలవాటు లేదు నాకు.

ఇ, ఈ, ఉ, ఊ, ఋ, ౠ, ఌ ౡ ఎ, ఏ, ఒ, ఓ, ఔ, చే, జే, ఱ (16)"

యీ పద్ధతిలోని సౌలభ్యమేమని అడిగినప్పుడు చండీదాస్‌గారు, వర్ణమాలలో తక్కువ అక్షరాలుంటే టైపు చేయడానికి సౌలభ్యంగా వుంటుందని చెప్పారు. నిజమే గదా అనిపించింది. పైగా "ఇల్లు" ను "యిల్లు" అని రాసినా పలకడంలో తేడా వుండదు గూడా! మొత్తానికి ఈ పద్ధతిలో రాసి రాసీ నేనిప్పుడు ఇ, ఉ, ఓ, ఋ లు రాయడమే మరిచిపోయాను. వాక్యం ప్రారంభంలో అలా హల్లుతో పదాల్ని రాయడం తప్పని వాదించిన వాళ్ళుగూడా వున్నారు. కానీ "వొక యింద్ర ధనస్సు విరిసే ముందు"అనే వో కథకు పేరు గూడా పెట్టేశాను.

కానీ యిన్నాళ్ల తర్వాత యిప్పుడు విశాలాంధ్ర రామారావుగారు యే పద్ధతిని యెన్నుకోవాలో చెప్పమని అడిగినప్పుడు వెంటనే సమాధానం దొరకలేదు. యిప్పుడు టైపు రైటరు అవసరం లేదు. కంప్యూటరుపై డీటీపీ చేస్తున్నప్పుడు యెన్ని అక్షరాలైనా పెద్ద తేడా రాలేదు. నాకు కావాల్సిన తెలుగు టైపు చేసే గిరివర్మగారు గూడా యిప్పుడు నేనెలా రాస్తే, అలాగే టైపు చేస్తున్నారు. కాల క్రమంలో జరిగిన మార్పుల వల్ల భాషలో - రాయడంలోనూ, మాట్లాడడంలోనూ - మార్పులు వస్తూనే వుంటాయి. యిలా మార్పులకు లోనవడమే జీవద్భాషకుండే గొప్ప లక్షణం.

అన్ని భాషల్లోనూ ముందుగా కవిత్వమే పుట్టింది. కవిత్వాని కుండే సంగీతాత్మకతతో బాటుగా, కాగితాలూ, ప్రచురణ యంత్రాం గమూ లేని తొలిరోజుల్లో వినికిడిపైన, జ్ఞాపకశక్తిపైన ఆధారపడవలసి రావడంతో కవిత్వ రచనకే సౌలభ్యం వుండేది. వచన రచనలకోసం అన్ని భాషల్లోనూ పాఠకులు చాలా శతాబ్దాలు వేచి చూడాల్సి వచ్చింది. దాదాపుగా 18,19 శతాబ్దాల్లోనే అన్ని భాషల్లోనూ వచన రచనలకు ప్రాముఖ్యత వచ్చింది. అందువల్ల ఆ తొలి రోజుల్లో సాహిత్యభాషగా వచనాల్ని రూపొందించడంలో తడబాటూ, అనుభవరాహిత్యమూ కనబడుతుంది. రవీంద్రనాథ టాగూరు బెంగాల్‌లో వచన రచనలు చేసినప్పుడు, ఆయన సాదాసీదా మాటలన్నింటినీ తీసుకొచ్చి రచనల్లోవాడి, సాహిత్యభాషను సంకరభాషగా చేసి పారేస్తున్నాడని కొందరు పండితులు మండి పడ్డారట. అయితే ఆయనపైన తొలి గ్రంథాన్ని రాసిన ప్రముఖ కన్నడ రచయిత మాస్తి వేంకటేశ అయ్యంగారు అలా రవీంద్రుడివంటి వ్యక్తి చేత సంకరభాషగా తయారయ్యే అదృష్టం అన్ని భాషలకూ కలగదని వాదిస్తారు.

అమెరికా సాహిత్య చరిత్రను రాసే విమర్శకులు ఆధునిక అమెరికా సాహిత్యమంతా మార్క్‌ట్వెయిన్ రాసిన 'హకిల్ బెరీఫిన్' నవలలోంచీ పుట్టిందని పేర్కొంటారు. వస్తువులో ఆధునికతతోబాటూ మార్క్‌ట్వెయిన్ వాడిన భాష గూడా అందుకు కారణం. ఆ నవలలో మార్క్‌ట్వెయిన్ నాలుగు ప్రాంతాల మాండలికాల్ని వాడారు. దానికి రాసిన చిన్న ముందు మాటలో ఆ నవలలోని పాత్రలు తమదైన స్వంత మాండలికంలో మాట్లాడతాయనీ, అన్ని పాత్రలూ వొకేలా మాట్లాడుతున్నాయని పొరబడవద్దనీ, రచయిత పనిగట్టుకుని శ్రద్ధగా, చిత్తశుద్ధితో ఆయా పాత్రల పాత్రోచితమైన భాషను వాడుతున్నాడని గమనించమనీ ఆయన రాస్తాడు.

అమెరికాలో మార్క్‌ట్వెయిన్ చేసిన పనిని తెలుగులో గురజాడ అప్పారావుగారు చేశారు. కథనంలో శిష్ట వ్యావహారికాన్నీ, పాత్రల సంభాషణల్లో పాత్రోచితమైన మాండలికాన్నీ ఆయన వాడారు. ఆయన రాసిన కథ "మతము - విమతము"లోని యీ వాక్యాల్ని గమనించండి.

"ముసల్మాను స్వచ్ఛమైన తెనుగు నవలింభించలేదనెను"

"అయ్యో! మా పెదమావ రామావధాన్లు, చినమామ లక్ష్మణభట్టు దేశాంతరగతులైనారా? మృతులైనారా?"

సాయిబు చేతి నుంచి చిలుమునేలరాలి, ముక్కలై, నిప్పులు నలుదెసలు చెదర "నారాయణ" యని నభేదంగా పిలిచెను.

మొదట్లో సరళ గ్రాంధికంలో రచనలు చేసిన శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారు ఆ తరువాత వ్యావహారిక భాషా వుద్యమ ప్రభావంతో అచ్చమైన వ్యావహారికంలో రాయడం మొదలు పెట్టారు. తూర్పు గోదావరి జిల్లా బ్రాహ్మణ కుటుంబాలను గురించి కథలు రాసిన "శ్రీపాద" పురుషుల కంటే స్త్రీల భాషలో మాధుర్యమూ, హృదయాలు పట్టి వేసే జాతీయతా కనబడింది నాకు. వారి మాటల పొందికా, వారి హావభావ ప్రదర్శనా, చాతుర్యమూ నాకు

మాతృభిక్షను ప్రసాదిం చాయి". అంటారు. అత్యంత చిన్న వాక్యాలు రాయడం శ్రీపాదదైన ప్రత్యేక శైలి.

"మఱుగు నెయ్యే"

"మరి తప్పదు"

"ఒప్పుకునే వచ్చారా ఏమిటి?"

"లేకపోతే చావనా?"

"ఇన్నాళ్ల నుంచీ కాపురం చేస్తున్నాను. ఇంత మందిని కన్నాను. కానీ పండుగరోజు అయినా మిల్లి గరిటెడు ఎరగం"

ఈ ఉద్యోగాలు లేనప్పుడు ఆ నిర్భాగ్యుడు మాత్రం ఎరుగునా? వాడి రోజిది"

"ఇంకేమీ లేదుగదా?"

"ఆవు కూడా..."

"ఏమిటీ?..." (కలుపు మొక్కలు" కథలోంచీ)

తానెన్నుకున్న విషయానికి తగ్గట్టుగా జలపాతపు వురవడిలాంటి భాషనూ, వాక్య విన్యాసాన్నీ తయారు చేసుకున్న రచయిత చలం. కథల్లో కవిత్వాన్ని పొదిగే కళను ప్రారంభించిన తొలి కథకుడాయన. వ్యక్తుల సంఘర్షణల్ని చిత్రించవలసినప్పుడు ఆయన వ్యాకరణ నియమాల్ని ధిక్కరించడానికి సందేహించరు. జీవన సంక్లిష్టతల్ని వెల్లడించవలసి వచ్చినప్పుడు కవితా రూపకంలో, ప్రతీకాత్మకంగా రచనలు సాగిస్తాడాయన. తన భావోద్వేగాలకనుగుణంగా భాషను మలచుకోవడంలో ఆయన సిద్ధహస్తుడు. "ఆమె త్యాగం" అనే కథలో ఆయన యిలా రాస్తాడు:

"యీ అశాంతి అంతా ఆమె మీద మోహం వల్లనా, ఆమె మీద వాంఛా నన్నిట్లా బాధిస్తోంది అని ఆలోచించానొకరాత్రి. ఆమె నన్నంగీకరించినట్టూ, నా హస్తాల్లో ఆమెను అదుముకున్నట్టూ భావించుకుని చూశా. వెంటనే నా పైని, నా తుచ్ఛ కామం పైని పరమాసహ్యం కలిగింది. మంచి వాసనలు మెత్తని రంగులతో నవ్వే గులాబీ పువ్వుని ఎంగిలి ముద్దు పెట్టుకున్నట్టే చల్లని నిర్మలమైన చందమామను వేడి నిశ్వాసాలతో కావిలించుకున్నట్టే, శుభ ప్రదయతేజస్సులో బూతులు మాటాడినట్టుంది".

చలం కోవలో చింతా దీక్షితులు, వేలూరి శివరామశాస్త్రి వ్యావ హారిక భాషనూ, పాత్రోచితమైన భాషనూ వాడుతూ కథలురాశారు.

భాషా ప్రయోగంలో తనదైన విశిష్టతను చూపించిన కథకుడు మల్లాది రామకృష్ణశాస్త్రి. కృష్ణాతీర ప్రజల జాణ తెనుగులో కథలు రాసిన మల్లాదిగారు కథకుల్లో కవి. మౌఖిక ధోరణిలో అద్భుతమైన కథలు రాసిన వాడాయన. "వెన్నెలకు కమ్మదనముంటే, కమ్మదనానికి చల్లదనం తోడైతే, కర్పూరపు పలుకుల నున్నదనం నోచుకుంటే, కమ్మదనం, నున్నదనం, చల్లదనం – యీ మూడూ కలిసిన మలయా మారుతానికి తీయందనముంటే, అది ఈ కవిగారికి వర్తిస్తుందని పింగళి సూరన్నగారన్నా, ఆ మాటలు మల్లాదివారికే అక్షరాలా వర్తిస్తాయని" ఆరుద్రగారంటారు. "మునిగోరింట", సర్వమంగళ," "మత్తుకోకిల", "వినవేడుక", "అల్లో నేరేడు" – మొదలైన కథల పేరే చాలు, మల్లాదివారి జాణ తెలుగులోని తియ్యదనాన్ని పట్టివ్వడానికి. ఉదాహరణకు "సర్వ మంగళ" ప్రారంభాన్ని గమనించండి.

"నిన్ను వెదుక్కుంటూ వచ్చానమ్మా!

ఇంతదూరం, ఎక్కడో కృష్ణాతీరం నుంచీ, చల్లని తల్లివి కష్టాలన్నీ విని, కడుపులో పెట్టుకుని ఆదరిస్తావనీ, నీలో కలిసి పోదామనీ వచ్చానమ్మా...!

భావాన్ని స్పష్టంగా, సూటిగా యెదుటి వ్యక్తికి సరఫరా చేయడమే భాష ప్రధాన గుణంగా భావించినప్పుడు ఆ లక్షణాల్ని తన వాక్యాలనిండా నింపినవాడు కొడవటిగంటి కుటుంబరావు. ఆడిసన్ (Joseph Additson) అనే ఆంగ్ల రచయిత వచన రచనాశైలిని గురించి వివరిస్తూ డాక్టర్ జాన్సన్ అంటాడు. గొప్ప వచనం మంచినీళ్ళలా స్పష్టంగా, పారదర్శకంగా వుండాలని వుపమిస్తాడు. అడిసన్ తీవ్రమైన విషయాలను గురించి చర్చిస్తున్నప్పుడు సాదాసీదా ధోరణిలోనూ, తేలికైన విషయాలను గురించి చెప్తున్నప్పుడు వీలయినంత గంభీరంగానూ, అనవసరమైన హంగామాలు లేకుండా కచ్చితంగానూ, సూటిగానూ రాస్తారని అంటాడాయన. అడిసన్ వచనంలాగే కుటుంబరావుగారి వచనం గూడా సమానంగా పరచుకున్న వెన్నెల రాత్రుల్లాగే వుంటాయి. అక్కడక్కడా నక్షత్రాలు మెరిసే అమావాస్య రాత్రుల్లా వుండవు.

"తాతయ్య అమ్మమ్మని ఇప్పటికీ కొడతాడు. నాన్న అమ్మని కొడతాడు. అక్కయ్యను బావ చావబాదతాడు. మొగాళ్ళు ఆడాళ్ళని కొడతారు. తిడతారు కూడాను. ఆడ బ్రతుకే మధురం అని రేడియో పాడుతున్నది" – యిలా సాగుతాయి కుటుంబరావుగారి వాక్యాలు. యీ గుణాలన్నీ ఆయన తరంలోని మరికొందరు రచయితల రచనల్లో కనబడతాయి. రాయలసీమ కథకుడైన కే.సభాగారందులో ముఖ్యుడుగావడమే వైచిత్రి.

రాయలసీమలో ఆధునిక సాహిత్య వికాసం మిగిలిన అన్ని తెలుగు ప్రాంతాలకంటే ఆలస్యంగా జరిగిందని చాలాకాలం వరకూ అనుకునేవారు. 1910 ప్రాంతాల్లో గురజాడ అప్పారావుగారి దగ్గరి నుంచీ ఆధునిక సాహిత్యం ప్రారంభమయిందని గుర్తించినప్పుడు 1940 వరకూ రాయలసీమలో ఆధునిక సాహిత్య సృజన జరగలేదని భావించారు. అయితే యిటీవల జరిగిన పరిశోధనలు అది నిజంగాదని తేల్చి చెప్పాయి. 1920–40 ల మధ్యకాలంలో సాధన పత్రికలో వచ్చిన కథలు, వ్యాసాలు యిప్పుడు వెలుగులోకి వచ్చాయి. యీ రచనల్లో ప్రధానంగా గమనించవలసిన అంశం వాటిల్లో వాడిన తెలుగుభాష.

1918లోనే పేరు తెలియని వొక రచయిత రాసిన 'కడపటి పైసా" అనే కథలో సరళమైన గ్రాంధిక భాషనే వాడారు.

"తుంగ భద్రా తీరము. సాయంకాలమయి రెండు గడియల ప్రొద్దైనది. చీకటులు క్రమ్మనారంభించినవి. కొంత వరకూ మబ్బులు నిండి వానవచ్చు చిహ్నములు దోచినవి..." అంటూ ఆ కథ ప్రారంభమవుతుంది.

1917, 1918 ప్రాంతాల్లో అనంతపురం విద్యార్థి సంఘం వాళ్ళు ప్రచురించిన "వదరుబోతు" వ్యాసాల్లోనూ యిటువంటి శైలే కనబడుతుంది. "దీపావళి" అనే వ్యాసంలో నరకాసురుడిలా మాట్లాడతాడు.

"హిందూ దేశ వాసుల బాణ విద్యా విహారమునకుం జిక్కిన పాపి నరకాసురుండ నేను – అన్నా! ఏమి నాగ్రహచారము! నా పైననే వీరికంత చలమేల? నీ వేమి తలంతువో కాని, మీ వారి యజ్ఞత నాకేమియు సరిపడలేదు".

(ముగింపు వచ్చే సంచికలో)

రచయిత : కీ.శే. దుర్గానంద్

# శబ్దగాండీవి వేమన



'వేమన' గురించిన పరిశోధనాత్మక వ్యాఖ్యానం ఇది. ఈ పెద్ద వ్యాసాన్ని రచించిన చక్రాల దుర్గానంద్ 1927 జనవరి 12న గుంటూరు జిల్లా తెనాలి దగ్గరలోని మోదుకూరు గ్రామంలో పుట్టి హిందీ, సంస్కృతాల్ని అధ్యయనం చేసి, అధ్యాపకుడుగా వివిధ కళాశాలల్లో పనిచేశారు. పదునైన తెలుగులో విస్తారంగా రచనలు చేశారు.

ప్రస్తుత సాహిత్య లోకానికి అంతగా తెలియక పోవచ్చునేమో గానీ తనదైన సృజనాత్మకమైన, నూత్న సాహిత్య మార్గాన్ని వేసిన కవి దుర్గానంద్. పద్య గద్య శైలుల్లో అనుపమాన ప్రతిభను కనబర్చిన అరుదైన మహోన్నత సాహిత్య శిఖరం దుర్గానంద్. నాలుగు దశాబ్దాల పైచిలుకు పద్యం, వ్యాసం, గేయం, నాటకం, నవల, భాషా పరిశోధన, ప్రయోగం, వ్యాకరణం,విభిన్న సాహిత్యప్రక్రియల్లో శ్రమించి తన మేధస్సును, రక్తాన్నీ అక్షరాలుగా మార్చాడు దుర్గానంద్.

దయానందుని రచనలు, తర్వాత కబీరు ఆలోచనలు, ఆపైన మార్క్సిజం...చివరకు నూతనశైలితో నవ వ్యవస్థ నిర్మాణానికి తాత్విక భూమికను ఏర్పరచుకొన్నారు. అనిల్ బోకిల్ అర్థక్రాంతి సిద్ధాంతాన్ని నాలుగు దశాబ్దాల క్రితమే ప్రతిపాదించిన మేధావి. ఆయన దృక్కోణం మౌలికం, సృజనశీలం.

మోదుకూరుకి చెందిన కీ.శే. మొవ్వా వీరారెడ్డిగారు వేమనపై ప్రముఖుల చేత వ్యాసాలు వ్రాయించి, వాటి సంకలనాన్ని ప్రచురించాలని తల పెట్టినా వారి అకాల మరణం వల్ల అది సాధ్యం కాలేదు. వాటిలో సంజీవదేవ్, మరుపూరి కోదండరామిరెడ్డి, ఆరుద్ర వంటివారు వ్రాసిన కొన్ని వ్యాసాలను 2005 – 2006లో నడుస్తున్న చరిత్రలో ప్రచురించాము. సంకలనంలోని ఈ అముద్రిత వ్యాసాల్ని ఇప్పుడు 'అమ్మనుడి' పాఠకుల కోసం ప్రచురిస్తున్నాము. – సం



**చెట్టుక్రింద మోకాలిమీద చేయి వేసుక కూర్చున్న పురుషుడు, కవిర్మనీషీ పరిభూస్స్వయంభువు. నతత్ర చక్షు ర్గచ్ఛతి. అక్కడికి వెళ్లి కూర్చున్నాడు. ప్రకృతి తమస్సు తన వెలుగు నీడల పొదల్ని అతని మీద ప్రసరింపజేస్తుంటే అతడు అవ్వల కనుచూపు మేరల్లో దోబూచులాడే అనాద్యనంతం మహతః పరమైన ధ్రువాన్ని పరమగుహ్యమైన ఆనందో బ్రహ్మలో అంతర్విత్తాత్మ బోధాయన చిత్తుడై మైమరచి కనుగొనలతో ఈ మాయా జగత్తును వీక్షించుతున్నాడు. మోకాళ్ల మీద మోచేతులు, అసంభూతికి అవశేషాలుగా మిగిలిన ఇంద్రియ ప్రతతి, తనకు ప్రస్తుతం ఆధారమై తన ఊర్ధ్వ భాగాన్ని నిలబెడుతున్నందుకు లోలోన నవ్వుకుం టున్నాడు. సంభూతినీ బాహ్య వస్త్రాన్నీ వదిలివేసి కారణ జగత్తుతో కూర్చున్న దిగంబరి. ఇది కూడా తనను వదలి పోవడానికి ఎంతో సమయం పట్టదు. పండు పడిన జెట్టు పట్టంగ లేరయా! ఆ పండు కాస్తా జారిపోతే ఇక శాశ్వతంగా యొంటి కంబమంటి నొనర నిల్పి ఇంటి కర్తగా సాగిన కర్తృత్వ భారాన్ని కూడా త్యజించి నాద బిందు కళలకు నద్భుత జ్యోతిగా వెలిగిన ఆ పరంజ్యోతిని చేజిక్కించుకుంటాడు.**

యద్వాచా నాభ్యుదితం, దాన్నే అభ్యుదితం చేసి ఏది ప్రాణము చేత ఊహించబడదో దానినే ప్రాణం చేత ఉచ్ఛ్వసించి ఇహ తనకు మిగిలింది ఏమీ లేదని తృప్తి జెంది మహతః పరమైన దాన్ని మహత్తుతోనూ అవ్యక్తమైనదాన్ని వ్యక్త వాక్కుతోనూ చెప్పి తీర్థాలను తమస్సు అన్నాడు, అవిద్యను గాడిద అన్నాడు, బానిసను కుక్క అన్నాడు. స్త్రీని మాయావిని అన్నాడు. కంటి నలుసుల్నీ కాలి ముల్లుల్నీ ఆత్మ ప్రతిబంధకాలు అనీ వేద విద్యల్ను వేశ్యలనీ విసుక్కున్నాడు. పరం తెలియకపోతే బాపడు కాదన్నాడు. అతడు వీతరాగి, వీత శోకుడు, మహా యోగి వేమన. ఇహ మళ్లీ యీ ప్రపంచ జాంబాల పటలంలోకి తిరిగి రాడేమో. నీరు ముత్యమైన నీరుగా మారునా! ఒకసారి ముత్యమైన తరువాత మళ్లీ నీరుగా మారటం ఎలా? జ్ఞాన నిష్ఠతో మేను మరచి స్తిమితంగా ఉన్నవాడు మాయ చేజేతుల మళ్లీ చిక్కువడే కామిగాడు అతడు మోక్షగామి. జ్ఞాన కవులు ముక్తి అనే జండా ఎగురవేశారు.

"తత్త్వమసి", "సోఽహం", "త్వమేవాహం" అన్న మహా వాక్యాలే వాళ్ల నినిదాలు. సమాధి, ధ్యానం, యోగానుష్ఠానాలే వాళ్ల కార్యక్రమాలు. ఈ పద్ధతి ప్రజలకు నచ్చి ఓట్లు వేసి వాళ్లను గెలిపించారు. అందువల్లే వాళ్ల విజయ పతాక ఇప్పుడూ మన హృదయాల్లో రెపరెపలాడుతూనే ఉంది. సనాతనులు లౌకిక జీవులు. లోకానికున్న దుర్గుణాలన్నీ వాళ్ళకున్నాయి. ఈ జ్ఞానులు అలౌకిక జీవులు. వీళ్లకు లోకంతో పనిలేదు. లోకంలో ఉంటున్నారు గాబట్టే వీళ్లకు లోకంతో పని. సనాతనులకు స్వర్గ సుఖం, రంభా అప్సరసల సుఖాలు లభిస్తవో లేవో సాక్ష్యాలు లేవు గాని ఈ వేదాంతులకు ఈ జగత్తు అనిత్యం అనే ప్రబల సాక్ష్యాలు మాత్రం కోకొల్లలుగా ఉన్నాయి. వేమన అంటున్నాడు...

*తాము కన్నవారు, దము కన్నవారును*
*జచ్చుటెల్ల తమకు సాక్ష్యమె కద!*

జగత్తు అనిత్యం అంటానికి ఇంతకంటె ఇంకేమి సాక్ష్యం కావాలి? నా అనుకున్న

వాళ్ళందరూ చచ్చిపోతున్నారు. చచ్చిపోవడం చూస్తూ కూడా ఆ చచ్చిపోవడానికి సంరంభాలు దేనికి? చచ్చిపోకుండా ఉండే హాస్పటలులూ ఆరోగ్య కేంద్రాలూ ఏమైనా ఉన్నాయేమో అవి కట్టాలి. జరా మృత్యువు – ఈ దీర్ఘ వ్యాధులకు కూడా నేను హాస్పటలు కడతాను అని బుద్ధుడు బయలుదేరాడు. కొంతవరకు కట్టాడు కూడా. కిసాగౌతమి అనే ఒక స్త్రీ తన ఏకైక పుత్రుణ్ణి కోల్పోయింది. భోరుభోరున విలపిస్తుంది. తన పుత్రుని శవాన్ని కూడా దహన సంస్కారానికి ఇవ్వడం లేదు. ఆమె బాధ చూడలేక ప్రజలు ఆమెను బుద్ధ భగవానుని దగ్గరకు వెళ్లమన్నారు. ఆయన నీ పుత్రుణ్ణి బ్రతికిస్తాడు అని చెప్పారు. ఆమె నేరుగా బుద్ధుని పాదాల చెంతకు వెళ్లి విలపించింది. బుద్ధుడన్నాడు, నేను నీ పుత్రుణ్ణి బ్రతికిస్తాను. నేను చెప్పినట్టు చేయి. ఎక్కడైనా ఏ యింటికైనా పోయి గుప్పెడు నువ్వులు తీసుకురా! దాంతో నీ పుత్రుడు బ్రతుకుతాడు. సంతోషంతో కిసా గౌతమి వెళ్లబోయింది. అప్పుడు బుద్ధుడు ఆమెను ఆపి ఇలా అన్నాడు. నీవు నువ్వులు తెచ్చే యింట్లో ఇంత వరకు ఎవరూ చచ్చిపోయి ఉండగూడదు. అలాంటి ఇంటి నుండి తేవాలి. ఈ మాత్రమే గదా అని ఆమె బయలు దేరింది. అందరూ నువ్వులు ఇవ్వడానికి సిద్ధంగానే ఉన్నారుగాని, వాళ్ల ఇళ్ళలో మామో తాతో తండ్రో కొడుకో ఎవరో ఒకళ్లు చచ్చినవాళ్ళే. మృతిలేని ఇల్లు ఏ వొక్కటీ దొరకలేదు. అప్పుడు ఆమె గ్రహించింది. ప్రపంచంలో మృతిలేని ఇల్లు లేదని. బుద్ధుని కాళ్లమీద పడి తన అజ్ఞానాన్ని క్షమించమని కోరింది. పిల్లవాడి దహన సంస్కారానికి అనుమతినిచ్చింది. విలపించే కిసా గౌతమ బుద్ధుని ఉపదేశంతో ఊరట పొందింది. ఇదీ బుద్ధుని హాస్పటల్ తీరు. ఇలా మృతిని ముందు అర్థం చేసుకోవాలి. తరువాత అమృత స్థితిని సాధించవచ్చు. ముందు మనలో ఉన్న మృతి దుఃఖానికి గోరీ కట్టు. దాని అంచుల మీదే ముక్తి మేడ తయరవుతుంది. మృత్యువు మన జీవితానికి కండకండకూ అంటి ఉన్న బంధం అనుకున్నప్పుడు అది లాగి వేస్తుంటే మనం గిలగిల కొట్టుకుంటాము. కాదు అది ఒక పువ్వు, దాని సమయం వచ్చినప్పుడు దానంతట అదే రాలిపోతుంది. అనుకున్నప్పుడు దుఃఖం లేదు. ఇదే వాళ్లు సూచించిన మార్గం. భావ పరివర్తన, ఎరుకా, జ్ఞానం. అంటే ఈ హాస్పటల్ను బయట ఎక్కడో కాదు, మన మనస్సులోనే కట్టాడు బుద్ధుడు.

ఈ ఒరవడి మీదే జ్ఞాన కవులందరూ పయనించారు. మృత్యువు పువ్వు తొడిమలాగా సహజమైనప్పుడు అది విడిపోతుంటే దుఃఖం లేదు కదా! అయితే దాన్ని ఎందుకు కౌగిలించుకోగూడదు! భగత్సింగూ అల్లూరి మొదలైన వీర పురుషులు దాన్ని చిరునవ్వుతో కౌగిలించుకున్నారు కూడా వీళ్లూ జ్ఞానులే. జ్ఞాన కవులు చెప్పిన ఈ సిద్ధాంతాలే లౌకిక జీవుల జీవితంలోకి కూడా. ఎలా ప్రాకినాయో మనకు అర్థం అవుతూనే ఉంది. కాబట్టి ఈ లౌకిక సుఖాలకు ఎందుకు ప్రాకులాడుతావు! వీటితో మానవ జీవితం చాలా ఇరుకున పడిపోతుంది. ఈ లోకం అచ్చగా నాదే అనుకుంటే టెన్షన్ పెరిగిపోతుంది. క్యూలో నిలబడ వలసి వస్తుంది. లోకం శాశ్వతం కాదు, మనతో రాదు అని పూర్తిగా నిరాశ చేసుకున్నా లోకంలో పనికి రాకుండా మనం దిగజారి పోవలసి వస్తుంది. విరక్తి కలుగుతుంది. మరి ఈ లోకంలో రక్తితో ఉండాలా! విరక్తితో ఉండాలా! రక్తితో ఉండటం మంచిదేగాని మరీ కుమ్మరి పురుగులాగా పేడకు అంటుకుపోయి ఉండటం మంచిది గాదు. ఒక్కొక్కడు నాలుగు తరాల వరకు సరిపోయేట్టు సంపాయించుకోవడం, తన పొట్టకోసం ఇతరుల పొట్ట కొట్టడం, తన పంచదార కోసం ఇతరుల క్యూ ఊచల్ని విరగ్గొట్టడం. ఇదంతా మడ్డితనం. అనాగరికత కాకపోతే యేమిటి? వేమన చెప్పిన ఇలాంటి నిర్వికల్పమైన నిర్లిప్త భావ సంభరిత వాక్యాలు వింటుంటే కొంత కల్చరు వస్తుంది.

వేమన తన నిజ జీవితంలో గట్టి దెబ్బలు తిన్నవాడుగా కనిపించుతాడు. రాజాశ్రయంలో లేకపోయినా ఈయన యొక్క నిర్లక్ష్యభావం, తిరస్కార మనస్తత్వం కారణంగా అప్పటి రాజులు చాలా బాధలు పెట్టి ఉంటారు. 'అల్పబుద్ధివాని కధికారమిచ్చిన దొడ్డవారినెల్ల తొలగగొట్టు' అనీ 'చెప్పు తినెడి కుక్క చెరకు తీపెరుగునా' అనీ 'స్థాన బలిమికాని తన బల్మి కాదయా' అనీ ఎన్నో నిష్ఠురోక్తుల్తో అధికారుల్ను నిరసించడం, దానిలోని కసీ, తీవ్రతా చూస్తుంటే అతనిలో కక్షదారైన రాజున్నట్టు వ్యక్తమౌతుంది.

కవి బాధకు లోనై కవిత్వం వ్రాస్తాడు. ఆ బాధ స్వకీయమూ పరకీయమూ కూడా అయి వుంటుంది. అది సజాతీయమైనది కూడా కావాలి. బాధ వ్యక్తీకరించే తీరులో కొంత ఆలంకారికత వస్తుంది. ఆ అలంకారాలు తన భాషలోనివా పరభాషలోనివా అన్నది ఒక ప్రశ్న. తెలుగు కవులందరూ తమ బాధల్ను సంస్కృతాలంకారాలమాటున, సంస్కృత కావ్యమర్యాదల మాటునా చెప్పుకున్నారు. నన్నయ తిక్కనాదులు తెలుగు కవులై ఉండి కూడా తెలుగు హృదయాల్ను కదిలించలేకపోయారు. వేమన ఒక్కడే తెలుగు గుండెల్ను కదిలించాడు. నన్నయ వ్రాసిన కవిత్వం ఇప్పుడూ చదువుకుంటున్నారు గదా అనవచ్చు. నన్నయ కవిత్వం చదవడం లేదు. ప్రతిపదార్థాలు తీస్తున్నారు, నానార్థాలు తీస్తున్నారు. ప్రజలు చదవడం లేదు. విద్యార్థులు చదువుకుంటున్నారు. పోతన్న కవిత్వం కొంత ప్రజలు చదువుతున్నారు. ఎక్కువగా భక్తులు చదువుకుంటున్నారు. శ్రీనాధుడి కవిత్వం అనువాదకులు చదువుతున్నారు. భట్టు మూర్తి కవిత్వం, కవిత్వం వ్రాసేవాళ్ళు చదువుతున్నారు. కళా పూర్ణోదయం సినిమాలు తీసేవాళ్లు చదువుతున్నారు. నాచన సోముడి కవిత్వం పిహెచ్.డి విద్యార్థులు చదువుతున్నారు.

ప్రజలు చదువుకుంటున్న కవిత్వం వేమన్నది మాత్రమే. ఎందుకంటే వేమన ప్రజల భాషలో ప్రజల తీరులో చెప్పాడు. తతిమ్మా కవులవి అర్థం చేసుకోవాలంటే ఏ సంస్కృతమో ప్రాకృతమో, పాళీనో చదవాలి. నన్నయ తెలుగువాడే, ఆయన వేదన కూడా తెలుగుదే. అయితే నేం. ఆయన పాఠశాల సంస్కృత పాఠశాల ఆయన్ను అర్థం చేసుకోవాలంటే ఆ సిలబస్సునూ ఆ పాఠ్య క్రమాన్నీ పూర్తి చేయాలి. అప్పుడే ఆయన ఆర్తి ఆయన దుఃఖమూ ఆయన కోపతాపాలూ అర్థమవుతాయి. ఇది నుడికారములోనూ, సాంప్రదాయంలోనూ వచ్చిన తేడా. ఆర్యపుత్రా! నీకు నమస్కారం అంటే అర్థం కాదు, అయ్యా, నీకు నమస్కారం అంటే అర్థమవుతుంది. ఇంగ్లీషువాళ్ళు నమస్కారం చేయాలంటే టోపీని తీసి చేతిలో పెట్టుకుంటారు. అది మనకు తెలియకపోతే అతడేమి చేస్తున్నాడో మనకు అర్థం కాదు. తెలుగు వాళ్ళకు ఒక భావానికి చలించి అది వ్యక్తం చేసే ఒక పద్ధతి ఉంది. అది అలాగే అందించక పోతే ఎంత చదివినా మనకు తెలియదు. నాచన సోమునిదిగానీ నన్నె చోడుడిదిగానీ మనకు అర్థం కావడం లేదంటే అక్కడ ఏ సంస్కృత పద్ధతో ఏ పరభాషా పద్ధతో ఉంది. దాన్నే మనం మార్గ పద్ధతి అన్నాం. వేమన్న పద్ధతి అది గాదు. అతని బాధా, అతని తిట్టూ అంతా తెలుగు పద్ధతిలోనే నడిచింది. మనం

కోపం వచ్చినప్పుడు ఏ శబ్దంతో ఎలా తిడతామో అలానే తిట్టాడు. తిట్టేటప్పుడు అతను ఎలా నిలబడ్డాడు. అతని కళ్ళు ఎలా ఉన్నాయి. అతని నాలుక ఎలా ఆడింది. ఇది కూడా చూస్తారు పాఠకులు అతని పుస్తకంలోంచి. వేమనది అచ్చు తెలుగు పద్ధతి. అందువల్లే అతడు ఆంధ్రుల ఆరాధ్య కవి అయ్యాడు.

స్వదేశీభావాన్ని స్వదేశీ విధానంలో ఇవ్వకుండా పరాయి పద్ధతిలో ఇవ్వడమనేది ఆనాడు సంస్కృతం నుండి వచ్చింది అనుకుంటే ఈనాడు పాశ్చాత్యుల నుండి వచ్చింది. మనం భాషనే కాదు, భావాలను కూడా వాళ్ల నుండి నేర్చుకున్నాము. ఒకడు నవ్వితే ఆ నవ్వు ఇంగ్లీషుదో తెలుగుదో కూడా మనకు తెలుస్తూనే ఉంటుంది.

నవ్వూ వేదనా, ప్రతిదీ మనం విదేశీయుల నుండే ఎరువు తెచ్చుకున్నాము. అందువల్లే భావ కవులు ఎంతో కాలం బాధపడి కన్నీరు ఒలకబోస్తే ఆ కన్నీరు అర్థం అయేటప్పటికి మనకు చాలా కాలం పట్టింది. అది అర్థమయ్యింది అని తృప్తి పడే లోపలే ఆ భావ కవిత్వ యుగమూ అంతరించింది. మళ్లీ రక్తం, పిడికిళ్ళూ, విప్లవం – వీటి పదాలు, నడకా అందింపే వేరు. ఇది జాతీయమే కాకుండా అంతర్జాతీయమై కూడా కూర్చొంది. మళ్లీ దీన్ని అర్థం చేసుకోవడానికి కొంత కాలం పట్టింది. అర్థమైనా జీర్ణంకావాలిగదా, మళ్లీ విదేశీ అజీర్ణానికి విదేశీ డోసే వెయ్యాలి. ఇలా రాజు వెడలితే అతని పటాలం ఎలా తరలి పోతుందో అలాగే ఒక కొత్త కవి చుట్టూ ఒక కొత్త పాఠక వర్గం కూడా తయారవుతూ వచ్చింది. ఇప్పుడు మన రక్తనాళాల్లో విదేశీ సాహిత్య రక్తమెంతో స్వదేశీ సాహిత్య రక్తమెంతో చెప్పలేము గాని వేమన యుగంలో కొంత స్వదేశీయత ఉంది. దేశం ఇంతగా చెడిపోలేదు. కారుతో ఎడ్లబండి చెడిపోలేదు. కరెంటు దీపంతో ఆముదపు దీపం చెడిపోలేదు. సంస్కృతాన్ని విదేశీయమని ఎలా అనగలుగుతాం. అది మన జాతిని మలిన పరచలేదు సరిగదా శుభ్రం చేస్తూ వచ్చిందనే భావిస్తున్నాము. అప్పుడు వేమన్న యుగంలో సంస్కృతం, విదేశీ తత్వం అన్న ధ్యాసే లేదు. అయినా జాతి తనకు తెలియకుండానే బాధ పడుతూ ఉండేది.

పండితులు ఏవో పనసలు వల్లె వేస్తుంటే మాకు అర్థం కావడం లేదు అనే వాళ్లు ప్రజలు. ఏవో శాస్త్రోపన్యాసాలు ఇస్తుంటే మాకర్థం కావడం లేదు అనే వాళ్ళు. కావ్యాలు చదువుతుంటే మాకు అర్థం కావడం లేదు అనే వాళ్ళు. వాళ్ళు చెప్పేది తెలుగే అయినా మరి వీళ్ళకు ఎందుకు అర్థం కావడం లేదో వేమన ఆలోచించాడు. అప్పుడు ఎత్తుకున్నాడు.

**"ఎలుక తోలుదెచ్చి ఏడాది ఉతికినా**
**నలుపు నలుపేగాని తెలుపు రాదు**
**కొయ్య బొమ్మను తెచ్చి కొట్టినా పలుకునా**
**విశ్వదాభిరామ! వినురవేమ".**

అప్పుడు వాళ్ళు అనుకున్నారు...ఓహో! ఈతను మన భాషే చెబుతున్నాడు. మనం చెబుతున్నట్లే చెబుతున్నాడు. ఈ వేమన్న మనవాడు. మన తెలుగువాడు. లోగడ కావ్యాలు వ్రాసిన తెలుగు వాళ్ళకంటే ఇంకో తెలుగును చూపెట్టాడు వేమన. ఇది తెలుగులో ఇంకో తెలుగు.

ప్రపంచంలో ఎంత పెద్దవాడైనా ప్రజల ముందుకు రావలసి వస్తుంది. ప్రజలకందనంత ఎత్తైన నాలుగంతస్థుల హర్మ్యాల్లో ఉండే నటకుడు కావాలనుకుంటే అట్టడుగు లోయల్లో పడి మూల్గే ప్రజల మూల్గును అభినయింప వలసి వస్తుంది. ఎక్కడా కాలు దింపకుండా ఆకాశయానాల్లో విహరించే వ్యాపారి కాదలచుకుంటే ఎప్పుడూ చెమట తడియని బడుగు వొంటికి కావలసిన గుడ్డల మిల్లుల్ని స్థాపించవలసి ఉంటుంది. అనుపమ భోగ భాగ్యాలతో తులదూగే నాయకుడు కావాలనుకుంటే గడప గడపకూ మెట్టి జానెడు ఓటుకై సాగిలపడి లేవ వలసి వస్తుంది. మేలి చాందినీ జాలరుల తూగిసలాడే అందలాలు మోయించుకునే కవి కావాలనుకుంటే అడుగడుక్కూ అస్సురస్సురని ఉలికి పడే అభాగ్యుని కన్నీరు చిలుక వలసి ఉంటుంది. పతితుడైతేగాని పతిత పావనుడు కాలేడు. ఆర్తుడైతేగాని ఆర్తత్రాణ పరాయణుడుకాలేడు. ఆత్మ ఉన్నవాడు అయితేగాని అంతర్దర్శి కాలేడు.

"చూపులోన చూపు జూడంగ జూడంగ, దెలివిలోన దెలివి వెలుగు చుండు అసలు వేమనలో అంత అంతర్దృష్టి సత్యదృష్టి ఎలా వచ్చింది. ఒకడు సత్యద్రష్ట ఎలా అవుతాడు. పూర్వం ఋషులంతా సత్యద్రష్టలే. కవి ఐనవాడు ఋషి కావాలి. పూర్వకాలమేమిటి ప్రస్తుత కాలమేమిటి. సమాజంలో ఉన్న పీడనకూ, క్రౌర్యానికీ తల్లడిల్లినవాడు సత్యద్రష్ట అవుతాడు. రాజు పరంగానో అధికారుల పరంగానో మతమౌఢ్య పరుల పరంగానో కొన్ని అత్యాచారాలు సమాజంలో జరుగుతుంటవి. వాటికి కవులూ పండితులూ వీర పురుషులూ చలించుతారు. సామాన్య పౌరులు కూడా చలించుతారు గాని వాళ్ళు ఎదురు తిరగలేరు. ఒక వీర పురుషుడు వాళ్ళ బదులు ఎదురు తిరుగుతాడు. కట్టబొమ్మన్ రూపంలోనో సీతారామరాజు రూపంలోనో గాంధీ రూపంలోనో పాపం అమాయక ప్రజలు ఎదరూ తిరగలేరు. నోటితో బాధను చెప్పనూ లేరు. బాధను చెప్పేందుకు కవులు ముందుకు వస్తారు. ఈ బాధలు అంతర్జాతీయ మార్కెట్టులో మన రూపాయి విలువ పడిపోవడం లాంటి పెట్రోలు సరఫరా లేకపోవడం వల్ల మన కార్ఖానాలు మూలన పడతాయి అనడంలాంటి విశాలంగా సార్వభౌమికంగా ఉండాలని ఎక్కడా లేదు. నీవూ నేనూ పొందే ప్రతిబాధా ఒక అస్త్రం అవుతుంది. ఒక ఆయుధం అవుతుంది. హక్కు అవుతుంది. ఒకడు అన్న కబళం అందక అలమటిస్తున్నాడు. ఒకడు అప్పుదెచ్చుకుని అప్పు తీరక వడ్డీల వాళ్ళ చేతుల్లో నలిగి పోతున్నాడు. వయస్సు వచ్చిన పిల్లకు పెళ్లిగాక ఒక గృహస్వామి తల్లడిల్లుతున్నాడు. ఈ బాధలు వీళ్ళు అనుభవిస్తారుగాని పైకి చెప్పుకో లేరు. పరిష్కారాన్ని ఆలోచించలేరు. అప్పుడు పరిష్కర్తలు ముందుకు వస్తారు. కవుల రూపంలోనూ పోటరుల రూపంలోనూ. ఆ బాధల్నే ఒక స్లోగనుగా చేసి ఒక కరపత్రంగా చేసి ఒక బాంబుగాచేసి దేశమంతటా వ్యాపింప చేస్తారు. ఈ శక్తినే దూరదృష్టి అంటాము. దూరదృష్టి గలవారు పండితులు. తలనొప్పి ఒక్కనికే వస్తుంది. కాని అందరి తలనొప్పుల్నీ పోగొట్టే ఔషధం తయారు చేసినవాడు పండితుడు. సామాన్య మానవుడు బాధను అనుభవించగలడేగాని దానికి నివారణోపాయం కనిపెట్టలేడు. దీనికి అందరి బాధల్నూ తన బాధలుగా గ్రహించి ఒక సామూహిక మార్గం కనిపెట్టే విశేష వ్యక్తులు కావలసి వస్తారు. అసలు ఈ ప్రపంచంలోనే ఏదో తప్పు ఉందని గ్రహించగలగడమే ఒక గొప్ప జ్ఞానం. అంతా సవ్యంగానే జరిగి పోతుందనుకోవడం మూర్ఖత్వం.

మనుష్యుడు అల్పజ్ఞుడూ అసంపూర్ణుడూ అయినప్పుడు అతడు పాలించే రాజ్యం సంపూర్ణం అనుకోవడం ఎలా! అందువల్లే ప్రతి యుగంలోనూ ఏవో కొరతలు ఉంటూనే ఉంటాయి. సొంతం

చీకటిపోయి సొంతం వెలుగు వస్తుందని కొందరు ప్రచారం చేస్తుంటారు. సొంతం చీకటి ఎలా పోతుంది! పాత చీకటి పోతుంది కొత్త చీకటి వస్తుంది. పాత వెలుగు పోతుంది. కొత్త వెలుగు వస్తుంది. అసలు చీకటిని చీకటని గ్రహించడమే ఒక గొప్పతనం. వేమన ఇది చీకటి అనే దాకా ఆ చీకటేమిటో ఎవరికీ తెలియలేదు. చీకటిలో ఉంటూ వెలుతురులోనే ఉంటున్నాము అనుకున్నారు. మనముండే పట్టపగటిలో ఒక సూర్యుడు బదులు 10 మంది సూర్యులు వెలిగితే అప్పుడు ఇదీ చీకటి క్రిందే వస్తుంది. వేదాలు చీకటీ అజ్ఞానం అని వేమన ఎప్పుడైతే చెప్పాడో అప్పుడు మనం అనుకున్నాము, మనం ఇంత వరకు చీకట్లో ఉన్నామని. మనం ఆరోగ్యంగా కులాసాగా ఉన్నామనుకుని తిరుగుతున్నాము. కాని డాక్టరు మీకు బి.పీ ఉందని చెప్పాడు. అప్పటి నుంచీ మనకు కళ్లు తిరగడం మొదలు పెట్టినాయి. వేమన మానవజాతిలో జబ్బు ప్రశ్న ఎత్తాడు. వెలుగు ప్రశ్న ఎత్తాడు. అప్పటి నుండే ఈ జాతికి కళ్లు తెరిపిడి అయినాయి.

వేమన ఈ ప్రపంచంలోనే ఏదో తప్పు ఉందన్నాడు. తప్పును కనిపెట్టడమే అతను చేసిన పెద్దతప్పు. దానికి వేలాది పద్యాలు వ్రాయడం ఇంకా పెద్ద తప్పు. మూర్ఖులు ఈ ప్రపంచ ప్రజలంతా. పరమాత్మ ఒక్కడే నిత్యుడు. ఈ వేదశాస్త్రాలు బోగస్. ఆత్మజ్ఞానమొక్కటే నిత్యము. ప్రకృతి అంతా మాయ. అవ్వలి వెలుగే శాశ్వతం. అసలు ఈ ప్రపంచాన్నే అబద్ధం అనుకున్నప్పుడు ఈ ప్రపంచంలో ఉండే రాజుల్ని పండితుల్ని వాళ్లు రచించిన గ్రంథాలనూ వాళ్ళు ప్రవేశపెట్టిన నియమ నిబంధనల్నూ కత్తికొక కండగా కోయడంలో జంకు ఎందుకుంటుంది! అందుకే

*"మంత్ర జలముకంటె మంగలి జలమెచ్చు"* అన్నాడు.

*"బ్రాహ్మణులకు బెట్ట ఫలము కద్దందురు*

*కుక్కలకును బెట్ట కొదవయేమి"* అన్నాడు.

వీరావేశం మామూలు వీరావేశం కాదు. దైవావేశం, ధర్మావేశం, జ్ఞానావేశం...ఆ ఆవేశం ముందు ఈ పటాటోపాలు ఈ లౌకిక అనాచారాలు ఈ డాంబిక మూల్యాలూ దూది పింజెలులా ఎగిరిపోయినాయి. మన శారీరకాకారాలు చాలా చిన్నవి. వీనిలో ఏదైనా మంచి గుణముంటేనేగాని ఇవి గొప్పవి కావు. గుణ గరిమేగాని భౌతిక గరిమ గణనీయం కాదు. భౌతిక కాయాన్ని కాదు కీర్తి కాయాన్ని పెంచుకోవాలి. దాన గుణాన్ని ఉదాహరణగా తీసుకుని వేమన ఈ విషయాన్ని ఎంత గొప్పగా చెప్పాడో!

**ఒడ్డు పొడుగు గలిగి గడ్డముంబొడవైన**

**దాన గుణములేక దాతయగునె**

**యెనుము గొప్పదైన ఏనుగు బోలునా!**

ఎన్నో మతాలు తత్వ శాస్త్రాలూ వేరు వేరుగా ఉన్నా దైవము ఒక్కటే అంటున్నాడు వేమన. 'దర్శనములు వేఱు దొవమొఒక్కటే'.

చదివి ప్యాసయితేనే చదువరి కాదు. విద్యార్థిలోని ఎన్నో గుణాల్ను వదిలిపెట్టి ఈ పరీక్షల టేపులు తామిచ్చిన పుస్తకాలు చదివినందుకే మార్కులు వేస్తున్నాయి. విద్యార్థిలో సాహసం, చురుకుదనం, ఊహ పోహలు, వినయ విధేయత, సత్య సంధత, త్యాగం ఎన్నో గుణాలు ఉంటాయి. ఇవన్నీ 35తో ప్యాసయ్యే మార్కుల్లోకి వస్తున్నాయా! ధర్మా మీటరుకు రోగి ఉష్ణోగ్రతే కావాలి. తతిమ్మా గుణాలు అవసరం లేదు. అలాగే యీ చదువులు కూడా తమకు కావలసిన లెక్కల్లోనో ఇంగ్లీషులోనో కొలిచి తతిమ్మా విద్యార్థిని అవతల పారవేస్తున్నాయి. శిష్యులు గురువుల్నుండి ఏమి నేర్చుకోవాలో తెలియడం లేదు. ఏమి చెప్పాలో గురువులకు తెలియడం లేదు. విశ్వ విద్యాలయాలు ఒక సిలబస్సును ఇస్తుంటవి. అది చెప్పడం గురువుల బాధ్యత, నేర్చుకోవడం శిష్యుల బాధ్యత. వేమన్న కాలంలో గురువు శిష్యుడికి ఏమి బోధించాలో స్పష్టం గా తెలిసి ఉంది. గురువులకూ శిష్యులకూ మధ్య పాఠ్యక్రమం నిర్ణయించే వేరొక బోర్డులేదు. ఆత్మజ్ఞానం, ముక్తి రహస్యం తెలుసుకోవడమే చివరిమెట్టు. ఇప్పటి కాలంలో ఆ ఆత్మ జ్ఞానాన్ని మనం మానవత్వంగా జీవిత పరమార్థంగా గ్రహించవచ్చు. అది లేకుండా అన్నీ నేర్చుకోవాలని కనపడ్డ తుషనంతా పోగుచేసి పాఠ్య క్రమంగా పెట్టి చెప్తుంటే అటు ఉద్యోగానికీ పనికి రాకుండా ఇటు మానవత్వపు విలువలకూ కాకుండా పోతున్నాడు విద్యార్థి. అందువల్లే వేమన అంటాడు.

*గురుతు గనుచు చెప్పు గురు వెవ్వడును లేదు*

*గురుతెరుంగు శిష్యవరుడు లేదు*

*గురుడు శిష్యుడనుట గుడ్డెద్దు చేనురా.*

ఔను. ఇప్పటి విద్యావిధానం గుడ్డెద్దు చేలో పడ్డట్టే వుంది. విద్యార్థి ఎన్ని చదవవలసి వస్తుంది! సైన్సు, చరిత్ర, భూగోళం, భూగర్భ శాస్త్రం భూమిలో ఉండేవి. జలాల్లో ఉండేవి ఆకాశంలో ఉండేవి. ఎర్రలూ వాటి తేడాలు, కప్పలూ వాటి ఊపిరితిత్తులు, జలగలూ వాటి పుట్టుపూర్వోత్తరాలు. కాదేదీ చదువుకనర్హం అన్నట్టు అన్నిటినీ తెలుసుకోవడం విజ్ఞానమయింది. విద్యార్థులకు ఏమి చదివితే ఉద్యోగం వస్తుందో ఏమి చదివితే జీవితంలో స్థిరపడతారో తెలియడం లేదు. అందువల్లే గుడ్డెద్దు చేలో బడి అయినవీ కానివీ అన్నీ బరికి వేసినట్టు విద్యార్థి ఏది చేతికందితే అది చదివేస్తున్నాడు. తెలుగు యమ్మే అవుతాడు, సైన్సులో బియిడీ అవుతాడు, టైపూ షార్టుహ్యాండు ప్యాసవుతాడు. హిందీ పరీక్షలూ కట్టుకుంటాడు. అయినా ఏదీ అక్కరకు రాదు. అందరూ అందరే అన్నట్టు ఉంది – ఈ పరిస్థితిని వేమన్న మాటలలోనే చూడండి.

*కొండముచ్చు పెండ్లి, కోతి పేరంటాలు*

*మొండివాని హితుడు బండవాడు*

*దుంగగేదునకును గొండెదు దళవాయి.*

ఎవరికీ ఏమీ తెలియదు. అందరూ మూర్ఖులే, దుష్టులే. అతనికంటె ఘనుడు ఆచంట మల్లన్న. ఒక్క పై పద్యంతోనే మన పరిస్థితి అంతా బొమ్మకట్టినట్టు చూపించాడు వేమన.

వస్తువులోనూ అభివ్యక్తిలోనూ మన కవితా యుగం ఎంతో ముందుకు వచ్చింది. సాంప్రదాయిక కవిత్వం నుండి భావ కవిత్వం దశకు వచ్చాము. ప్రయోగ కవితా ఆ పై యుగం నడుస్తుంది ఇప్పుడు, అభివ్యక్తిలోగాని విషయ నవ్యతలోగాని మనకు ఏమైనా వేమన కవీంద్రుడు తీసిపోయాడేమో ఈ క్రింది కవితలో చూడండి.

*భూమినాది యనిన భూమి పక్కున నవ్వు / దానహీను జూచి ధనము నవ్వు*

*కదన భీతు జూచి కాలుడు నవ్వును* – ఇహదీన్ని గురించి మనము ఏమీ వ్యాఖ్యానించనవసరం లేదు.

(తరువాయి – వచ్చేసంచికలో ...–)

భాషోద్యమ కథానిక

# అనుబంధం

సింహ ప్రసాద్
9849061668



"సారీ నాన్నా. ఈ ప్రాంతంతో ఇక్కడి మనుషుల్తో, అయిన వాళ్ళతో అనుసంధించేది, అనుబంధం పెంచేది తెలుగు భాషేనని గ్రహించలేకపోయాం. ఇది ముమ్మాటికీ మా తప్పే. ఇక ఆ తప్పు సరిదిద్దుకుంటాం. బయట ఏ భాషలో మాట్లాడినా ఇంట్లో మాత్రం తెలుగులోనే మాట్లాడుకుంటాం. నీ మనవడు తెలుగు అర్థం చేసుకునేట్టు, మాట్లాడేట్టు తీర్చి దిద్దుతాం. దీసీజ్ మై ప్రామిస్ నాన్నా. అమ్మభాష మీద ప్రమాణం చేసి చెబుతున్నాను, నన్ను నమ్మండి".

'అమెరికా నుంచి నా మనవడు వస్తున్నాడోచ్" ఊరంతా చాటింపు వేస్తూ అన్నాడు రామసత్తెయ్య.

"మనవడొక్కడే వస్తున్నట్టు మాట్లాడ తావేంటి బాబాయ్. కొడుకూ కోడలూ కూడా వస్తున్నారుగా!" అని ఒకరంటే, "ముందొచ్చిన చెవులకన్నా వెనకొచ్చిన కొమ్ములు వాడికదా!" అని నవ్వారింకొకరు.

"నిజమేరా. ఎప్పుడో ఆరేళ్ళక్రితం వచ్చి పెళ్ళి చేసుకుని వెళ్ళాడు. మళ్ళీ ఇదిగో ఇదే రావడం. అబ్బాయి గురించీ కోడలు గురించీ బెంగ లేదులేరా. వారానికో సుట్టు ఫోనులో పలకరిస్తానే ఉన్నారు. మా దేర్లమంతా మనవడి గురించేరా. పుట్టి నాలుగేళ్ళ మూడు మాసాలైనా వాడి ముఖం మేం చూడనే లేదు!" దిగులుగా అన్నాడు.

"ఆ వంకన ఓసారి అమెరికా వెళ్ళి రాకపోయావా మావా" వేళాకోళమాడారు మరొకరు.

"ఆ ముక్క అబ్బాయి చాలాసార్లు అన్నాడు. అక్కడికెళ్ళి రావడానికి నాకెక్కడ తీరుద్ది చెప్పు? ఇల్లూ వాకిలీ పొలమూ పశువులూ పాలూనీళ్లూ అన్నీ వదలి ఎక్కడికెళ్ళగలన్రా!"

"భలేవాడివి రామ సత్తెయ్యా. నీకేమో ఊరితో లంకె. మీ వాడికేమో అమెరికాలో లంకె. ఇంక మీ ఇద్దరికీ ఎలా కుదుర్తుందంటావు చెప్పు?!" అన్నాడో పెద్దాయన.

గుంభనంగా నవ్వాడు రామసత్తెయ్య. "అదేం మాట. నా మనవడు లేడూ?! తాతా మనవల అనుబంధం చాలా గొప్పది. రేపు వాడొచ్చాక ఏమంటాడో తెలుసా? ఇక మాతోనే ఉంటాను. ఇక్కడే ఉంటాను – అనకపోతే ఒట్టు! మనవడొచ్చాక ఇంకేం పనులు పెట్టుకోకూడ దని అన్నీ ముందే చక్కబెట్టేసుకుంటున్నాను" గొప్పగా చెప్పాడు.

అదే సమయంలో అతడి భార్య అనసూయమ్మ ఎక్కడలేని హడావిడీ చేస్తోంది.

ఇల్లు దులిపించింది. సామాన్లు సర్దించింది. ముగ్గులు పెట్టించింది.

ఇరుగు పొరుగుని పిలిచి,

"సున్నుండలు, కజ్జికాయలు, జంతికలు వండాలి. సాయం రండమ్మా" అంటోంది.

"మా పెద్దత్తయ్యకి ఇప్పుడే పెద్ద పండుగ వచ్చేస్తున్నట్టుంది" హాస్యమాడింది కోడలు వరుసయ్యే పొరుగింటామె.

"రాకరాక వస్తున్నారాయె. ఆ మాత్రం ఆరాటం ఆదుర్దా ఉండవేంటి" సమర్థించింది ఇరుగింటామె.

"తొలిసారిగా మా మనవడు మా ఇంట్లో అడుగు పెడుతున్నాడే. వాడికి ఉగ్గుపాలు పోసే యోగం నాకు లేకపోయింది. ఇక్కడ పురుడు పోసుకుంటుంది పంపరా - అంటే అబ్బాయి వినలేదు. మా వియ్యపురాలే అమెరికా వెళ్ళి పురుడుపోసి వచ్చింది!" నిట్టూర్చింది అన సూయమ్మ.

"నువ్వూ వెళ్ళిరావాల్సింది పిన్నీ" మరొకరు అన్నారు.

"రమ్మనే అన్నాడు బిడ్డ. ఈ ఊరుని వదిలి ఈయన ఎక్కడికీ కదలరు. ఈయన్ని వదిలి నేను వెళ్ళలేనుగందా!"

"అదేం మాట అత్తా. విమానం ఎక్కవూ? అమెరికా చూడవూ?"

"ఎందుకులేమ్మా ఆ ఆపసోపాలు. కడుపులో నీళ్ళు కదలకుండా ఇక్కడే ఉండనియ్యి చాలు. అయినా ఇక్కడలేని వింతలు అక్కడేం ఉన్నాయా. అక్కడి మనుషులకీ రెండు కాళ్లూ రెండు చేతులేగా!" చేతులు తిప్పుతూ సాగదీసింది అనసూయమ్మ.

"మరి గిరిబాబుని అమెరికాలో ఎందుకు ఉద్యోగం చేయనిస్తున్నారూ?" నిగ్గదీసిందో గడుగ్గాయి.

"మేమెక్కడ చేయమంటున్నాం? ఫోను చేసిన ప్రతీసారీ ఇక్కడికొచ్చెయ్యంట్రా అని బతిమాల్తున్నాం. వింటేగా ! అందుబాటులో ఉంటే రాకలూ పోకలూ ఉంటాయి. అభిమానాలుంటాయి. అవసరపడితే పరుగెత్తుకు రాగలుగుతారు. ఎప్పుడేం జరుగుద్దో ఎవరు చూడొచ్చారూ!" కళ్ళొత్తుకుంది. తిరిగి తనే అంది. "అయినా ఈ సారి నేనూ మీ మావయ్యా గట్టిగా పట్టుపడదామనుకుంటున్నాంలే. వాళ్ళకి కుదురకపోతే మనవడినైనా మన దగ్గర ఉంచేసుకుందామంటున్నారు మీ బాబాయి"

"మనవడు బావుంటాడా అత్తా? ఎవరి పోలిక వచ్చిందేంటి?"

"ఇంకెవరి పోలికొస్తుంది? తాత పోలికే. తాత నోట్లోంచి ఊడిపడ్డట్టు ఉంటాడంట. పేరు కూడా మా మావయ్యదే పెట్టారు!" పొంగిపోతూ చెప్పింది అనసూయమ్మ.

రామ సత్తెయ్య దంపతులే కాదు, ఇరుగు పొరుగే కాదు. ఆ గ్రామస్తులంతా ఎదురు చూసిన రోజు రానే వచ్చింది.

గిరిబాబు, అతడి భార్య సరోజ, కొడుకు సత్యేష్‌తో ఇంటిముందు కారు దిగారు.

హారతిచ్చి ఆహ్వానించింది అనసూయమ్మ.

అంతా గుమిగూడటం చూసి భయపడి పోయాడు సత్యేష్. తండ్రి చేయి గట్టిగా పట్టుకున్నాడు.

"రేయ్ నే నెవరో తెలుసా? తాతనిరా...రా...రా..." సంబర పడుతూ వాడి చేయి పట్టుకుని లాగబోయాడు రామ సత్తెయ్య. వాడు రాలేదుగాని మరింత ముడుచుకు పోయాడు.

"గో గో... యువర్ గ్రాండ్ ఫా..." గిరిబాబు చెప్పాడు. 'ఓ' అన్నట్టుగా చూసి కొంచెంగా చేయి పైకెత్తి విష్ చేశాడు.

ఆ మాత్రానికి పొంగిపోయాడు. "బుద్ధిమంతుడివి. రారా...రా..." రెండు చేతులూ చాచాడు.

"కొత్తకదా. కొంచెం అలవాటయ్యాక వస్తాళ్ళే నాన్నా" అన్నాడు గిరిబాబు. "సత్యేష్‌కి తెలుగు రాదు మావయ్యగారూ" గొప్పగా చెప్పింది కోడలు.

హతాశుడయ్యాడు రామ సత్తెయ్య. "మీరు నేర్పలేదేంట్రా!"

"అక్కడంతా ఇంగ్లీషే కదా నాన్నా. ఎక్కడా తెలుగుమాట వినిపించదు".

"తెలుగు రానే రాదా? మరెలా మాట్లాడతాడు?" బుగ్గలు నొక్కుకుంది అనసూయమ్మ.

"ఇంగ్లీషులో...మా కన్నా చక్కగా అమెరికన్ యాక్సెంట్‌తో చకచకా మాట్లాడేస్తాడు. తెల్లవారి పిల్లల్తో భలేగా కలిసిపోతాడులే" కొడుకు తల నిమురుతూ గర్వంగా చెప్పింది సరోజ.

"వాడికి తెలుగు రాదు. వీళ్లకి ఇంగ్లీషు రాదు. సరిపోయిందైతే!" పెదవి విరుస్తూ వెటకారంగా అందొకామె.

ఆ మాటలకు దిగాలు పడ్డాడు రామ సత్తెయ్య. "ఒరే అబ్బాయ్, నిజంగానే వీడికి ఒక్క ముక్కా రాదా?"

"రాదు నాన్నా. ఇంట్లో కూడా మేం ఇంగ్లీషులోనే మాట్లాడుకుంటాం".

అయోమయంగా చూస్తూ అన్నాడు "అమెరికాలో మనింట్లో కూడా మన భాషలో మాట్లాడుకో కూడదని కట్టడి చేశారా ఏవిట్రా!"

"అహ అబ్బే అలాంటిదేం లేదు కాని మేం మన భాషలో మాట్లాడుకుంటే వీడికి అదే వస్తుంది. ఇంగ్లీషు పట్టుబడదు. అక్కడి వాళ్ళతో కలవాలంటే అక్కడి వాళ్ళలానే మాట్లాడాలిగా!"

మరేమనాలో తోచలేదు. బుర్ర గోక్కుంటూ మనవడి వంక బాధగా చూస్తుండి పోయాడు.

నాలుగు రకాల ఫలహారాలు ప్లేటుల్లో పెట్టి ముగ్గురికీ అందించింది అనసూయమ్మ.

గిరిబాబు పూతరేకు తింటోంటే అడ్డుపడ్డాడు సత్యేష్. "డాడ్, వై ఆర్యూ ఈటింగ్ పేపర్స్?"

"నోనో. దీజార్‌నాట్ పేపర్స్. ఎ టైపాఫ్ స్వీట్ లైక్ డో నట్..."

వాడు ఆశ్చర్యంగా అపనమ్మకంగా చూసాడు.

"చాలా బావుంటుందిరా. నువ్వు తిను. పోనీ ఈ కజ్జికాయ తింటావా. నోట్లో పెట్టుకోగానే కరిగిపోతుందిరా..." నోట్లో పెట్టబోయింది అనసూయమ్మ.

వాడు తోసేశాడు. "ఐ డోంట్ ఈట్ జంక్ ఫుడ్"

"నోనో. దీసీజ్ హెల్దీ ఫుడ్. యూ కెన్ ఈట్" సరోజ చెప్పింది. అయినా వాడు దేన్నీ ముట్టుకోలేదు.

"తిండి అయినా మన తింటే తింటున్నారా లేక అక్కడి వాళ్లలా నానా చెత్త తిండ్లూ తింటున్నారా?" కించిత్తు కోపంగానే అడిగాడు రామ సత్తెయ్య.

"భలే వాడివి నాన్నా. అన్నమే తింటున్నాం. ఇప్పుడు అమెరికన్లు కూడా ఆరోగ్యానికి మంచిదని కాయగూరల ముక్కల్తో వండిన అన్నాన్నీ, యోగర్ట్ అంటే పెరుగు అన్నాన్నీ కొంచెంగానే అయినా తింటున్నారు" అన్నాడు గిరిబాబు.

"వీడు ఇంట్లో అన్నమే తింటాడుగాని స్కూలుకి పట్టుకెళ్ళడు. శాండ్‌విచ్‌లో బర్గర్లో పిజ్జాల్లో తీసుకెళ్తాడు" అంది సరోజ.

"బాగానే ఉంది సంబడం!" నిరాశగా అంది అనసూయమ్మ.

మర్నాటికీ పరిస్థితి మారలేదు. సత్యేష్

దూరం దూరంగానే ఉంటున్నాడు. ఎవరు పిలిచినా పలకట్లేదు. దగ్గరికెళ్లట్లేదు. తల్లి దండ్రుల్ని అంటిపెట్టుకునే ఉంటున్నాడు.

"మీ పెంపకం ఏం బావోలేదమ్మాయ్. భాష మాట దేవుడెరుగు కనీసం దగ్గరకి కూడా రాడేం?" అనసూయమ్మ నిష్ఠూరంగా అంది.

"ఇక్కడిలా అక్కడ ఎవరూ ఇలా ఎత్తుకోవడం, హత్తుకోవడం ఉండదు. ఇలా జనమూ గుమిగూడరు అత్తయ్యా. పిల్లలైనా సరే ప్రతివారికీ పర్సనల్ స్పేస్ ఉంటుంది. దాన్ని దాటి లోపలికి రావడం వారికిష్టం ఉండదు. వారికి ఇష్టం లేకపోతే ఎవరూ బలవంతం చేయడానికి లేదు".

"అదేం విడ్డూరమే తల్లీ. అక్కడి వాళ్ళంతా నన్ను ముట్టుకోకు నామాల కాకి అన్నట్టు ఉంటారన్నమాట!" నిలువునా ఆశ్చర్యబోతూ అందామె.

"వాళ్ళు ఉంటే ఉండనీవే. మనవాడినైనా మనలా ఉండనివ్వాలిగా. మనవడంటే మన వాడనే కదా అర్థం. అదేగాక వీడికీ తాత, నానమ్మ అన్న ఆపేక్షలుండాలిగా. దగ్గరకి రాకుండా, నోరు విప్పకుండా ఉంటే ఎలా వస్తాయి చెప్పు?"

తండ్రి సూటిగా ప్రశ్నించే సరికి మాట్లాడలేక పోయాడు కొడుకు. కోడలు కలుగజేసుకుంది" అమెరికాలో ఉంటున్నప్పుడు అమెరికా వాడిలానే ఉండాలి మావయ్యగారూ".

"అయితే ఇంకా అక్కడే ఊరేగటం ఎందుకూ, ఇక్కడికొచ్చెయ్యండి. అంతగాక పోయినా ఇక్కడా బాగానే సంపాదించుకోవచ్చు. ఎవరికీ ఏమీ కాకుండా ఎందుకురా ఒంటరిగా అక్కడ బతకటం. వచ్చెయ్యండి" కోపంతో విసురుగా అనేసి బయటికెళ్ళిపోయాడు రామ సత్తెయ్య.

"వీళ్ళకి అర్థంకాదు. వీళ్ళంతా వట్టి మూర్ఖులు. అందుకనే ఇండియా రావడం నాకిష్టం ఉండదు" ముఖం చిట్లిస్తూ ఇంగ్లీషులో అంది సరోజ.

"ఫోన్ చేసిన ప్రతిసారీ "మనవడిని చూపించరా" అని ఒకటే గొడవ చేస్తున్నారని వచ్చాం. ఎలాగూ తిరుపతి మొక్కు ఉంది కదా, రెండూ కలిసి వస్తాయని చూశాం" నొచ్చుకుంటూ అన్నాడు గిరిబాబు.

మరి మూడ్రోజులు గడిచాయి. తాతా మనవళ్ళు దగ్గరవ్వలేదు.

ఏదేదో చెప్పాలి, ఎన్నెన్నో చూపించాలని తాత తాపత్రయం.

ఇదేదో పనికిరాని వ్యవహారం అని మనవడి అభిప్రాయం.

ఒక రోజున బలవంతాన భుజాల మీదెక్కించుకుని పొలం తీసుకెళ్ళాడు రామ సత్తెయ్య. మొదట గింజుకున్నా తర్వాత చెట్లూ పుట్టలూ కాలువా ఆసక్తిగా చూశాడు.

కాలం గురించి, పంట గురించి, కాయకష్టం గురించి ఎన్నెన్నో చెప్పుకొచ్చాడు. కొడుకుని చదివించడానికి పడ్డ కష్టాలూ ఏకరువు పెట్టాడు. మనవడు విసుగ్గా చూసినా పట్టించుకోకుండా తన మానాన తను చెప్పుకు పోయాడు. మామిడికాయలు, నేరేడు పండ్లూ కోసి తినమని ఇచ్చాడు.

"వాష్ దెమ్".

ఆ మాట అర్థం కాలేదు. "తిను తిను..." అని బలవంతంగా తినిపించాలని చూశాడు. వాటిని విసిరేశాడు సత్యేష్.

వాడు ఏదేదో అంటోంటే నిస్సహాయంగా చూశాడు. "నీ గోల నీది నా గోల నాది అయి పోయిందేవిట్రా ఖర్మ!" తల కొట్టుకున్నాడు.

అర్థంగాక ముఖం చిట్లించి చూశాడు మనవడు.

"లెట్స్‌గో" సైగ చేశాడు.

ఇంటికి తిరిగి రాగానే మనవడికి చిన్న గిన్నెలో జున్ను పెట్టిచ్చింది అనసూయమ్మ. చెంచా కూడా ఇచ్చింది.

వాడు చక్కగా తిన్నాడు. కొండెక్కినంత సంబరపడింది.

"మనవడికి జున్ను అంటే ఇష్టమండీ. ఊళ్ళో ఎవరి గేదెలైనా ఈనాయేమో కనుక్కోండి".

భర్తని ఊరిమీదకు తరిమింది.

నానా తిప్పలూ పడి పొరుగూర్నించి జున్నుపాలు తెప్పించాడు రామ సత్తెయ్య.

మెల్లగా సత్యేష్, తాత నానమ్మల దగ్గరకు వెళ్తున్నాడు. సైగల్తో అడుగుతున్నాడు. వీళ్ళూ సైగలతో చెప్పడానికి ప్రయత్నిస్తున్నారు.

గుడ్డిలో మెల్ల అని సంబరపడుతోంటే తిరుపతి వెళ్ళారు. అక్కణ్నుంచి చెన్నై, కన్యాకుమారి తిరిగి సరోజ పుట్టింటికెళ్లారు. అక్కడో వారం రోజులుండి వచ్చారు.

తిరుగు ప్రయాణం వారం రోజుల్లో కొచ్చేసింది. అమెరికాలో దొరకనివి కొనే పనిలో పడ్డారు గిరిబాబు, సరోజ. మరో పక్క బ్యాగేజ్ సర్దుకుంటూ బిజీబిజీగా ఉన్నారు.

రామసత్తెయ్యకి తిక్క తిక్కగా ఉంది. ఏడుపు వస్తోంది. మనవడు ఒక్కనాడూ "తాతా" అని నోరారా పిలవలేదు. "మీరైనా నేర్పరేంట్రా" అని కొడుకూ కోడళ్ల మీద కయ్‌మని పడ్డాడు.

"గ్రాండ్ ఫా అంటున్నాడుగా నాన్నా"

"అలా పిలిస్తే ఒళ్లంతా కంపరంగా ఉంటోందిరా అబ్బాయ్. తాత అని ముద్దుగా పిలవమని చెప్పరా. అసలు పిల్లలకి మొదటగా వచ్చే మాటలు తాత, అత్తే కదురా! ఆ ఒక్క ముక్క అయినా రాకపోతే ఇంకెలా చచ్చేదిరా!" అసహనంతో విసుక్కున్నాడు.

"నీది మరీ చాదస్తం నాన్నా. ఇంకో నాలుగు రోజుల్లో వెళ్ళిపోయే వాళ్లం. ఈ లోగా వాడలా పిలిస్తే బంగారం ఏం ఒరుగుద్ది చెప్పు?"

"నా మనవడన్న తృప్తి దీనికి...దీనికి వస్తుందిరా" గుండె మీద చరుచుకుంటూ చెప్పాడు.

తండ్రి ఆవేదన అర్థమైంది. మొగుడూ పెళ్లాలు ఇద్దరూ కలిసి 'తాత' అనమని పోరగా పోరగా 'తాత్త' అన్నాడు అతి కష్టం మీద.

మురిసిపోయారు వృద్ధ దంపతులు.

"వాడిని ఇక్కడే వదలి వెళ్లకూడదుట్రా అబ్బాయ్" ఆశగా అడిగాడు రామ సత్తెయ్య.

"మీకన్నా బాగా చూసుకుంటాంరా. పట్నం స్కూలు బస్సు మనూరు వస్తోంది" అంది తల్లి.

"వీణ్ణి విడిచి మేం ఉండలేం నాన్నా" కొడుకు జవాబిచ్చాడు.

"నిన్ను విడిచి మేం లేమూ?"

"దానికీ దీనికీ సాపత్యమేంటి. వీడు అమెరికన్ సిటిజన్. అక్కడే సెటిలవ్వాల్సిన వాడు..." సరోజ అంది కొడుకుని సందిట్లోకి తీసుకుంటూ.

"అంటే ఏవిటర్థంరా? ఎప్పటికీ వీడు అక్కడే ఉండి పోతాడా?" కళ్ళల్లో కన్నీటి పొర

**పాఠశాల విద్యలో మాతృభాషే మాధ్యమంగా ఉండాలి**

కదుల్తోంటే వేదనతో రగిలిపోతూ అడిగాడు.

"ఏమో మరి. ఏమైనా జరగొచ్చు!"

వెర్రిగా చూశాడు రామ సత్తెయ్య. కళ్ల నుంచి జారబోయిన కన్నీటిబొట్లు కన్పించ కుండా లేచి వెళ్లిపోయాడు.

కొడుకూ కోడలూ ప్రయాణానికి సన్నద్ధ మవుతోంటే వారిని కూర్చోబెట్టి అన్నాడు రామ సత్తెయ్య.

"మీకు ఈ మట్టి అక్కర్లేదు. ఈ గాలి అక్కర్లేదు. ఈ నీరు అక్కర్లేదు. అయినా ఎలావోలా సహిస్తాం, సరిపెట్టుకుంటాం. కాని నా భాష నా భావం నా బాధ కొంచెం అర్థం చేసుకోండి. మీకు చేతులెత్తి మొక్కుతున్నా. తెలుగు భాషని దూరం చేసుకోకండి. వీడి చేతా చేయనీయకండి. అది మాకూ మనవడికీ మధ్య వంతెనరా. అది మామూలు వంతెన కాదు. అభిమానాల వంతెన. ఆప్యాయత, అనురాగాల వంతెన. దాన్ని కూలగొట్టకండి. తాతా మనవల మధ్య అగాధం తవ్వకండి. నాకు మాటివ్వండి. మనవడు కనీసం నాతో తెలుగులో మాట్లాడేలా చేస్తానని. వాడి బాగోగులు మేమూ, మా యోగ క్షేమాలు వాడూ తెలుసుకునేంతైనా నేర్పుతామని చెప్పండి. మీరు ఎప్పటికీ అక్కడే ఉన్నా ఫరవాలేదు, కనీసం మా మధ్య అనుబంధం ఏర్పరుస్తానని హామీ ఇవ్వండి!"

తండ్రి మాటల్లోని వేదనకి, ఆర్తికి, కళ్ల నుంచి ధారలు కట్టిన కన్నీళ్ళకి గిరిబాబు కళ్ళు కన్నీటి వరదయ్యాయి.

"సారీ నాన్నా. ఈ ప్రాంతంతో ఇక్కడి మనుషుల్తో, అయిన వాళ్ళతో అనుసంధించేది, అనుబంధం పెంచేది తెలుగు భాషేనని గ్రహించ లేకపోయాం. ఇది ముమ్మాటికీ మా తప్పే. ఇక ఆ తప్పు సరిదిద్దుకుంటాం. బయట ఏ భాషలో మాట్లాడినా ఇంట్లో మాత్రం తెలుగులోనే మాట్లాడుకుంటాం. నీ మనవడు తెలుగు అర్థం చేసుకునేట్టు, మాట్లాడేట్టు తీర్చి దిద్దుతాం. దీసీజ్ మై ప్రామిస్ నాన్నా. అమ్మభాష మీద ప్రమాణం చేసి చెబుతున్నాను, నన్ను నమ్మండి". తండ్రి చేతిలో కొడుకు చేయి వేసి కొత్త ఆశ చిగురింపజేశాడు.

వారి మాటలు అర్థంగాకపోయినా కలిసిన ఆ చేతుల వంక అపురూపంగా ఆరాధనగా చూశాడు మనవడు. తథాస్తు అంటూ గుడిలో గంటలు మ్రోగాయి...

(...27 వ పుట తరువాయి...... శపథం)

కాస్త ఇంటికి చేరువయ్యే సరికి ఏడ్పులు.. పెడబొబ్బలు.. వినరావడంతో ముచ్చెమటలు పోసాయి. నాన్న నుండి క్షమాపణలు పొందే భాగ్యానికి నోచుకోలేదా.. అనే ఆలోచన మదిలో రాగానే.. కళ్ళు బైర్లు కమ్ముకోసాగాయి. స్పృహ తప్పుతుందనిపిస్తోంది.

వాకిట్లో నిప్పురాజేసి ఉంది. అరుణ ఒళ్ళు ఝల్లుమంది. కారు ఆగీ ఆగడంతోనే జనాన్ని తోసుకుంటూ.. గుండెలు బాదుకుంటూ.. ఇంట్లోకి పరుగెత్తింది.

అక్కడి దృశ్యం చూసి కుప్పలా కూలిపోయింది.

అరుంధతమ్మ పార్థివ శరీరం. తలాపుకు దీపం.. అగరువత్తులు.

"అమ్మా.." అంటూ దిక్కులు పెక్కుటిల్లేలా రోదిస్తూ.. పాదాలపై పడిపోయింది అరుణ.

కరుణ లేచి వచ్చి అరుణ భుజంపై వాలి చంటిపిల్లలా ఏడ్వసాగింది. పరంధామయ్య ఇద్దరు పిల్లలను తన హృదయానికి హత్తుకుని ఓదార్చ సాగాడు.

అరుణ పరంధామయ్య కాళ్ళపై తల ఆన్చి "నాన్నా.. నాన్నా.. నాన్నా.." అని వల వలా.. ఏడుస్తూ.. కన్నీళ్ళతో పాదాలు కడుగసాగింది.

అరుణ శపథం పరంధామయ్య కంటే అరుంధతమ్మనే ఎక్కువగా బాధించింది. అరుణ వస్తుందని తెలిసి ఆ రాత్రి మరింత ఆందోళనకు గురయ్యింది.

"నేను పరలోకానికి పోతే.. అరుణ మీతో మాట్లాడక తప్పదండీ.." అని తేప, తేపకు వగచుకుంటూ..

మానసిక వ్యథతో తన సహచరి గుండె ఆగిన విషయం తన గుండెలోనే దాచుకున్నాడు పరంధామయ్య.

## మీరు 'అమ్మనుడి' చందాదారులేనా?

'అమ్మనుడి' పత్రికకు చందాదారులు పంపే చందా సొమ్మే ఆధారం. కనుక–

1. తాము చందాదారులైతే మీకు పంపే పత్రికపై చందా ఏ నెల వరకు ఉన్నదీ పేర్కొని వుంటుంది. దయచేసి దానిని గమనించి, సకాలంలో మీ చందా సొమ్మును పంపించి పత్రికను ఎల్లప్పుడూ అందుకోండి.

2. తాము చందాదారులు కాకపోయినా, తమకు గౌరవప్రతిగా (కాంప్లిమెంటరీగా) ఉచితంగా అందుతూ వుండవచ్చు. అటువంటి మిత్రులకు పత్రిక నచ్చితే, దయచేసి చందాను పంపించి తోడ్పడగలరు. పత్రిక నచ్చకపోయినా, మీకు ఆసక్తి లేకపోయినా 'పత్రికను పంపవద్దు' అని దయచేసి ఒక కార్డుపైగాని, ఎస్.ఎం.ఎస్/మెయిల్ గాని పంపించి సహకరించగోరుతున్నాము.

3. పత్రికకు చందాను చెల్లించేవారు తమ ఇష్టాన్ని బట్టి శాశ్వత చందా (రు.5000/లు) గాని, 5 సం॥ల చందా (రు.1000/లు) గాని, 3 సం॥ల చందా (రు.700/లు) గాని పంపి పత్రికకు ఆర్థికంగా తోడ్పడగలరు. వీలుగాకపోతే సం॥చందా రు.240/లు పంపించి ఏటా పునరుద్ధరించుకొనవచ్చు.

**శిశువు శారీరక వికాసానికి తల్లిపాలు**
**మానసిక వికాసానికి తల్లి భాష**
**గుండెలోతుల్లోంచి వచ్చేదీ, మనసు**
**విప్పి చెప్పగలిగేది అమ్మనుడిలోనే.**



# బౌద్ధం - వైజ్ఞానిక మార్గం

బొర్రా గోవర్ధన్
93906 00157

## 16.బౌద్ధుల సృష్టివాదం

**రెండు సృష్టివాదాలు:**

మానవ వైజ్ఞానిక ఆవిష్కరణల్లో "సృష్టివాదాలు"ప్రధానమైనవి. మిగిలిన భౌతిక అంశాలన్నీ అనుభవాన్ని బట్టి అందేవే. కానీ, అసలు ఈ సృష్టి ఎలా జరిగింది? ఎప్పుడు జరిగింది? ఎందుకు జరిగింది? కనిపించే జీవ, అజీవ ప్రపంచం అంతా ఎలా రూపొందింది? ఎవరు రూపొందిం చారు?

ఇదిగో, ఈ ప్రశ్నలే దైవభావానికి దారితీశాయి. ఈ 'దేవుడు', 'దైవం' అనేది కేవలం మానవుల 'భావనలే' కాబట్టి ఒక్కో ప్రాంతంలో ఒక్కోరకం 'దేవుడు' పుట్టుకొచ్చాడు. ఒక్కో మతం ఒక్కోరకం దైవాన్ని సృష్టికి మూలంగా ప్రకటించింది. అందుకే ... ప్రపంచంలో "ఇదిగో... ఇతనొక్కడే దేవుడు" అనే ఏకత్వభావన లేదు. రాదు. ఎందుకంటే ... అది భావనే కాబట్టి.

మొత్తం సృష్టి భావనల్లో ప్రధానమైనవి రెండు.

ఒకటి : వ్యక్తే సృష్టించాడు అనే 'సృష్టికర్త వాదం'.

రెండు : పదార్థాలూ, పరిస్థితులు సృష్టించాయనే 'భౌతిక వాదం' లేదా పరిణామవాదం.

ప్రపంచంలో అన్నిచోట్ల మొదట పుట్టింది సృష్టికర్త వాదమే.

మనిషి నాగరికతను నేర్చి, వస్తువుల్ని ఉత్పత్తి చేసుకునే పరిజ్ఞానం వచ్చాకే 'సృష్టికర్త ' పుట్టుకొచ్చాడు. బలపడ్డాడు. అప్పుడూ పదార్థవాదం ఉంది. అయినా సృష్టికర్త వాదం దాన్ని ప్రక్కకు నెట్టేసింది.

మట్టి ఉంది. అది పదార్థం. ఆ మట్టి...కుండ, పిడత, చట్టి, మూకుడు, ముంత ...ఇలా అనేకవస్తువులుగా రూపొందింది. మట్టి తనకు తానుగా వస్తువులుగా మారదు. 'కుమ్మరి' ఆ పని చేయాలి. ఇక్కడ పదార్థాన్ని వస్తువులుగా సృష్టించింది 'కుమ్మరి'.

అలాగే...చెక్క అనేక వస్తువులుగా మారుతుంది. దాన్ని అలా మార్చింది వడ్రంగి. వెదురు బద్దలతో తడికెలు, బుట్టలు, చాటలు చేసేది మేదరి. చేసేవాడు ఒకడు లేకుండా ఏ పదార్థం వస్తువుగా మారదు.

అలాగే ...సృష్టించేవాడు లేకుండా ఈ విశ్వంలో సృష్టి జరగదు. కాబట్టి విశ్వసృష్టే 'దేవుని వృత్తి'గా విశ్వసించారు సృష్టికర్త ను నమ్మిన వారు.దాదాపు మతాలన్నీ ఈ అభిప్రాయంతోనే ఉంటాయి.

**మతాల్లో సృష్టివాదం:**

"ఆదియందు దేవుడు భూమ్యాకాశములను సృష్టించెను" అని బైబిలు చెప్పినా-

"ఈ భూమిని రెండు రోజుల్లో, భూమ్మీది సమస్త భౌగోళిక ప్రకృతిని నాలుగు రోజుల్లో, అంతరిక్షాన్ని రెండు రోజుల్లో...ఇలా మొత్తం 8 రోజుల్లో అల్లా ఈ విశ్వసృష్టి చేశాడు" అని ఖురాన్ చెప్పినా -

"విశ్వకర్మే కలపతో తొలుత ఈ సృష్టిని రూపొందించాడు అని వేదం చెప్పినా - అన్ని మతాల సారం ఒక్కటే . సృష్టికర్త లు ఉపయోగించిన పదార్థాల్లో, వాటి పాళ్ళలో, పని చేసిన రోజుల్లో తేడాలేగానీ ... సృష్టిని చేసింది మాత్రం దేవుడే! ఈ దేవుళ్ళు కూడా వేరు వేరు. ఎవరి దేవుడు వారికే సృష్టికర్త. అంతే!

అయితే - ఈ 'దైవ' భావాన్నుండి పదార్థవాదానికి మళ్ళడం, దాన్ని ప్రత్యామ్నాయంగా నిలబెట్టడం, శాస్త్రీయ కోణంలోంచి విశ్లేషించింది మాత్రం బౌద్ధమే! బుద్ధుడు కూడా 'సృష్టి' కార్యాన్ని తనదైన శాస్త్రీయ దృష్టితోనే విశ్లేషించాడు.బుద్ధునికంటే ముందే సృష్టికర్తను, స్వర్గనరకాల్ని వ్యతిరేకించిన చార్వాకులు,నాస్తికులు, ఇంకా ఇతర ప్రకృతివాదులు ఉన్నారు.కానీ, తమదైన ఒక సృష్టివాదాన్ని వారెవరూ ప్రకటించలేదు.ఆ దాఖలాలేవీ మనకు దొరకలేదు.

**వేదాల్లో వేరువేరు సృష్టికర్తలు:**

మనం పైన చెప్పుకున్న బైబిలు, ఖురాన్‌లు బుద్ధుని తర్వాత

కాలానివి. బుద్ధునికంటే ముందు ఉన్నవి వేదాలే. బుద్ధుని కాలానికి మూడు వేదాలున్నాయి. వాటిల్లో ఋగ్వేదం కంటే యజుర్వేదంలో ఈ సృష్టి కార్యాల వివరణలు విశేషంగా ఉన్నాయి. సృష్టి నిర్మాణానికి సంబంధించిన ఆలోచనలు వేదకాలంలో బలంగానే సాగాయి. అయితే... వేదంలో కూడా ఈ 'సృష్టికర్త' విషయంలో ఏకాభిప్రాయం లేదు.

శుక్ల యజుర్వేదం 17వ అధ్యాయంలో విశ్వకర్మే సృష్టికర్త అని ఉంటే, 13వ అధ్యాయంలో హిరణ్య గర్భుడు (సూర్యుడు) సృష్టికర్త అని ఉంది. మొదటిగా పుట్టి, దేహం ధరించిన వాడు కూడా సూర్యుడే అంది ఆ అధ్యాయం.

ఇక 31వ అధ్యాయం పురుషసూక్తంలో విరాట్ పురుషుడే సృష్టికర్త అని, సూర్యుడు ఈ విరాట్‌పురుషుని నేత్రాలనీ ఉంది. ఈ విరాట్ పురుషుని ముఖం నుండి బ్రాహ్మలు, బాహువుల నుండి క్షత్రియులు, తొడల నుండి వైశ్యులు, పాదాల నుండి శూద్రులు పుట్టారని తీర్మానించింది ఈ సూక్తం.

అయితే, కృష్ణ యజుర్వేదంలో "ప్రజాపతి" ఈ సృష్టికర్త అని ఉంది. ఈ ప్రజాపతి మనుషుల్ని సృష్టించాలనుకుని ప్రయత్నిస్తాడు. తొలి ప్రయత్నం విఫలం అవుతుంది. మనుషులకు బదులు సర్పాలు పుట్టాయి. మరలా ప్రయత్నిస్తాడు. ఈసారి మనుషులకు బదులు పక్షుల సృష్టి జరుగుతుంది. మూడో ప్రయత్నంలో మనుషుల్ని సృష్టిస్తాడు. ఆక్కడ "సృష్టికర్త" అనేవాడు ఒకడు ఉన్నప్పటికీ అతని ప్రయత్నం, జీవుల సృష్టి క్రమం చూస్తే కొంత శాస్త్రీయత కనిపిస్తుంది. వేదంలో ఉన్న ఇలాంటి చిన్న చిన్న శాస్త్రీయ భావనలన్నీ, 'పురుషసూక్తం' దెబ్బతో కొట్టుకుపోయాయి. విరాట్ పురుషుడే సృష్టికర్తగా పాతుకుపోయాడు.

**బుద్ధుడు చెప్పిన సృష్టివాదం:**

బుద్ధుడు చెప్పిన సృష్టివాదం దీర్ఘనికాయంలో అగ్గణ్ణిసుత్తంలో విపులంగా ఉంది. దీని గురించి చెప్పుకునే ముందు మనం ఒక విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలి! బుద్ధుడు కార్యకారణవాది. 'ఈ ప్రపంచంలో, లేదా సమస్త విశ్వంలో "మార్పు" మాత్రమే ఉంది. మారనిది(అంటే పరిణామం చెందనిది) ఏదీ ఉండదు. మార్పే శాస్త్రీయం' అనేది బౌద్ధ దృక్పథం.

బౌద్ధంలో 'కర్త'కు (దేవునికి) ఎలాంటి స్థానం లేదు. భౌతిక విజ్ఞానంలో కూడా 'కర్త'కు స్థానం లేదు. ఏవ్యక్తీ తనకుతానుగా మరెవ్వరి నుండీ జ్ఞానాన్ని పొందకుండా ఏ ఆవిష్కరణా చేయలేదు కదా! కాబట్టి జ్ఞానం అనేది వ్యక్తి సొంతం కాదు. సమూహానిదే. కాబట్టి "ఏకం" అంటే 'ఒకే ఒక్కటి, ఒకే ఒక్కడు' అనేది (అద్వైతం) బౌద్ధం అంగీకరించదు. వ్యక్తికి సంక్రమించిన జ్ఞానం అయినా, ప్రపంచం అయినా బహుళమే! అంతా ఉమ్మడి సొత్తే!

అందుకే బౌద్ధంలో 'కర్త'కు స్థానంలేదు. ప్రాధాన్యత లేదు. బౌద్ధ సంఘాన్ని నియమాలే నడిపిస్తాయి గానీ, ఆ సంఘాన్ని నడిపించే నాయకుడు ఎవరూ ఉండరు. ఎప్పుడూ ఉండరు.

రైట్ సోదరులు విమానాన్ని కనుగొనడానికి ముందు, మార్కొనీ రేడియో కనిపెట్టడానికి ముందు, చార్లెస్ బాబేజ్ కంప్యూటర్‌ని ఆవిష్కరించడానికి ముందు ఆయా విషయాల్లో ఎందరెందరి కృషో ఉంది.

కుర్చీ చేసేవానికి ఎంత నైపుణ్యం ఉన్నా అతను రెండు కాళ్ళ కుర్చీని, ఒంటికాలి కుర్చీని నిర్మించలేడు. చక్రాలు లేకుండా వాహనాల్ని నడపలేం. కుండకు క్రింది భాగాన మూతిని ఉంచి కుండను నిర్మించలేం.నిర్మించినా నీరు నింపలేం.నిరుపయోగమే అవుతుంది.

ఒక కర్త తాను చేసే ఏ వస్తువుకైనా కొన్ని భౌతిక నియమాలు ఉంటాయి. వాటికి లోబడే వాటిని నిర్మించాలి తప్ప, వాటికి భిన్నంగా నిర్మిస్తే ఆ వస్తువు నిరుపయోగం అవుతుంది. ఉనికి కోల్పోతుంది. అంటే 'కర్త' కంటే భౌతిక నియమాలే మూలం అన్నమాట. ఈ భౌతిక నియమాల్ని అర్థంచేసుకుంటూ ఎన్నెన్నో వేల వేల సంవత్సరాలుగా సాగిన అనుభవాల సారమే నాగరికత.

కాబట్టి స్థితి, పరిస్థితి, భౌతిక నియమాలు, కాలం .. ఇవ్వన్నీ ఈ సృష్టిరచనకు అసలైన కారణాలు. కారణాలే కార్యానికి కారణంగాని, కర్తకాదు. కర్త కేవలం ఒక ఉపకరణం మాత్రమే. నిమిత్త మాత్రుడే!

బుద్ధుడి సృష్టివాదం మొత్తం ఈ మార్గంలోనే సాగింది.

**నిదానకథలో సృష్టిక్రమం:**

బౌద్ధుల 'నిదానకథ'లో ఉన్నదాని ప్రకారం– ఈ సృష్టి ఒకే ఒక్కసారి జరిగిన సంఘటన కాదు. కొన్ని కల్పాల అనంతరం ఈ సృష్టి అంతరిస్తుంది. ఆ తర్వాత భయంకరమైన చీకటి ఆవరిస్తుంది. ఈ చీకటి యుగాలు ముగిసి మరలా అదే సృష్టి మరో రూపంలో వ్యక్తం అవుతుంది. లోకాలు (గ్రహాలు, నక్షత్రాలు) ఉద్భవిస్తాయి. వెలుగు ప్రకాశిస్తుంది. జీవజాతులు పుట్టుకొస్తాయి. మానవులు పుడతారు. దుఃఖంలో పడి కొట్టుకుంటారు. క్రమేపీ దు:ఖ రహితులవుతారు. అలా కొన్నాళ్ళు సాగాక ఆ సృష్టి మరలా విక్షోభాలకు లోన వుతుంది. అంతరిస్తుంది. మరలా చీకటి రోజులు...మరలా పునఃసృష్టి ...ఇలా ఇప్పటికి ఇరవై ఏడు సార్లు జరిగింది–అని నిదాన కథలో ఉంది.

ఈ సృష్టి పరిణామ క్రమంలో ఒక్కొక్క సృష్టి సందర్భంలో ఒక్కొక్క బుద్ధుడు పుడతాడు. లోకాన్ని దు:ఖ రహితం చేస్తాడు.అలా ఏయేకాలంలో ఏయే బుద్ధుడు పుట్టాడో చెప్పేకథే నిదానకథ.

**అగ్గణ్ణి సుత్తంలో సృష్టి క్రమం సాగిన విధానం:**

దీర్ఘనికాయంలోని అగ్గణ్ణిసుత్తంలో ఒక సృష్టికార్యం ఎలా జరుగుతుంది? ఎలా మార్పు చెందుతుంది? అనే విషయం ఉంది. బుద్ధుడు శ్రావస్తిలో పూర్వారామంలో ఉన్నప్పుడు వశిష్టుడు(వాసెట్ఠ), భరద్వాజుడు అనే ఇద్దరు బ్రాహ్మణులు కలిసినప్పుడు వారితో జరిగిన సంభాషణల్లో ఈ విషయం వస్తుంది.

వశిష్టుడు (వాసెట్ఠ), భరధ్వాజుడు అనేవారు ఇద్దరూ బౌద్ధ సంఘంలో చేరి భిక్షువులుగా మారారు. అలా మారినందుకు తోటి బ్రాహ్మణులు నిందిస్తారు. తిట్టిపోస్తారు. ఆ విషయం వారు బుద్ధునితో చెప్పినప్పుడు –

"వాసెట్ఠా! ఏమని నిందించారు?" అని అడిగాడు బుద్ధుడు.

"భగవాన్! వారిలా అన్నారు: 'బ్రాహ్మణ కులం అగ్రకులం. మిగిలినవి అధమం. బ్రాహ్మణులు తెల్లనిరంగువారు. మిగిలినవారు నల్లనిరంగు వారు. బ్రాహ్మణులు పరిశుద్ధులు. మిగిలినవారు అపరిశుద్ధులు. బ్రాహ్మణులు బ్రహ్మ ముఖం నుండి పుట్టారు. అలాంటి మీరు అధములు, నల్లనివారు, అపరిశుద్ధులు కూడా ఉండే బౌద్ధ సంఘంలో ఎందుకు చేరారు' అని నిందించారు" అని చెప్పాడు.

అంటే ... "బ్రాహ్మణో ముఖమాసీత్" అని వేదం చెప్పిన దాన్ని

తప్పి నడచుకున్నారు వీళ్ళు' అనేది బ్రాహ్మణుల వాదం.కానీ, బౌద్ధం గుణశీలాల్ని తప్ప ఇతర భేదాల్ని అంగీకరించదు. ఆ విషయాన్నే చెప్తూ అసలు ఈ సృష్టి ఎలా జరిగిందో, వర్ణవిభజన ఎలా కలిగిందో బుద్ధుడు వారితో చెప్తాడు. అదే అగ్గణ్ణిసుత్తం.అగ్గణ్ణి అంటే అగ్రగణ్యుడు అని.

**సృష్టి సంకోచ, వ్యాకోచాలు:**

బుద్ధుడిలా చెప్పాడు:

"వాసెట్ఠా! దీర్ఘకాల చీకటి స్థితి నుండి లోకం పుట్టింది. పుట్టిన దగ్గరనుండి విస్తరిస్తుంది." అని.

మనం ఇంతకుముందే చెప్పుకున్నాం. ఒక సృష్టికాలం తర్వాత చీకటి అలముకుంటుందని, తర్వాత తిరిగి సృష్టి ప్రారంభం అవుతుందని, అలా ప్రారంభమైన సృష్టి (లోకం) క్రమేపీ విస్తరిస్తుంది. ఈ విస్తరించే క్రమంలో జీవులు ఈ ప్రపంచంలో పుడతాయి. లోకం ఇలా విస్తరించి, విస్తరించి...చివరికి కుంచించుకు పోతుంది. వెనక్కి మళ్ళుతుంది. అప్పుడు జీవులు అంతరిస్తాయి. మరలా చీకటి అలముకొంటుంది. మరలా వ్యాకోచం మొదలవుతుంది. అప్పుడు తిరిగి జీవులు ఉద్భవిస్తాయి –

ఈ సుత్తంలో 'లోకం' అనేది ఉంది. అంటే విశ్వం అనేది ఉంది. అది సంకోచ, వ్యాకోచాలు చెందుతుంది. అలా సంకోచ,వ్యాకోచాలు చెందడం వల్ల స్థల, కాలాల్ని ఏర్పరుస్తుంది. అది అలా సంకోచ, వ్యాకోచాలు చెందక పోయి ఉంటే స్థలమార్పులేదు. కాలం పుట్టుకే లేదు. ఈ స్థల, కాల మార్పుల్లో జీవులు వివిధ లోకాల్లో అవతరిస్తూ ఉంటాయి. అంతర్ధానమవుతూ ఉంటాయి. అది ఒక సహజ ప్రక్రియ. అంతేగాని గొప్పవారు, అధములు అనేవారు ప్రత్యేకంగా నోటి నుండో, ముఖం నుండో పుట్టరు – అని బుద్ధుడు చెప్తాడు. ఇదే ఇక్కడ మనం ప్రత్యేకంగా గమనించాల్సిన విషయం.

**బిగ్‌బ్యాంగ్ సిద్ధాంతం ప్రకారం :**

ఈ సంకోచ, వ్యాకోచాల గురించి ఆలోచిస్తున్నప్పుడు, తెలిసిన వారికి వెంటనే "బిగ్‌బ్యాంగ్" సిద్ధాంతం గుర్తుకు వస్తుంది. ఈ బిగ్‌బ్యాంగ్ సిద్ధాంతమే ప్రస్తుతం ఉన్న విశ్వసృష్టి సిద్ధాంతాల్లో దాదాపుగా అందరూ అంగీకరించింది. ఈ సిద్ధాంతం ప్రకారం ఒక బిగ్ బ్యాంగ్ (మహా విస్ఫోటనం) జరిగాక విశ్వంలో శక్తి–పదార్థంగా మారి, ఆ పదార్థం నక్షత్రాలుగా, గ్రహాలుగా, పాలపుంతలుగా మారి విస్తరించుకుంటూ పోతుంది. వాటిల్లో అనేక గ్రహాల మీద జీవం పుడుతుంది. ఈ విస్తరణ 6 వేల కోట్ల సంవత్సరాలు సాగి, చివరికి మరలా ముడుచుకు పోతుంది. ఇలా ముడుచుకు పోడానికి 600 కోట్ల సంవత్సరాలు పడుతుంది. ఇలా ఆఖరికి ఈ విశ్వంలో పదార్థం అంతా ఒక ముద్దగా మారిపోతుంది. అంధకారం అలముకొంటుంది. ఆ ముద్ద చివరికి తిరిగి మరలా మహా విస్ఫోటనం చెందుతుంది – ఈ ప్రక్రియ ఇలా జరుగుతూనే ఉంటుంది. అంటే ఒక బిగ్‌బ్యాంగ్ నుండి మరో బిగ్‌బ్యాంగ్‌కు పట్టే కాలం 6,600 కోట్ల సంవత్సరాలన్నమాట. ప్రస్తుతం మనం ఉన్న ఈ విశ్వం పుట్టి లేదా బిగ్‌బ్యాంగ్ జరిగి 1000 కోట్ల సంవత్సరాలు కావొస్తుంది. ఈ వెయ్యి కోట్ల సంవత్సరాల కాలంలో మన భూమి పుట్టి 500 కోట్ల సంవత్సరాలు అయ్యింది.

**ఆశ్చర్యం – అద్భుతం:**

బుద్ధుడు చెప్పిన లోక సంకోచ, వ్యాకోచాలు – మనల్ని ఆశ్చర్యంలో ముంచెత్తుతాయి. ఇదే కాదు. ఈనాటికీ ఆయన చెప్పిన అనేక వైజ్ఞానిక, సామాజిక, సాంఘిక విషయాల్ని చూస్తుంటే బుద్ధుని శాస్త్రీయ దృక్పథానికి ఆశ్చర్యం వేస్తుంది! నిజం! నిజంగా...బుద్ధుడొక అద్భుతం! అలవికాని మహా ఆశ్చర్యం!!

**భూమి, జీవరాశి పుట్టుక:**

భూమి తొలినాటి స్థితి, దానిపై జీవరాశి ఎలా ఉండేదని బుద్ధుడు చెప్పాడో చూద్దాం:

***"వాసెట్ఠా! సత్తానం కదాచి కరహచి దీఘస్స***

***అత్థునో అచ్చయేన రసపథవీ ఉదకంహి సమతనీ ..."***

***(దీర్ఘనికాయ: 120)***

"ఆ లోకాల్లో భూమి పుట్టింది. ఈ భూమి అనంత జలరాశితో నిండిపోయి ఉంది. ఆ జలరాశిపై భూమి లోపలి భాగంలో ఉన్న "పృధ్వీరసం" పైకి వచ్చి పాల మీద మీగడలా పరచుకొంది. ఆ అనంత జలరాసిలో...

***"న ఇత్థిపుమా పణ్ణాయంతి సత్తా సత్తాత్వేవ సంఖయం గచ్ఛంతి"***

జీవులుగా పరిగణించబడే జీవుల్లాంటి జీవులు పుట్టాయి. అవి ఎన్నో ఏళ్ళు జీవించాయి. అప్పటికో మీగడలాంటి నేల భాగం జీవుల దగ్గరకు వచ్చింది –"

ఇదీ... బుద్ధుడు చెప్పిన తొలినాటి భౌగోళిక స్థితి. ఇక, ఈ విషయంలో ఆధునిక విజ్ఞానశాస్త్రం ఏం చెప్పిందో చూడండి:

భూమి 500 కోట్ల సంవత్సరాలనాడు ఏర్పడిందని చెప్పుకున్నాం కదా! ఆ భూమి తొలిలో సలసల మరిగే అగ్నిగోళంలా ఉండేది. ఆ తర్వాత చల్లబడింది. కొన్ని లక్షల ఏళ్ళ ఎడతెరిపిలేని వర్షాలు పడ్డాయి. భూమి జలమయం అయ్యింది. వర్షం నీటితో నిండిన ఉష్ణసముద్రాలు చల్లబడ్డాయి.ఆ జలంలో తొలుత కర్బన సహిత (ఆర్గానిక్) పదార్థం పుట్టింది. దాన్నుండి అమైనో ఆమ్లాలు పుట్టాయి. వాటి నుండి నిర్జీవ ప్రోటీన్లు ఉద్భవించాయి. అవి సజీవ ప్రోటీన్లుగా మారాయి. ఆ సజీవ ప్రోటీన్లనే "జీవాణువులు" (కొయ సర్వేట్స్) అంటారు. ఇవే జీవులుగా కనిపించే తొలి జీవులు. ఒకసారి నిర్జీవులుగా, ఒకసారి సజీవులుగా బ్రతగ్గల "వైరస్'లకు ఇవి పూర్వజీవులు. ఈ సజీవ ప్రోటీన్‌లే చివరికి న్యూక్లియో ప్రోటీన్‌గా మారి "వైరస్‌లు" ఉద్భవించాయి.ఆ తర్వాత నేటి దక్షిణ ధృవ ప్రాంతంలో మొదటగా అగ్ని పర్వత లావా –భూమి అంతర్భాగం నుండి లేచివచ్చి సముద్రనీటిపై చిక్కటి ద్రవరూప తెట్టగా ఏర్పడింది. ఆ తెట్టే నేటి నేల భాగం. ఆనాడు ఒకే ముక్కగా ఉండేది. దీన్ని పేంజియా అంటారు.అదే ఈనాటి ఏడు ఖండాలు.

ఇప్పుడు అసలు విషయానికొద్దాం: బుద్ధుడు చెప్పిన వాటిలో –జీవుల్లా అనిపించే జీవులు, పృధ్వీరసం, నీటిమీద మీగడ పొరలా తేలిన పృధ్వీరస తెట్ట...– అనే మాటలు చాలా ముఖ్యమైనవి.

'జీవుల్లా అనిపించే జీవులు' అనేది కొయసర్వేట్స్‌ని, పృధ్వీరసం అనేది అగ్నిపర్వత లావాని,నీటిమీద మీగడ పొరలా తేలిన పృధ్వీరస తెట్ట అనేది పేంజియా నేల నిర్మాణాన్ని విస్పష్టంగా తెలియజేస్తుంది.

నేటి సైన్స్ ఇంకా ఏం చెప్తుందంటే...

ఈ భూగోళం 400 కోట్ల సంవత్సరాల నాడు నీటిగోళంగా మారింది.ఆ తర్వాత దానిలో 50 కోట్ల సంవత్సరాలకి జీవం పుట్టింది.

నేల మీదికి రాకుండా ఆ జీవం 300 కోట్ల సంవత్సరాలపాటు నీటిలోనే ఉంది.ఆ తర్వాత నేల మీదికి వచ్చింది. 350 కోట్ల సంవత్సరాల జీవుల చరిత్రలో జీవులు నేల మీదికి వచ్చి 40 కోట్ల సంవత్సరాలే కావొస్తుంది. అన్ని కోట్ల సంవత్సరాలు, అనేక రూపాల్లో మొక్కలుగా, జంతువులుగా జీవం సముద్ర జలాల్లోనే గడిపింది. మొదటిగా నేల మీదికి వచ్చింది మొక్కలే. భూసారాన్ని తొలిగా పీల్చుకున్న జీవులు మొక్కలే.

ఆ విషయం గురించి బుద్ధుడు ఏం చెప్పాడో ఇప్పుడు చూద్దాం:

**నేలమీదికి జీవం – రుతుచక్రగమనం:**

"వాసెట్ఠా! నీటిలో ఉన్న జీవులు (మొక్కలు) మొదటగా తమ వ్రేళ్ళతో నేలను తాకాయి. నేలకు రంగూ, రుచి, వాసన ఉంది. ఆ వాసన, ఆ రుచులు జీవుల్ని మైమరపించాయి. దానితో వాటిలో "తృష్ణ" పుట్టింది. తమ వేళ్ళతో ఆ పదార్థాన్ని రుచి చూశాయి. దాన్ని తినడం కోసం ఆ నేలభాగాన్ని ముక్కలు ముక్కలు చేశాయి. అప్పుడు అవి తమకు తాము స్వయంగా బ్రతికే శక్తిని పోగొట్టుకున్నాయి. అప్పుడు ఆకాశంలోని ఉన్న సూర్య, చంద్రుల కాంతి భూమ్మీదికి వచ్చింది. ఇలా నేల మీదికి జీవులు రావడంతో, సూర్య చంద్రుల వెలుగు సోకడంతో రుతువులు ఏర్పడ్డాయి. నెలలు, పక్షాలూ, సంవత్సరాలూ రూపొందాయి – ఆ తర్వాత జీవుల రూపు రేఖలు మారాయి. కొన్ని అందంగా, కొన్ని వికృతంగా అనేక రూపాల్లోకి మారాయి. అవన్నీ భూమి సారాన్ని తింటూ "ఆహాఁ ... ఏమిరుచి ... ఏమి రుచి ..." అనుకుంటూ బ్రతికాయి. "అందుకే వాసెట్ఠా! మనం ఈనాటికీ ఆ రసతృష్ణకు లోబడి కొన్ని కొన్ని సందర్భాల్లో "ఆహా ఏమిరుచి!" అంటూ ఉంటాం" – ఇవీ బుద్ధుడు చెప్పిన విషయాలు.

నిజమే! మంచి మాట విన్నప్పుడు "ఎంత తియ్యని కబురు చెప్పారు" అంటూ ఉంటాం గదా!

ఇక, అసలు విషయానికొద్దాం. బుద్ధుడు చెప్పిన పై విషయాన్ని ఆధునిక వైజ్ఞానిక పరంగా చూద్దాం. భూగోళశాస్త్రం ప్రకారం కూడా, సముద్రం నుండి మొక్కలు 40 కోట్ల సంవత్సరాలనాడు నేల మీదికి వచ్చాయి. అవి వచ్చాక సూర్యుని కాంతిమీద ఆధారపడి కిరణ్యజన్య సంయోగక్రియ జరుపుకుంటూ ఆహారాన్ని తయారు చేసుకోవడం మొదలు పెట్టాయి. ఈ కిరణజన్య సంయోగక్రియవల్ల వాతావరణంలో ఆక్సిజన్ ($O_2$) వేరు పడింది. ఆ తర్వాత ఆ ఆక్సిజన్‌ని పీల్చుకుని బ్రతికే కొత్త జంతువులు (ఉభయసరాలు) సముద్రం నుండి నేల మీదికి వచ్చాయి. ఇటు మొక్కల్లో, అటు జంతువుల్లో అనేక జీవ జాతులు పుట్టుకొచ్చాయి. బహుకణ జీవజాతులు విశేషంగా విస్తరించాయి. 20కోట్ల సంవత్సరాలనాడు భూమిపై పగుళ్ళు ఏర్పడి ఖండాలుగా విడిపోవడం మొదలయ్యింది. ఆతర్వాత ఐదు కోట్ల సంవత్సరాలకి అంటే నేటికి 15కోట్ల సంవత్సరాల నుండి భూమ్మీద రుతువులు ఏర్పడి రుతుచక్ర గమనం ప్రారంభమైంది. కొత్తగా తీగలు, పూలతలు, చెట్లకు పుష్పాలు పుట్టుకొచ్చాయి.

**పుట్టకొక్కులు – పూలతలు:**

ఆ తర్వాత వశిష్టునితో బుద్ధుడిలా చెప్పాడు:

"వాసెట్ఠా! మెత్తటి పృథ్వీరసం క్రమేపీ గట్టిపడింది. అప్పుడు పుట్టగొడుగుల్లాంటి మొక్కలు పుట్టాయి. వాటిలో కొన్ని మంచి రుచిగా ఉండేవి. సువాసనలు గొల్పేవి. అప్పుడు వాటిని తిని బ్రతికే వికార జీవులు పుట్టాయి. దానితో ఆ పుట్టగొడుగుల్లో రుచిగలవి అంతరించి పోయాయి. ఆ తర్వాత బొంగుల్లా, పొదవుగా ఉండే తీగ మొక్కలు పుట్టాయి. అప్పుడు ఆ తీగ మొక్కల్ని తినే జీవులూ పుట్టుకొచ్చాయి".

ఇలా, బుద్ధుడు చెప్పే విషయాల్లో ఒక గొప్ప పరిణామ వాదం కనిపిస్తుంది. ఒక కొత్త మొక్క జాతి పుట్టడం, దాన్ని ఆహారం చేసుకుని తినే మరో కొత్త జంతుజాతి ప్రాదుర్భవించడం –

నిజం కూడా అంతే ... నేల మీదికి వచ్చిన మొదటి మొక్కలు ఆల్గే, ఫంగస్ జాతి మొక్కలే. అంటే నాచు మొక్కలు. శిలీంధ్రాలు. శిలీంద్రాలలో శ్రేష్ఠమైనవి పుట్టకొక్కులే! ఆ తర్వాత లతలు పుట్టాయి. లతలు పుట్టాకే వాటికి రంగురంగుల పూలు పుట్టడం, కాయలు, విత్తనాలు రావడం జరిగింది. అంటే మొక్కల్లో ద్విలింగకత ఏర్పడింది. అలాగే అటు జంతువుల్లో కూడా హెర్మొంధిస్, అనెలిడా (జలగ), మొలస్కా(నత్త) జాతుల్లోనే మొదటిసారి ద్విలైంగిక జీవులు వేరుపడ్డాయి. అంటే ఈ సృష్టిలో జీవులు పుట్టాక 300 కోట్ల సంవత్సరాలు స్త్రీ, పురుష జీవుల విభజన లేదన్నమాట –

మరి, ఈ విషయాన్ని బుద్ధుడు ఎలా చెప్పాడో చూద్దాం.

**స్త్రీ పురుష జీవుల విభజన:**

"వాసెట్ఠా! ఆ తర్వాత లతలు అంతర్ధానమయ్యాయి. అడవుల్లో కాకుండా బాహ్య ప్రదేశాల్లో (మైదానాల్లో) పైన పొట్టు (ఊక) లేనటువంటి ధాన్యం మొక్కలు పుట్టాయి. వాటిని కోసేపని లేదు. నూర్చేపనిలేదు. (బియ్యంగా మార్చేపని లేదు). వాటిని యధాతథంగా తినడం వల్ల ఆ జీవులు అందంగా తయారయ్యాయి. అప్పుడు వాటిలో లైంగిక భేదం వచ్చింది. స్త్రీలుగా, పురుషులుగా లైంగిక అంగాల్ని పొందారు. ఒకరిని గురించి ఒకరు నిరంతర ఆలోచనల్లో మునిగి పోయారు. మరులు గొన్నారు.దానితో వారిలో "రాగం" జనించింది. ప్రేమ, లాలసత పెరిగి పోయింది.దానితో వారు ఎప్పుడూ లైంగిక కార్యకలాపాల్లోనే మునిగి తేలేవారు. అలాంటి వారిని జనావాసాల్లోకి రానిచ్చేవారు కాదు. కాబట్టి వారు తమకి ఒక 'మరుగు' కావాలనుకున్నారు. దానితో "ఇంటిని" నిర్మించుకున్నారు" అని బుద్ధుడు వశిష్టునికి చెప్పాడు.

ఇప్పుడు బుద్ధుడు చెప్పిన పై అంశాల్ని చూద్దాం.

నిజంగా – పరిణామక్రమంలో తొలిగా స్త్రీ, పురుష జీవులు ఏర్పడ్డ క్రమాన్నే బుద్ధుడు చెప్పాడు. ఇటు జంతువుల్లో మార్పులు, అటు మొక్కల్లో మార్పులూ, సమాంతరంగా జంతు, వృక్ష జీవ జాతుల పరిణామ క్రమాన్ని చెప్పుకుంటూనే వచ్చాడు.

ఇలా వచ్చి వచ్చి – కామ సంబంధాలకు వచ్చేసరికి ఒక్కసారి గెంతువేసి మానవ సమాజంలోకి వచ్చేశాడు. బిగ్‌బ్యాంగ్ జరిగి, భూమి పుట్టి, దాని మీద స్త్రీ, పురుష జీవులు ఏర్పడే వరకూ ఉన్న క్రమాన్ని దాదాపుగా 70 శాతం ఆధునిక పరిణామ క్రమానికి దగ్గరగానే బుద్ధుడు చెప్పాడు. ఆ తర్వాత వెన్నెముక గల జీవులు, పక్షులు, క్షీరదాలు, కోతులు, మానవులు – ఈ క్రమాన్ని గురించిగానీ, వీటిల్లో ఏదో ఒక అంశాన్ని గురించిగానీ చెప్పలేదు. ఒక్క సారిగా మానవ సమాజంలోకి వచ్చేశాడు.

ఇక – అక్కడి నుండి ఆయన చెప్పింది సామాజిక పరిణామం.

(దానిగురించి వచ్చే సంచికలో చూద్దాం.....)

ధారావాహిక

# మౌనంలోని మాటలు

**10**

**సంచారి రావోళ్ళ నాగప్ప ఆత్మకథ**



కన్నడ మూలం:
**డా. ఆర్. వి. బి. కుమార్**

తెలుగు అనువాదం :
**రంగనాథ రామచంద్రరావు**
9059779289

**సింధనూరు సంచారుల ప్లాటులు :**

సింధనూరులో ఊరి మధ్యన ఒక పెద్ద కాలువ ప్రవహిస్తూవుంది. దాని పక్కన బయలుప్రదేశంలో మా జాతిజనం గుడారాలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీళ్ళు ఒకసారి వెనుకటి ఎం.పి. విరూపాక్షప్ప దగ్గరికి పోయి మాకు ఉండటానికి ఏదైనా స్థలం చూపించండని అడిగారు. ఆయన సింధునూరు నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న నాలుగు ఎకరాల స్థలం చూపించారు. అక్కడికి వెళ్ళి గుడారాలు వేసుకోమని, తాను ప్రభుత్వంతో మాట్లాడి ఆ స్థలంలో ప్లాటులు వేయించి ఇప్పించే ఏర్పాటు చేస్తానని, అటు తరువాత సర్కారు ఇళ్ళను అలాట్ చేయిసానని కూడా చెప్పారు.

ఆ మాటలు మా వాళ్ళకు నచ్చలేదు !

'ఊరు వదిలి నాలుగైదు కిలోమీటర్లు దూరంలో అడవిలో ఉండమంటే ఎలా ఉండటం? మేము బిచ్చం అడుక్కోవటానికి ఊర్లోకి రావాలి. పిల్లాజెల్లాను అంత దూరం వదిలి రావడం కష్టమవుతుంది. ఊర్లో ఎక్కడైనా ఖాళీ స్థలం చూపించమని నువ్వు మా తరఫున విరూపాక్షప్పగారికి ఒకమాట చెప్పు' అన్నారు. నేను ఆయన చెప్పినట్టు వెళ్ళి ఆయన చూపించిన స్థలంలో ఉండండి అన్నాను. దానికి మా వాళ్ళంతా నువ్వు మావాడివై ఉండి ఎవరో ఎం.పి. చెప్పినట్టు చెబుతున్నావు కదా ? అని నాతో గొడవపడ్డారు.

మా వాళ్ళ మాట మీరలేక మా జాతిజనాన్ని పిల్చుకుని విరూపాక్షప్పగారి ఇంటికి వెళ్ళి బయట కాచుకుని కూర్చున్నాను. ఆయన మా వాళ్ళందరిని చూసి, 'ఏం వచ్చారు?' అని అడిగాడు. మా వాళ్ళంతా నన్ను ముందుకు తోశారు. నేను ముందుకు వెళ్ళి, "అయ్యా, మా వాళ్ళకు ఏదో ఒక స్థలం ఇవ్వండి. పుణ్యం వస్తుంది" అన్నాను.

ఆయన నన్ను చూసి, "ఏ ఊళ్ళో ఉంటావు. వీళ్ళకు నువ్వు ఏమవుతావ్?" అని అడిగాడు.

"స్వామి, నేను కంప్లిలో ఉంటాను. ఈ జాతి సంఘానికి నేను రాష్ట్రాధ్యక్షుడిని" అని అన్నాను.

"రేయ్, ఎవడ్రా నిన్ను రాష్ట్రాధ్యక్షుడిని చేసింది? మీ వాళ్ళను కంట్రోల్లో పెట్టుకోలేనివాడివి నువ్వెలా రాష్ట్రాధ్యక్షుడివి అయ్యావు?" అన్నాడు.

"అయ్యా, మేము చదువురాని జనం. అడుక్కుని తినే జనం. మాకు ఒక నెలవు దొరికితే ఊరూర్లా తిరగటం మానేయాలని మా ఆశ. అంతే. మీరు ఎక్కడో దూరంలో ఉన్న స్థలం చూపించారంట. మా వాళ్ళు అక్కడికి పోవడానికి వెనుకాడుతున్నారు. మీరే పెద్దమనస్సు చూపించాలి" అని వేడుకున్నాను.

దానికి ఆయన, "అది కాదురా, మొదట ఈ సింధునూరు ఎంత ఉండింది? ఇక్కడ నాలుగైదు ఇండ్లు ఉండేవి. ఇప్పుడు ఎన్ని ఉన్నాయి? ఒక పెద్ద ఊరే అయిపోయింది. ఇప్పుడు ఇది తాలూకా. ఇది ఇలాగే పెరుగుతూ ఉంటుంది. ఈ రోజు మీరు వెళ్ళడానికి వెనుకాడే స్థలం ముందు ముందు ఊర్లో కలిసిపోతుంది. నాలుగైదు సంవత్సరాలు ఎదురుచూడాలి. మీరు వెళ్ళి అక్కడ చేరితే ఒక బోరు వేస్తారు. మీ పిల్లలకు బడి వస్తుంది. మీకు ఇండ్లు వస్తాయి. నేను చెప్పినట్టు వెళ్ళి ఆ స్థలంలో చేరుకోండి. ఊరకే నా దగ్గరికి వస్తే ఏమి ప్రయోజనం? మీకు ఊళ్ళోనే స్థలం కావాలంటే చెప్పండి. నేనొక లక్ష రూపాయలు ఇస్తాను. దాన్ని తీసుకుని ఎక్కడైనా స్థలం దొరికితే తీసుకోండి" అని చెప్పేశాడు.

ఆయన మాటల్లో నిజం ఉంది.

అయితే ఆయన మాటల్ని వినే స్థితిలో మా వాళ్ళు లేరు.

విరూపాక్షప్పగారు చెప్పిన స్థలంలో ఈ రోజు ఇతరులు వెళ్ళి స్థిరపడ్డారు.

మా వాళ్ళు మాత్రం ఎక్కడున్నారో అక్కడే అదే గుడారాల్లో నివసిస్తున్నారు.

విరూపాక్షప్పగారి మాటలు వినివుంటే మావారికొక నెలవు దొరికేది !

**సామూహిక వివాహం :**

రాజకీయనాయకులందరూ చేస్తున్నట్టే ఎం.పి. విరూపాక్షప్పగారు సింధనూరులో సామూహిక వివాహాలు జరిపించడం మొదలుపెట్టారు. సామూహిక వివాహంలో పాల్గొన్న వారికి ఒక జతబట్టలు, పెళ్ళికూతురుకు చీర- తాళి, పెళ్ళి తరువాత భోజనం ఏర్పాట్లు చేశారు. మా వాళ్ళల్లో ఒకరిద్దరు ఆ సామూహిక వివాహంలో పాల్గొని పెండ్లి చేసుకున్నారు. అయితే వారికి ఆ పెండ్లి మా కులపద్ధతి ప్రకారం జరగలేదని అనిపించింది. అంతకన్నా ముఖ్యంగా మా

వాళ్ళకు పెండ్లి అంటే ఒక గొర్రెనైనా కోయాలి. సారాయి తాగాలి. అవేవీ లేని పెండ్లి జరగటం మా వాళ్ళకు నచ్చలేదు. అంతకన్నా నచ్చనిది ఆ సామూహిక వివాహాల్లో బాల్య వివాహాలు జరగకపోవటం. అది మరింత ఇబ్బంది కలిగించింది. అందువల్ల ఉచితంగా తాళి దొరికే విరూపాక్షప్ప సామూహిక వివాహాన్ని మా వాళ్ళు పూర్తిగా తోసిపుచ్చారు.

అటు గొప్ప ప్రచారంతో విరూపాక్షప్ప నిర్వహిస్తున్న సామూహిక వివాహాలు జరుగుతూవుంటే; ఇటు గుడారం ముందు మా వాళ్ళ ప్రత్యేక వివాహాలు జరగసాగాయి. ఎవరో విరూపాక్షయ్య దగ్గరికి వెళ్ళి, "ఆ దేవుళ్ళను ఆడించేవాళ్ళు మీ సామూహిక వివాహాలు జరిగే సమయానికే సంత బయల్లో గుడారాల ముందు ప్రత్యేకంగా వివాహలు జరిపిస్తున్నారు"అని చాడీలు చెప్పారు. అది విని విరూపాక్షయ్యగారు, "నేను ఎం.పి.ని. నన్ను అవమానించాలని మేము సామూహిక వివాహం జరిపించే సమయానికే ఈ తిరుపమెత్తే నాయాండ్లు తమ వివాహాలను సపరేట్‌గా చేస్తారా?' అని మండి పడ్డారట.

అయితే మా వాళ్ళు ఆ విషయాన్ని పెద్దగా పట్టించుకోనే లేదు.

**తమ్ముడి తలలో కణితి :**

మేము నలుగురు అన్నదమ్ములమని చెప్పాను కదా ! అందులో నా తరువాతి వాడైన ఒక తమ్ముడు తనేమో తన బిచ్చమేమో అన్నట్టు ఉండేవాడు. అతను కాస్త చేతికి వచ్చాడనే సమయానికి మా అక్క కూతుర్నే నిర్ణయించి పెండ్లి చేశాం. పెండ్లయిన ఒక ఏడాదిలోనే తను బిచ్చానికి వెళ్ళినవాడు నేరుగా ఇంటికి వచ్చి తలనొప్పి అని పడుకున్నాడు.

డాక్టరుకు చూపించాం. నొప్పి తగ్గే మాత్ర ఇచ్చారు. నొప్పి తగ్గటంతో మళ్ళీ బిచ్చాటనకు వెళ్ళాడు. మళ్ళీ ఒకటిరెండు రోజుల్లో 'తలనొప్పి' అంటూ పడుకున్నాడు. గవర్నమెంట్ ఆస్పత్రిలో డాక్టర్‌కు చూపించాం. బళ్ళారి పెద్దాసుపత్రికి వెళ్ళండని అన్నారు. అక్కడికి పిల్చుకునిపోయాం. ఆ సమయంలో డబ్బు సమస్య తీవ్రంగా ఉండేదీ. పెద్దాసుపత్రిలో స్కాను చేసి తలలో మెదడుకు కణితి అయిందని ఆపరేషన్ చేయాలి, బెంగళూరుకు వెళ్ళండని అన్నారు. బెంగళూరు పేరు వినగానే గుండె జల్లుమంది. ఏం చేయాలి? మీరే ఆపరేషన్ చేయండని అన్నాం.



అలాగే అంటూ ఆయన కూడా ఆపరేషన్ చేయడానికి అంగీకరించారు. ఊరికి వెళ్ళి అన్నీ సమకూర్చుకుని వస్తామని చెప్పి కంప్లికి వచ్చాం. తరువాత డాక్టర్ ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ ఫెయిల్ అయ్యింది. తలలో వాపు వచ్చింది. మళ్ళీ డాక్టర్‌కు చూపించడానికి వెళ్ళాం. మళ్ళీ ఆపరేషన్ చేయాలని అన్నారు. సుమారు మూడు లక్షలు ఖర్చు చేశాం. అయినా తమ్ముడు దక్కలేదు. తమ్ముడు శవమయ్యాడు.

ఇటు కోడలు పెళ్ళయిన ఒక సంవత్సరంలోనే వితంతువైంది. ఆ పిల్లను వేరే వాళ్ళకు ఇచ్చి పెళ్ళి చేద్దామని ఆలోచించాను. అయితే అమ్మాయి ఒప్పుకోలేదు. ఒక్కతే మా ఇంటి ఎదుటే పాతబట్టలు అమ్ముకుని జీవనం సాగించటం మొదలుపెట్టింది. తమ్ముడు చనిపోయి వారంకూడా కాలేదు. నా కోడలిని పెళ్ళి చేసుకుంటామని ఇతరులు అడగటం మొదలుపెట్టారు. ఇంకా దినకర్మలు ముగియనే లేదు. ఇటుచూస్తే కోడలు దుఃఖం తగ్గనే లేదు. ఇలాంటి సమయంలో పెళ్ళి మాటలు. నాకు కోపం వచ్చింది. నేను ఒప్పుకోలేదు. అదే కారణంగా పెట్టుకుని నాకు, నా కోడలికి జనం సంబంధం అంటగట్టారు. ఏమైనా అనుకోనీ అని నేను మౌనంగా ఉండిపోయాను.

**ఫోనులో మాట్లాడే దేవుడి కథ:**

పేదరికానికి సమస్యలు ఎక్కువ !

ఆ సమస్యలన్నీ పుట్టడం అవగాహన లేకపోవటం వల్లనే. మా కాలనీ జనమంతా లింగసూగూరుకు అటువైపు సరపుర దగ్గర ఒకరు దేవుడితో దగ్గర మాట్లాడి మా కష్టాలు పరిష్కరిస్తారని మాట్లాడుకోవటం మొదలుపెట్టారు. మా ఇంట్లోనూ వందలాది సమస్యలున్నాయి. అందులో ముఖ్యంగా నా కాలువిరగటం, ఒంటి నిండా అప్పులు ఉండటం, నేను పెట్టుకున్న చిన్న అంగడి చుట్టూ రెండు మూడు కొత్తఅంగళ్ళు పుట్టుకొచ్చి మా అంగడి వ్యాపారం తగ్గటం. పిల్లల ఆరోగ్య సమస్యలు–. ఇలా సమస్యల తరువాత సమస్యలు పీడిస్తూనే ఉన్నాయి. నా ఇద్దరు భార్యలు ఆ దేవుడు ఉన్న చోటికి వెళ్ళి వద్దామని వెంటబడ్డారు.

దేవుడిని అడగటానికి వచ్చిన వాళ్ళల్లో మాలాంటి బీదవాళ్ళే ఎక్కువ. అందులోనూ మా జాతి జనం గుంపులుగుంపులుగా అతని దగ్గరకి వెళ్ళేవారు. తాము బిచ్చమెత్తి తెచ్చిన డబ్బంతా అక్కడ పోసేవారు. తెక్కలకోటలోని అల్లుళ్ళు కూడా అక్కడికి వచ్చేవాళ్ళు.

దేవుడితో మాట్లాడే ఒక వ్యక్తి చేతిలో ఒక మొబైల్ ఫోన్. అతను ఒక్కొక్కరినే పిలిచి వారి సమస్య అడిగేవాడు. స్వామి, ఇది సమస్య అని చెబితే మా ఎదుటే దేవుడికి ఫోన్ చేసేవాడు. అటువైపు నుంచి దేవుడు మాట్లాడేవాడు. దేవుడి మాటలు మాకు వినిపించేలా లౌడు స్పీకర్ పెట్టి మాకు మాట్లాడేవాడు. దేవుడు మీకు ఈ కష్టాలు ఫలాన కారణంగా వచ్చాయి, మీ సమస్య ఇలాంటిది. నాకంతా తెలుసు. మీరు నన్ను ఇన్ని రోజులు భక్తిగా కొలవండి. మీరు ఎక్కడికి వచ్చి అడుగుతున్నారో అక్కడికి_ఇన్ని వారాలు వచ్చి పోండని చెప్పేవాడు. మేము ఆ దేవుడు

చెప్పినట్టే వారం వారం భక్తిగా వెళ్ళేవాళ్ళం. ఇలాగే సాగుతోంది.

ఇందులో మా మామ చిక్కుకుని ప్రాణాలు పోగొట్టుకున్నాడు.

ఆయన్ను మంచి డాక్టర్‌కు చూపించి ఉంటే బాగయ్యేవాడేమో ?

**చిన్నమామయ్య చావు :**

నా భార్యల తండ్రి, చిన్నాన్నలంతా ఇప్పుడు తెక్కలకోట బయటి సరిహద్దులో సెటిల్ అయ్యారు. అక్కడ వాళ్ళందరికి గుడారాలు ఉన్నాయి. ఇప్పుడు ప్రస్తావిస్తున్నది నా భార్యల చిన్నాన్న విషయం !

అతను చాలా మంచి మనిషి. తనేమో తన కుటుంబమేమో అన్నట్టు ఉండేవాడు. మా సంచారులకు ఉన్నట్టు అతనికీ తాగుడు వ్యసనం ఉండేది. బిచ్చం ఎక్కువగా వచ్చినపుడు కొంచెం ఎక్కువగా తాగేవాడు. అతడికి ఈ మధ్యన ఒక భ్రాంతి మొదలైంది. అది తన భార్య గురించి అనుమానం. పిల్లల్ని ఊరకూరకే తిట్టేవాడు. ఇష్టమైతే బిచ్చానికి పోయేవాడు. లేకపోతే లేదు. గుడారం ముందు రోజంతా మౌనంగా కూర్చునేవాడు. భార్య అడుక్కోవడానికి పోతే అనుమానించేవాడు. ఒక్కొక్క రోజు ఆమెను అడుక్కోవడానికి పంపేవాడు కాదు. 'ఇక్కడే ఉండు' అంటూ గుడారంలోనే ఆపేసేవాడు.

ఈ విధమైన భ్రాంతిలో పడిన మామను అదే ఫోన్ దేవుడి దగ్గరికి మా అల్లుళ్ళు తీసుకునిపోయారు. అతను ఏవేవో చెప్పి ఇతడి తలను మరింత పాడుచేశాడు. ఇలాగే రోజు రోజుకు మామ సమస్య పెరుగుతూ పోయింది. ఒక రోజు ఏమైందో ఏమో మధ్యాహ్నం అందరూ బిచ్చానికి పోయినపుడు మామ తన కండువాతో గుడారంలో ఉరివేసుకున్నాడు.

బిచ్చం అడుక్కుని తిరిగి గుడారానికి వచ్చినవాళ్ళు గుడారం లోపలికి పోలేదు. వాళ్ళంతా మామ ఎక్కడికి వెళ్ళాడోనని అనుకుంటూ అతని భాగం భోజనం తీసి పక్కనపెట్టారు. అయితే చాలాసేపైనా మామ రాలేదు.

చివరికి గుడారంలో పడుకుని ఉన్నాడేమో అని గుడారం తడికె జరిపి చూస్తే గుడారంలో వేలాడుతున్నాడట.

ఇటు చూస్తే నేను కాలు విరగొట్టుకుని ఇంట్లో పడుకుని ఉన్నాను.

చిన్నభార్య నిండు గర్భవతి.

అందువల్ల మట్టికి పెద్దభార్యను పంపాను.

**అన్నయ్య పిల్లలకు అమ్మాయిలను నిర్ణయించడం :**

మేము మా అన్న పిల్లలకు అమ్మాయిని అడిగాం కదా ! ఆ ఇంటికి మా అక్కయ్యను ఇచ్చాం. వాళ్ళు మొదట ఆంధ్రలో ఉన్నారట. ఆ కాలంలో వారికి ఒక్కరు కూడా అమ్మాయిని ఇవ్వడానికి సిద్ధంగా లేరట. అలాంటి సమయంలో మా నాన్న వాళ్ళను ఇటు వైపుకు పిలుచుకుని వచ్చి అమ్మాయిని కుదిర్చి పెళ్ళి చేశాడట. మా ఇంట్లో మా అక్కల్లో ఒకామెను నడిమిమామకు ఇవ్వడానికి నాన్న ఒప్పుకున్నాడట. అయితే వాళ్ళు మా అక్కను నడిమిమామకు చేసుకోకుండా చివరిమామకు మా అక్కను చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారట. మొత్తానికి వాళ్ళ ఇష్టం మా నాన్నకు నచ్చలేదు. మా నాన్న ఇష్టపడింది వాళ్ళకు నచ్చలేదు. ఇలా లోలోపల ముసుగులో గుద్దులాట జరుగుతోంది. ఆ కాలంలో పిల్లనిచ్చేవాళ్ళు దిక్కులేని కాలంలో వాళ్ళకు పిల్లను ఇప్పించి, స్థిరనివాసం ఏర్పాటు చేశాననే గర్వం నాన్నకు. అందువల్ల తాను చెప్పినట్టే వాళ్ళు వినాలనే పట్టుదల నాన్నది. అయితే ఈయన మాటలు మేమెందుకు వినాలనే మొండితనం వాళ్ళది.

అప్పటికే నాన్నకు పక్షవాతం వచ్చింది. బయటికి పోయేవాడు కాదు. దాన్ని సాకుగా వాళ్ళు తీసుకున్నారు. కులపంచాయితీ పెట్టి మా అక్కను పెళ్ళి చేసుకుంటమని వాళ్ళు అడిగారు. నాన్న తరఫున నేను పంచాయితీలో కూర్చున్నాను. మా వాళ్ళు ఎలా చెప్తారో అలా వినటమే నా పని. అప్పుడు నేనింకా చిన్నవాడిని. మా అక్కను ఇవ్వడానికి కుదరదనిపంచాయితీలో నేను చెప్పాను. నా మాటను ఎవరు వింటారు? మామ మాకు తెలియకుండానే ఒక రోజు పెళ్ళి ఏర్పాటు చేసుకున్నాడు. సంచారుల పెళ్ళంటే తెలుసు కదా ! వారి గుడారం ముందు పెళ్ళి ఏర్పాటు చేసుకున్నాడు.

మా గుడారానికి వచ్చి మా నాన్న ఎదుటే మా అక్క చేయి పట్టుకుని పిల్చుకునిపోయి తాళి కట్టేశాడు.

మేమంతా నోరు వెళ్ళబెట్టుకుని చూస్తూ ఉండిపోయాం.

ఇది జరిగిన తరువాత చివరికి వారి ఇంటి నుంచి ఒక పిల్లను మా ఇంటికి ఇవ్వాలని ఒప్పందం చేసుకున్నాం. ఇది జరిగి ఎన్నో సంవత్సరాలు గడిచిపోయాయి. కాస్త చేతికి వచ్చిన తరువాత నాకు తమ ఇంటి పిల్లను ఇస్తామన్నారు. అయితే మేము అప్పటికే తెక్కలకోట అమ్మాయిని చూసి మాట ఇచ్చాం. అందువల్ల మా తమ్ముడికి పిల్లను చేసుకుంటే సరిపోతుందని ఊరకయ్యాం. అయితే ఒక తమ్ముడికి మా కోడలిని ఇచ్చి పెళ్ళి చేశాం. మరొక తమ్ముడికైనా ఆ ఇంటి అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలంటే అతను మరో పిల్లను పెళ్ళి చేసుకుంటానని పట్టుబట్టాడు. అందువల్ల మా అన్నదమ్ముల్లో ఎవరూ ఆ ఇంటి పిల్లను చేసుకోవడానికి సాధ్యం కాలేదు. నాన్న ఇచ్చిన మాట అలాగే ఉండిపోయింది. చివరికి నాన్న మాట నిలబెట్టడానికి అన్న పిల్లలకు వాళ్ళింటి పిల్లను చేసుకుందామని నిర్ణయించుకున్నాం. అయితే పిల్ల ఇంటి వాళ్ళు ఒప్పుకోలేదు. మీ అన్నదమ్ములు చేసుకోకుండా మీ పిల్లలకు చేసుకోవడం ఎంతవరకు సబబు? అందుకే మీ ఇంటికి పిల్లను ఇవ్వం అని పట్టుబట్టారు. ఈ కారణంగా చాలా సంవత్సరాలుగా వాళ్ళతో గొడవ నడుస్తోంది.

చివరికి మొన్నటి కులపంచాయితీలో తమ ఇద్దరు అమ్మాయిలను అన్న పిల్లలిద్దరికి ఇవ్వడానికి అంగీకారం తెలిపారు.

**బీదరు బంధువులతో కలయిక :**

మా జనం బీదరు, గుల్బర్గా వైపుంతా ఉన్నారని సర్వే చేయడానికి వెళ్ళినపుడు తెలిసింది. అయితే బీదరులో మూడువందల కన్నా ఎక్కువ కుటుంబాలు ఉన్నాయని తెలియదు. ఎందుకంటే మేము సర్వేకు పోయినపుడు వాళ్ళంతా ఆంధ్ర, మహారాష్ట్ర మొదలైన ప్రాంతాల వైపు బిచ్చాటనకు పోయారు. వాళ్ళంతా ఒక చోట స్థిరంగా ఉన్నారని తెలియగానే నేను, గుడారనగర ఈరేశి, రాయచూరులోని మా కుర్రవాడు మొత్తం ముగ్గురు నలుగురు కలిసి తలా కొంత డబ్బు వేసుకుని ఒక కారు అద్దెకు మాట్లాడుకుని బీదరుకు వెళ్ళాం.

అక్కడ మా సముదాయం వాళ్ళకు ఈ రోజుకూ ఉండటానికి స్థలం లేదు. ఊళ్ళో ఏదో పెద్ద బయలు ప్రదేశంలో గుడారాలు వేసుకుని జీవిస్తున్నారు. వాళ్ళకు ఈ నాటికీ అక్కడి

### ప్రముఖ కథా రచయిత

# పెద్దిభొట్ల సుబ్బరామయ్య – ఒక జ్ఞాపకం



పెద్దిభొట్ల ఇక లేరంటే విచారం – బాధ. ఒక ప్రముఖ కథా రచయితగానే పెద్దిభొట్లగారు నాకు తెల్సు. అయితే వారిని ప్రత్యక్షంగా చూసింది మాత్రం 1978 సుమారుగా వీరి లయోలా కాలేజీలోనే. అప్పుడు నా నవలల ప్రచురణ కొరకు పబ్లిషర్ల వేటలో వెళ్లిన. విజయవాడ వెళితే నేను తప్పక చూసే ప్రదేశం గోరా – నాస్తిక కేంద్రం. అప్పటికే వారు కీర్తిశేషులు, లవణం – హేమలతలను కల్సి మాట్లాడిన. అక్కడి నుంచి 'లయోలా' సుబ్బరామయ్యగారు అక్కడ లెక్చరర్ – ఇంగ్లీష్. రచయిత కాబట్టి అభిమానం. నా పరిచయం కష్టం కాలేదు – ఎందుకంటే అప్పుడు నా 'శాంతిపథం' బౌద్ధ నాటకం ఇంటర్‌మీడియెట్ ఎ.పి విద్యార్థులకు తెలుగు పాఠ్యగ్రంథం. ఎన్నో ముచ్చట్లు; మరునాడు నేను బస చేసిన లాడ్జికి వారు వచ్చిన్రు. కథల ప్రస్తావన. వారి నీళ్ళు కథ నేను చదివిన. ఆ మరునాడు నా కోరికగా – వారు నేను కల్సి ఉండవల్లి గుహలు చూడ వెళ్లినం – రిక్షా. అప్పటికి ఆటోలు వ్యాప్తి కాలేదు. కృష్ణదాటి పోతుండగా దారి ప్రక్క పెరళ్ళు చూపుతూ "ఇవి ఆముదపు చెట్లు. వీటి గింజల నుండి కాస్టరాయిల్ వస్తుంది." అని నాకు చెప్పితే నాకు నవ్వు వచ్చింది. నాది గ్రామీణ రైతుకుటుంబం. ఈ ధాన్యాలు – వివిధ దినుసుల పంటలనీడన మా వాళ్లు పండిస్తారు. ఉండవల్లి నాలుగంతస్తుల గుహలు విష్ణుకుండిన కాలానివి. ఒక గుహలో 'మహా పరినిర్వాణ శయన బుద్ధుని' రాతి విగ్రహానికి సున్నం – ఇటుకలు చేర్చి, బ్రహ్మ సహిత విష్ణుమూర్తిగా మార్చిన వైనం చూసినం. ఆ తర్వాత మా మధ్య కొన్ని ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచినై – వారిని చివరిసారి చూసింది మాత్రం 20-4-2014 రోజున. ఇంత ఖచ్చితంగా తేదీ గుర్తుండటానికి కారణం – ఆ దినం సాయంత్రం నాకు తెనాలిలో – సమతారావు బాల సాహిత్య అవార్డు ప్రదానం ఉంది. లయోలా కాలేజి చరిత్రోపన్యాసకులు డా.మొవ్వా శ్రీనివాసరెడ్డి (కాకతీయ విశ్వవిద్యాలయం సెమినార్‌లో పరిచయం. కోరికగా ముందురోజు వెళ్లిన. కాలేజి అతిథి గృహంలో బస. ఉదయం పది గంటలకు కాలేజీ చరిత్ర విభాగం సభలో "ప్రాచీన చరిత్ర" పై నా ప్రసంగం. ఆ సభకు అధ్యక్షులు పెద్దిభొట్ల సుబ్బరామయ్యగారే. తెలుగు లెక్చరర్ ప్రొ. గంగప్పగారి అల్లుడు శ్రీ సాంబశివరావు ఉన్నట్లు గుర్తు. ఇదీ శ్రీ పెద్దిభొట్ల గారితో నా సంబంధం, అనుబంధం – ఇప్పుడు వారు లేరని తెల్సి మా పరిచయం గుర్తుకు వచ్చింది. విచారంతో... –

డా॥ మలయశ్రీ, కరీంనగర్, 9866546220

---

తాహసీల్దారు కులసర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. ఉండటానికి ఇల్లు లేదు. రేషన్ కార్డు లేదు. ఓటరు కార్డు లేదు. ఏదీ లేదు. 'అయ్యా, మేము ఇలాంటి కులస్థులం, మాకు ఉండటానికి స్థలం లేదు, మా జాతి జనాలకు సహాయం చేయండని అడిగితే', 'మీరు ఫలాన జాతి అనటానికి ఏదైనా గుర్తు ఇవ్వండి' అని అంటారు. ఎలాంటి గుర్తు ఇవ్వాలో మాకు తెలియదు. ఈ సమస్య పరిష్కరించాలనే బీదరుకు వెళ్ళాం. ఒకసారి వెళితే పరిష్కారం అయ్యే సమస్య కాదు. రోజుల తరబడి అక్కడ ఉండి సమస్యను పరిష్కరించేంతటి ధనవంతులం కాము. ఈ సమస్య పరిష్కరింపబడక సమస్యగానే ఉండిపోయింది. ఏం చేయాలో తోచటం లేదు.

**తమిళనాడుతో సంబంధం :**

తమిళనాడులోనూ మావాళ్ళు ఉన్నారు. వాళ్ళను అక్కడ ఏమంటారో తెలియదు. ఈ విషయం కుమార్‌సార్‌కి చెప్పాను. ఆయన 'నాకు తెలియదు. తమిళనాడు చూసినవారిని ఆ విషయం అడిగితే ఏదైనా తెలియవచ్చు' అన్నారు. అటు తరువాత తమిళనాడులో ఉన్న ఒకరిని ఆయనే సంప్రదించి మా జాతివాళ్ళను తమిళనాడులో ఏమంటారో తెలుసుకుని చెప్పారు. అక్కడ సాట్టె అడికారర్ (కొరడా వాళ్ళు) అని పిలుస్తారట. ఇటు కర్నాటకలో మమ్మల్ని 'దురగిమురగి అవరు', 'దుర్గమ్మను ఆడిసోరు', 'బురుబుచోరు', –ఇలా మొదలగు పేర్లతో పిలుస్తారు. ఈ మధ్యన మేము 'సిందోళ్ళం' అని గుర్తించబడుతున్నాం.

ఒక రోజు రైల్లో వెళుతుంటే తమిళ నాడుకు చెందిన మా సముదాయం మనిషితో కలిగింది. అవీ ఇవీ మాట్లాడుతూ తమకు సర్కారు నుంచి ఏ సౌలభ్యాలు దొరకటం లేదని చెప్పాడు. ఇక్కడ మా జాతి సంఘం గురించి చెప్పాను. అది విని అతడు చాలా సంతోషపడ్డాడు. అతడు తాము తమిళనాడులో ఒక సంఘం ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందని అడిగాడు. బాగుంటుంది, చేయండని అన్నాను. నా ఫోన్ నెంబరు ఇప్పించుకున్నాడు. అక్కడికి పోయిన తరువాత తమవాళ్ళతో కూడా మాట్లాడి ఫోన్ చేస్తానన్నాడు. అక్కడికి పోయిన తరువాత ఫోన్ చేశాడు. నేను మాట్లాడి ఒకసారి ఇక్కడికి రండి, మా పెద్దవాళ్ళనంతా పరిచయం చేస్తానని చెప్పాను. మా ఆహ్వానం మేరకు ఆయన ఒకరిద్దరిని వెంటబెట్టుకుని ఇక్కడికి వచ్చారు. నేను ఆయన్ను కన్నడ విశ్వవిద్యాలయానికి, మేత్రిసార్ దగ్గరికి పిల్చుకునిపోయాను. మేత్రిగారికి తెలుగు, తమిళం రాదు. మా వాళ్ళకు కన్నడ, హిందీ రాదు. వాళ్ళు మాట్లాడింది వీళ్ళకు, వీళ్ళు మాట్లాడింది వాళ్ళకు నేనే తర్జుమా చేసి చెప్పాను. జక్కా పార్థసారథిగారిని పరిచయం చేశాను. ఆయన తమిళనాడు ఆదివాసి సంస్థ అధికారిగా ఉన్నప్పుడు మా జాతివారి గురించి నివేదిక సమర్పించటం గురించి చెప్పాడు. అయితే ఆయన ఇచ్చిన ఆ నివేదిక ఇప్పటికి అదే స్థితిలో ఆగివుందని, తమకు తెలిసిన తమిళనాడు అధికారుల పేర్లు చెబుతాను, వాళ్ళను వెళ్ళి కలవండని పార్థసారథిసార్ చెప్పారు. మా వాళ్ళు అక్కడ ఒక సమావేశాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. అయితే ఈ నాటికీ సమావేశం ఏర్పాటు చేయడానికి వాళ్ళకు సాధ్యంకాలేదు. తిరిపమెత్తి బతికే జనం. డబ్బు సమకూర్చుకోవడం సులభం కాదుకదా ! అప్పుడప్పుడు ఫోన్ చేసి మాట్లాడుతారు.

తమిళనాడు సిందోళ్ళ సంఘం ఒక కలగానే మిగిలిపోయింది.

(తరువాయి వచ్చే సంచికలో...)

చలసాని నరేంద్ర
9849569050

# దళితులలో అభద్రతా భావం ఎందుకు !

షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు (అత్యాచారాల నిరోధక) చట్టంకు సంబంధించి ఫిర్యాదు రాగానే పోలీసులు వెంటనే నిందితులను అరెస్టు చేయరాదని, ముందుగా సంబంధిత ఫిర్యాదుపై తగు దర్యాప్తు జరపాలని గత మార్చి 20న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దేశవ్యాప్తంగా దళితులలో అభద్రతాభావాన్ని కలిగిస్తున్నది.

దళితులకు దాడులు, అత్యాచారాల నుండి రక్షణ కల్పించడం కోసం ఉద్దేశించిన ఈ చట్టాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ తీర్పును వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 2న జరిగిన భారత్‌బంద్‌లో దేశంలో పలు రాష్ట్రాలలో, ముఖ్యంగా బీజేపీ పాలిత రాష్ట్రాలలో దళిత సంఘాలు అన్నీ కలసి అసమానమైన సంఘీభావం ప్రకటించి, ఆందోళనకు పూనుకోవడం, ఈ సందర్భంగా పలు హింసాయుత సంఘటనలు కూడా దారితీయడం జరిగింది.

1989లో పార్లమెంటు ఈ చట్టాన్ని ఆమోదించినప్పుడు దేశంలో దళితులలో భద్రతాభావం కల్పించడంకోసం, వారిపై దాడులకు పూనుకొనేవారిని కట్టడి చేయడంకోసం రూపొందించిన అత్యంత శక్తివంతమైన చట్టంగా అందరూ భావించారు. నేరాలకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసే అవకాశం ఈ చట్టంలో ఉండడంతో కేసుల దర్యాప్తు యెట్లా సాగినా బాధితులకు 'తక్షణ న్యాయం' జరిగినదని ఒక సంతృప్తిని మిగిల్చేడిది.

అయితే ముంబయికి చెందిన, ఈ చట్టం క్రింద కేసును ఎదుర్కొంటున్న ఒక సీనియర్ ప్రభుత్వ అధికారి అప్పటికే ముంబై హై కోర్టు నుండి బెయిల్ పొందినా సుప్రీం కోర్టును ఆశ్రయించి ఈ చట్టం క్రింద అరెస్టులు జరగాలంటే నిర్దుష్టమైన షరతు విధించే విధంగా చూడగలిగారు. నిందితులు ప్రభుత్వ ఉద్యోగులయితే సంబంధిత విభాగం ఉన్నతాధికారి నుండి, సాధారణ ప్రజలయితే పోలీస్ డిప్యూటీ సూపరింటెండెంట్ నుండి అనుమతి అవసరమని ఇప్పుడు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వాస్తవానికి పలు రాష్ట్రాలలో ఇప్పటికే ఇటువంటి సాంప్రదాయాన్ని అనుసరిస్తున్నారు.

అయితే ఈ ప్రత్యేక కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడానికి కారణమైన సంఘటనకు సంబంధించి కేసు ఎదుర్కొంటున్న మహారాష్ట్రలో కార్డ్ పట్టణంలోని ఒక ఫార్మసీ కాలేజీకి చెందిన అధికారులెవ్వరూ ఆరోపిస్తున్న విధంగా ఎటువంటి వేధింపులను ఎదుర్కొననే లేదు. అయినా ఈ చట్టం దుర్వినియోగం అవుతుందనే ఆరోపణలతో సుప్రీంకోర్టు నుండి రక్షణలు పొందే ప్రయత్నం జరగడంతో సహజంగానే దళితులలో ఒక విధమైన అశాంతిని, భయాందోళనలను కలిగించే పరిస్థితులకు దారితీసినదని చెప్పవచ్చు.

సుప్రీం కోర్టు సహితం ఈ నిర్దిష్ట కేసుకు సంబంధించిన అంశాలను పరిగణనలోకి తీసుకొనకుండా అసలు కేసుకు మూలమైన చట్టం - అమలులో తీవ్రంగా దుర్వినియోగానికి గురవుతున్నట్లు నిర్ణయానికి రావడం, చట్టం అమలుకు కొన్ని షరతులు విధించడం ద్వారా ఈ చట్టం అమలును దాదాపుగా దుర్లభంగా చేస్తున్నారనే అనుమానాలకు దారితీస్తుంది.

ఈ చట్టం అమలులోకి వచ్చి మూడు దశాబ్దాలు జరుగుతున్నా దేశంలో దళితులపై అత్యాచారాలు జరుగుతున్న తీవ్రత మాత్రం తగ్గుముఖం పట్టడం లేదు. పైగా ఇంకా అటువంటి సంఘటనలు పెరుగుతున్నాయి. అయితే గతంలోవలే బాధితులు మౌనంగా ఇటువంటి సంఘటనలకు బలవుతూ ఉండిపోకుండా నేడు చాలావరకు ధైర్యంచేసి పోలీస్ స్టేషన్ వరకు రాగలుగుతున్నారు. బాధితులకు సంఘీభావంగా పలు దళిత సంస్థలు, పౌర సంస్థలు ముందుకు వస్తున్నాయి. అయినా కూడా దళితు లలో భద్రతా భావాన్ని కలిగించలేక పోతున్నాము.

దేశంలో దళితులపై దాడులు జరుగుతున్న సంఘటనలు పెరుగుతున్నా పోలీస్ స్టేషన్‌లలో నమోదవుతున్న కేసుల సంఖ్యలో మాత్రం కొంతమేరకు తగ్గుముఖం కనబడుతున్నది. అధికారంలో ఉన్న రాజకీయ వర్గాల వత్తిడులవల్లనైతే ఏమి, పలుకుబడిగల సంపన్న/ భూస్వామ్య వర్గాల పలుకుబడి కారణంగా అయితేనేమి పోలీసులు కేసులను ఉదారంగా నమోదు చేయడంలేదు. ఈ చట్టంలో ఉన్న నిబంధనలు కష్టతరంగా ఉన్నట్లు భావిస్తూ ఉండడంతో కేసు నమోదులోనే కొంతమేరకు వత్తిడులు లేదా అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు భావించవలసి వస్తుంది.

ఎందుకని నేరాలకు సంబంధించి కేసులు పూర్తిగా నమోదు కాకపోవడం గురించి టాటా సోషల్ సైన్సెస్ సంస్థ 2016లో జరిపిన ఒక అధ్యయనంలో 75 శాతం మంది జరుగుతున్న నేరాలు సంబంధించి బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లడంపట్ల సుముఖత వ్యక్తం చేయడం లేదు.

ఫిర్యాదులతో పోలీస్ స్టేషన్‌కు వెడితే అక్కడ ప్రతికూల స్పందన లేదా వాతావరణం ఎదురుకావడంతో విముఖంగా ఉంటున్నారు. సాధారణ ప్రజలు, చివరకు విద్యావంతులు సహితం పోలీస్ స్టేషన్‌లకు వెళ్లి ఫిర్యాదులు ఇవ్వడానికి సంకోచించే పరిస్థితులు నెలకొంటే, దళితులు, మహిళలు, అణగారిన వర్గాలకు చెందినవారు వెడితే అక్కడ వారికి లభించే స్పందన ఏవిధంగా ఉంటుందో ఊహించడం కష్టం కాబోదు.

జాతీయ నేర నమోదు సంస్థ గణాంకాల ప్రకారం, పోలీస్ స్టేషన్ లలో నమోదైన కేసులను బట్టి దేశంలో ప్రతి 10 నిముషాలకు ఒక దళితునిపై అత్యాచారం జరుగుతున్నది. ఇంకా నమోదు కానీ సంఘటనలు మరెన్నో ఉండవచ్చు. అయినా దళితులపై దాడులకు

సంబంధించి నమోదవుతున్న కేసులలో ఎక్కువగా అమాయకులను ఇరికిస్తున్నారనే అభిప్రాయం మొత్తం సమాజంలో నెలకొనడం దురదృష్టకరం. అందుకు దారితీసిన పరిస్థితులను సహితం మనం పరిగణనలోకి తీసుకోవలసిందే.

గృహహింస, వధువును హింసకు గురిచేయడం వంటి సంఘటనలకు సంబంధించిన కేసుల నమోదులో సహితం ఇటువంటి అభిప్రాయాలే వ్యక్తం అవుతూ ఉండటం గమనార్హం. ఒకవంక అత్యాచారాలకు, వేధింపులకు గురయినవారు తమకు తగు న్యాయం జరగడం లేదని, అసలైన నిందితులను కనీసం అరెస్టు కూడా చేయడం లేదని, వారిని న్యాయస్థానాల ముందుంచి సత్వర గతిన విచారణలు పూర్తి చేయడం లేదని, నిందితులు తేలికగా తగు శిక్షలు పొందకుండా తప్పించుకొంటున్నారని బలమైన అభిప్రాయాలు మన సమాజంలో నెలకొన్నాయి.

ఇంకోవైపు ఇటువంటి కేసులలో కోర్టులలో విచారణ, పోలీసుల దర్యాప్తులలో తీవ్రమైన జాప్యం జరుగుతున్నది. అమాయకులని ఎక్కువగా ఇరికిస్తున్నారనే అభిప్రాయం కలుగుతున్నది. నమోదైన కేసులలో శిక్షలు చాల తక్కువగా పడుతున్నాయి. చాల కేసులు న్యాయస్థానాల బయటనే పరిష్కారాలకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. అందులో పోలీసులు సహితం క్రియాశీల పాత్రవహిస్తున్నారు. దళితులకు సంబంధించి చాల సందర్భాలలో వత్తిడులు తీసుకు వచ్చి, కేసులు ఉపసంహరించుకునే విధంగా చేస్తున్నారు.

ఈ విధంగా జరగడానికి మరో బలమైన కారణం ఫిర్యాదులను నమోదు చేసే సమయంలో బాధితులకు సమాజం నుండి, ప్రజా సంఘాల నుండి, పోలీసు అధికారుల నుండి లభించే మద్దతు, భరోసా కేసు విచారణ కొనసాగుతున్న కొద్దీ తగ్గుతూ ఉంటుంది. ఎందుకంటే నిందితులు సామాజికంగా బలవంతులై ఉంటే వారు వివిధ మార్గాల ద్వారా వారిపై వత్తిడులు తీసుకొస్తూ ఉంటారు. బ్రతుకు తెరువుకు ప్రాధాన్యత ఇవ్వవలసిన బాధితులు ఏదో ఒక స్థాయిలో ఏదో ఒక రాజీ పరిష్కారానికి తలవంచక తప్పని విధంగా మన సామాజిక పరిస్థితులు నెలకొన్నాయి. కుటుంబం సమస్యలు సహితం అందుకు దోహద పడుతున్నాయి.

ముఖ్యంగా భూమిలేని దళిత కూలీలు బాధితులైన సమయంలో బలవంతులైన భూకామందులపై ధైర్యం కూడదీసుకుని కేసులు నమోదు చేసినా, కేసు నడుస్తున్న కొలది ఆ ధైర్యం సడలక తప్పడం లేదు. వారికి భరోసా కల్పించే సామాజిక పరిస్థితులు కూడా నెలకొనడం లేదు. పోలీసు అధికారులు కూడా వారిని కేసులో ముందుకు పోకుండా నిరుత్సాహ పరుస్తూ ఉండడం జరుగుతూనే ఉంటుంది.

మరోవంక పలు కేసులలో అత్యాచారాల నిరోధక చట్టంను ఈ కేసులకు వర్తింప చేయడానికి కోర్టులే నిరాకరిస్తున్నాయి. కాగా, పలు కేసులను సాంకేతిక పొరపాట్ల కారణంగా కొట్టివేయడం జరుగుతున్నది. అహ్మదాబాద్‌లోని కౌన్సిల్ ఫర్ సోషల్ జస్టిస్ గుజరాత్‌లోని 16 జిల్లా లలో 1995 నుండి ఈ చట్టం క్రింద ఇచ్చిన 450 కోర్టుల తీర్పులను పరిశీలన జరిపి 95 శాతం కేసులను సాంకేతిక అంశాలపై కొట్టివేసినట్లు కనుగొన్నది.

ఎఫ్ ఐ ఆర్ తో బాధితుల కుల ధ్రువీకరణ పత్రం జత చేయలేదనో, డిఎస్పీ కన్నా తక్కువ హోదాగల పోలీసు అధికారి దర్యాప్తు చేశారనో వంటి సాంకేతిక అంశాల ఆధారంగా కొట్టివేశారు. పొరపాట్లు చేసిన అధికారులపై తగు చర్యలు తీసుకోవచ్చని కోర్టు సూచించవచ్చు. కానీ ఆ సాకుతో నిందితులను వదిలి వేయడం సహజంగానే దళితులలో అభద్రతా భావానికి దారితీస్తుంది.

ఇటువంటి కఠిన చట్టాలను ఆసరా చేసుకొని పలువురు దొంగ కేసులు నమోదుచేసి, బెదిరింపులకు గురిచేసి, అమాయకులను వేధిస్తున్నారని ఆరోపణలు ఈ సందర్భంగా చేస్తున్నారు. చట్టాలను దుర్వినియోగ పరచడం మనదేశంలో అసహజం కానేకాదు. ఆ విధంగా కేవలం ఈ చట్టం ఒక్కటి మాత్రమే దుర్వినియోగం కావడం లేదు. వరకట్న నిషేధ చట్టం, గృహహింస చట్టం, బాలకార్మికుల నిరోధ చట్టం... వంటి అనేక చట్టాలు ఆ విధముగా దుర్వినియోగం అవుతున్నాయి. అమాయకులపై కేసులు నమోదవుతున్నాయి. బలవంతులపై కేసులు నమోదు చేసినా వారు శిక్షల నుండి తేలికగా తప్పించుకొంటున్నారు. ఆ కారణంచేత ఆయా చట్టాలనే నిర్వీర్యం చేయాలనీ కోరడం తగదు.

అటువంటి పరిస్థితులు ఏర్పడడానికి దారితీస్తున్న కారణాలను సింహావలోకనం చేసుకుని, చట్టాలను మరింత సమర్ధవంతంగా అమలు జరిపే మార్గాలను గుర్తించాలి. అందుకు అవసరమైన పరిపాలనా పరమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలి. కానీ అసలు చట్టాలనే నిర్వీర్యం చేయాలి అనుకోవడం ఏమాత్రం సమర్ధనీయం కాదు. మరోవంక, ఇటువంటి అంశాలను రాజకీయాలతో ముడిపెట్టి, రాజకీయ ప్రయోజనం పొందాలను కొనే ప్రయత్నాలు చేస్తుండటం వలన బాధిత వర్గాలకు ఎటువంటి న్యాయం జరుగబోదని గ్రహించాలి.

### 'తెలుగు భాషలో మెలకువలు' పుస్తకావిష్కరణ



చెన్నపురి తెలుగువాణి ఆధ్వర్యంలో 'తెలుగు భాషలో మెలకువలు' పుస్తకావిష్కరణ సభ చెన్నైలో జరిగింది. ఈ సభలో వరుసగా ఎడమనుండి కుడికి డా॥ గుమ్మా సాంబశివరావు, డా॥ టి. సంజీవరావు, ప్రొ॥ ఎల్.బి.శంకరరావు, డా॥ యం.శ్రీనివాస రావు, ఐ.ఆర్.ఎస్. శ్రీ వెన్నెలకంటి, శ్రీ తిరునగరి భాస్కర్‌లు ఉన్నారు

**శిశువు శారీరక వికాసానికి తల్లిపాలు మానసిక వికాసానికి తల్లిభాష**

# శ్రీరామా రూరల్ విద్యాసంస్థల 70 ఏళ్ల ప్రస్థానం



చిలుమూరు (కొల్లూరు) శ్రీరామా రూరల్ విద్యాసంస్థల ప్రస్థానం 70వ వసంతం లోకి అడుగిడుతోంది. 70 సంవత్సరాల కాలంలో శ్రీరామా దినదినాభివృద్ది చెందుతూ జాతీయస్థాయిలో కీర్తి ప్రతిష్టలు పొందింది. 1949లో కొల్లూరు మండలం చిలుమూరులో కోలసాని వెంకటసుబ్బయ్య పేద గ్రామీణ ప్రాంతంలోని పిల్లలకు విద్యాబుద్దులు నేర్పించేందుకు శ్రీరామా గురుకులాన్ని స్థాపించారు. ఎటువంటి రవాణా సౌకర్యాలు లేని కుగ్రామంలో గురుకుల పాఠశాలను స్థాపించడం సాహసోపేత నిర్ణయం. విద్యను గ్రామీణ ప్రాంతంలో వ్యాప్తి చేయాలనే ఆయన కృషి సత్ఫలితాలను ఇచ్చింది. ప్రారంభ సంవత్సరం కేవలం తొమ్మిది మంది విద్యార్థులు విద్య అభ్యసించారు. వారిలో మాజీ హోం న్యాయ శాఖామాత్యులుగా పనిచేసిన ఆలపాటి ధర్మారావు ఒకరు. తర్వాత విద్యా సంవత్సరాల్లో విద్యార్థుల సంఖ్య పెరగడంతో 1953లో సుదూర ప్రాంత విద్యార్థులకోసం హాస్టల్ సౌకర్యం కల్పించారు. 1961లో వెంకట సుబ్బయ్య కుమారుడు మధుసూదనరావు ఎం.ఏ. బి.ఇడి. పూర్తి చేసి సంస్థ సారధ్య బాధ్య తల్లో భాగస్వాములయ్యారు. విద్యా సంస్థ అభి వృద్ధికై ఆయన తన సోదరులు శ్రీరాములు, శ్రీనివాసరావులతో విశేషకృషి చేశారు. విద్యా సంస్థ అభివృద్ధిలో వారి సతీమణులు సైతం చేదోడుగా నిలిచారు. వారు ముగ్గురు ఉపాధ్యాయ వృత్తిలో శిక్షణ పొందారు. ఉన్నత చదువులు అభ్యసించిన వారికి ఆర్థికంగా లబ్ధి చేకూరే ఎన్నో అవకాశాలు వచ్చినా వాటిని తృణ ప్రాయంగా భావించి విద్యాసంస్థ నిర్వహణకు ప్రాధాన్యత ఇచ్చారు. 1977లో వచ్చిన తుఫాన్ తాకిడికి విద్యాసంస్థలో తరగతి గదులు కూలి పోవడంతో వాటి స్థానంలో దశలవారీగా పక్కా భవనాలను నిర్మించారు.

**విలువలతో కూడిన విద్య...**

నిర్దిష్ట ప్రణాళిక, క్రమశిక్షణ కల్గిన ఉపాధ్యాయ బృందంతో రాజీలేని తత్వంతో విలు వలతో కూడిన విద్యను విద్యార్థులకు బోధిం చడమే శ్రీరామ విద్యాసంస్థల లక్ష్యంగా పెట్టు కొంది. ఈ విధానం విద్యార్థుల తల్లిదండ్రులను ఆకట్టుకొనడంతో శ్రీరామా విద్యాసంస్థ పేరు నలుదిశలా వ్యాపించింది. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వందల సంఖ్యలో విద్యార్థులతో విద్యాసంస్థ కళకళలాడింది. గాడితప్పిన విద్యార్థి గాడిలో పడాలంటే శ్రీరామాలో చేర్చాల్సిందే అనే నానుడి విస్తృతంగా ప్రచారమైంది. దీంతో రాష్ట్రంతోపాటు రాష్ట్రేతర ప్రాంతాల నుంచి కూడా ఎంతోమంది విద్యార్థులు వచ్చి చేరారు. వారందరికీ క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించడంతో వారంతా నేడు ఉన్నత స్థాయికి చేరుకున్నారు. విద్యార్థుల ప్రవర్తనను నైతికంగా, సామాజికంగా, కళాత్మకంగా తీర్చిదిద్దడం కోసం మేజరు మధుసూదనరావు పరితపించేవారు. విద్యాసంస్థలోని విద్యార్థులు వెంకటసుబ్బయ్య చౌదరిని నాన్నగారు అని, మేజరును ప్రిన్సిపాల్ అంటూ ఎంతో ఆప్యాయంగా పిలిచేవారు. విద్యాసంస్థకు వచ్చే ప్రతి ఒక్కరికి ముందుగా భోజనం పెట్టాలనే సంప్రదాయాన్ని యాజ మాన్యం ఇప్పటికీ ఆచరించడం విశేషం.

**మూడోతరం వారసుల సారథ్యంలో...**

శ్రీరామా విద్యాసంస్థ ప్రస్తుతం మూడో తరం వారసుల సారథ్యంలో కొనసాగుతోంది. 1980 నుంచి కొలసాని తులసీ విష్ణుప్రసాద్ ఎం.టెక్ చదివి విద్యాసంస్థ నిర్వహణలో తండ్రి మేజర్ మధుసూదనరావుకు తోడు నిలిచారు. ఆయన సోదరులు రమణ, రాజశేఖర్‌లు సైతం ఉన్నత చదువులు చదివినా ఇతర మార్గాలను ఎంచుకోకుండా తాత, తండ్రి లక్ష్యాన్ని కొనసాగించేందుకు నిర్ణయించుకొని విద్యాసంస్థ నిర్వహణలో మమేకం అయ్యారు. వీరందరి సారథ్యంలో విద్యాసంస్థ వివిధ శాఖలుగా విస్త రించింది. ప్రాథమిక పాఠశాల, రెండు ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాల 2003 నుంచి బిఎడ్ కళాశాలను నిర్వహిస్తున్నారు. విద్యా సంస్థలోని ఎంతోమంది విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతిభా పురస్కారాలను అందుకున్నారు.

**సాహిత్య, కళారంగ సేవల్లోనూ...**

విద్యాబోధనతోపాటు సాహిత్య, కళా రంగ సేవలోను విద్యాసంస్థ ముందుంది. అభ్యు దయ రచయితలను కళాకారులను ప్రోత్సహిం చడంతోబాటు, చక్రపాణి, కొలసాని ట్రస్టు, తుమ్మల వెంకట్రామయ్యట్రస్టులను స్థాపించి ఎన్నో కార్యక్రమాలను నిర్వహిస్తోంది. కేంద్ర సాహిత్య అకాడమీతో కలసి చక్రపాణి శత జయంతుత్సవాలను విద్యాసంస్థలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించారు.

**అధునాతన విద్యాప్రమాణాలతో...**

శ్రీరామా విద్యాసంస్థ ఎప్పటికప్పుడు అధునాతన విద్యా ప్రమాణాలను అందిపుచ్చుకుంటూ ముందుకు వెళుతోంది. నూతనంగా సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్‌ను ప్రారంభిస్తోంది. అలాగే వర్చువల్ రియాలిటి ల్యాబ్, స్పోర్ట్స్ అథారిటి, ఎన్‌సిసి, స్కౌట్ అండ్ గైడ్స్, మైక్రోసాఫ్ట్ స్కూల్ ప్రోగ్రాం వంటి విద్యార్థులకు అవసరమైన వాటిని అన్నింటిని విద్యాసంస్థలో అందుబాటులో ఉన్న విద్యాసంస్థ శ్రీరామానే.

**ప్రిన్సిపాల్ కొలసాని తులసీ విష్ణు ప్రసాద్ ఇలా అన్నారు :**

రాష్ట్ర వ్యాప్తంగా 10లోపు గుర్తింపు ఉన్న మైక్రోసాఫ్ట్ విద్యాసంస్థల్లో శ్రీరామా ఒకటి. విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచడానికి ప్రథమ్ బుక్స్ అనే స్వచ్ఛంద సంస్థతో కలసి పనిచేస్తున్నామని శ్రీ కొలసాని తులసీ

# జి.ఓ. చాలదు; చట్టాన్ని తెచ్చి ముఖ్యమంత్రిగారు మాట నిలబెట్టుకోవాలి



తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థను ఏర్పాటు చేయడంపై రాష్ట్ర ముఖ్యమంత్రికి తెనాలి ప్రాంతీయ తెలుగు భాషోద్యమ సమాఖ్యశాఖ ధన్యవాదాలు తెలియజేసింది. జూలై 12న స్థానిక పింఛన్‌దార్ల సంఘ కార్యాయంలో సమావేశమైన తెలుగు భాషోద్యమ సమాఖ్య సభ్యులు తీర్మానాన్ని చేసి, దానికి స్థానిక శాసనసభ్యులు ఆలపాటి రాజాకు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి మాట్లాడుతూ గతంలో లాగా ప్రకటనకే పరిమితం కాకుండా చట్టబద్ధతతో, చిత్తశుద్ధితో కార్యాచరణ జరపాలని కోరారు. తొలుత తీర్మానాన్ని సమాఖ్య గౌరవాధ్యక్షులు డి.ఎల్.కాంతారావు ప్రకటించారు. డాక్టర్ వేమూరి శేషగిరిరావు, డాక్టర్ కొత్త శివరామకృష్ణ, డాక్టర్ వెంకటరెడ్డి, బొల్లిముంత కృష్ణ, చందు నాగేశ్వరరావు తదితరులు పాల్గొని తమ అభిప్రాయాలను తెలిపారు. తీర్మానం ఈ విధంగా ఉంది "ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న "తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ" (తెలుగు డెవప్‌మెంట్ అథారిటీ) ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వు జారీ చేసినందుకు ముఖ్యమంత్రి గారికి, భాషా సాంస్కృతికశాఖ మంత్రిగారికి ధన్యవాదాలు తెలుపుతున్నాము. ఇప్పటి వరకు ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం వల్ల తెలుగును అధికార భాషగాను, బోధనా భాష (మీడియం ఆఫ్ ఎడ్యుకేషన్) గాను వినియోగించుకోవడంలో తక్కిన భాషా రాష్ట్రాల కంటే వెనుకబడి ఉన్నాము. ఎంతో ఉద్యమం తరువాత 2013లో భాషా మంత్రిత్వ శాఖ ఏర్పడి, రాష్ట్ర విభజన తరువాత రెండు తెలుగు రాష్ట్రాలోనూ ఆ శాఖలు ఏర్పడ్డాయి. కానీ తెలుగు అభివృద్ధి ప్రాధికార సంస్థ లేనందున మంత్రిత్వ శాఖకు సరైన విధానం కాని, కార్యక్రమం కాని లేకుండా పోయింది. ఆస్యంగ్గానైనా ఇప్పుడు ప్రాధికార సంస్థను ఏర్పాటు చేస్తున్నందుకు తెలుగు భాషోద్యమ సమాఖ్య గౌరవనీయులు నారా చంద్రబాబు నాయుడుగారికి అభినందనలను తెలుపుతున్నది. జీ.ఓ. ఇవ్వడంతో సరిపెట్టక రానున్న శాసనసభలో ఇందుకై బిల్లును ప్రవేశపెట్టి సమగ్రమైన చట్టాన్ని తేవాలని ప్రాధికార సంస్థకు బాధ్యుల ఎంపికలో ఎటువంటి రాజకీయ ఆశ్రితులకు స్థానం ఇవ్వకుండా, నిపుణులతోనే నిర్మాణం చేయాలని తెలుగు భాషోద్యమ సమాఖ్య ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నది. ఆగస్టు నెల 29వ తేదీన తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ప్రాధికార సంస్థను నెలకొల్పాలని గౌరవనీయ ముఖ్యమంత్రిగారికి విన్నవిస్తున్నది". తెలుగు భాషోద్యమ సమాఖ్య తెనాలి ప్రాంతశాఖ అధ్యక్షుడు డాక్టర్ సామల లక్ష్మణబాబు, కార్యదర్శి యల్లంశెట్టి హనుమంతరావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

---

విష్ణుప్రసాద్ తెలియజేశారు. ఎల్‌కెజి నుంచి అయిదవ తరగతి విద్యార్థులకు క్రిసాలిస్ అనే సంస్థతో కలసి ఉపాధ్యాయుల బోధన నైపుణ్యాలను పెంచడం. తరగతి గదుల్లో మెరుగైన వాతావరణాన్ని సృష్టించే విధంగా పనిచేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి సారిగా వర్చువల్ రియాలిటి బ్యాచ్‌ని ప్రారంభించినట్టు ఆయన తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ క్రీడా విద్యా ప్రాధికార సంస్థ చేత దత్తత తీసుకోబడ్డ రాష్ట్రంలోని 32 విద్యాసంస్థలలో శ్రీరామ ఒకటి. ప్రాంగణంలో ఎన్‌సిసి, స్కౌట్&గైడ్స్ రెండు విశాలమైన క్రీడా ప్రాంగణాలు ఉన్నాయి. నూతనంగా ఇండోర్ ఆడిటోరియం, నూతన వసతి గృహం, గ్రామీణప్రాంతంలో మొట్టమొదటి సారిగా సిబిఎస్ఇ పాఠశాల ప్రారంభించడానికి నిరభ్యంతర పత్రం మంజూరు అయినట్లు ఆయన తెలిపారు. గడచిన సంవత్సరాల్లో రాష్ట్ర ప్రభుత్వం నుంచి 18 ప్రతిభ అవార్డుల, జాతీయస్థాయి విద్యా విషయక మ్యాగజైన్ ఎడ్యుకేషన్ వారు నిర్వహించిన సర్వేలో 2017-18 సంవత్సరానికి రాష్ట్రస్థాయి 4వ ర్యాంక్ ఉత్తమ బోర్డింగ్ స్కూల్‌గా శ్రీరామా ఎంపిక అయ్యింది. అని శ్రీ ప్రసాద్ తెలిపారు.

ఏడు దశాబ్దాలపాటు విజయవంతంగా ఈ ఆదర్శ విద్యాలయాన్ని నడుపుతూ తెలుగు రాష్ట్రానికి పేరు ప్రతిష్ఠలు తెచ్చిన శ్రీ రామా రూరల్ విద్యా సంస్థల నిర్వాహకులకు, ఉపాధ్యాయ బృందానికి, విద్యార్థులకు అందరికీ ఈ సందర్భంగా 'అమ్మనుడి' శుభాకాంక్షలు.

– ప్రత్యేక ప్రతినిధి

## ఓట్లు అడిగేది తెలుగులో...ఉత్తర్వులిచ్చేది ఇంగ్లీషులోనా?

# డిసెంబరు 9: ఆంధ్ర చారిత్రక దినోత్సవంగా ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విన్నపం



ఆంధ్రుల చరిత్రను అవపోసన పట్టి, తెలుగువారి చరిత్రకు ప్రాణం పోసిన కీ.శే. మల్లంపల్లి సోమశేఖర శర్మ (09-12-1991 - 7-1 - 1963) జయంతి రోజు డిసెంబరు 9వ తేదీని "ఆంధ్ర చారిత్రక దినోత్సవం"గా ప్రభుత్వము వారు ప్రకటించి, ఆ రోజు ఆంధ్రుల చరిత్రకు సంబంధించిన కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాలని, ప్రభుత్వానికీ, ప్రజలకూ విజ్ఞప్తి చేస్తున్నాము.

కేవలం మెట్రిక్యులేషన్ విద్యార్హతతో ఆయన ఆంధ్ర విశ్వకళా పరిషత్‌లో చరిత్రశాఖ పాఠాలు బోధించారు. పిహెచ్.డిలు లేని ఆయన మార్గదర్శకత్వంలో ఎన్నో పిహెచ్.డి.లు వచ్చాయి. "రాగిరేకులలో, రాతి ఫలకాలలోని తెలుగుల చరిత్రకు ప్రాణం పోసిన మహా మనిషి" అన్న ఖ్యాతి ఆయనకే దక్కింది. శర్మగారి చారిత్రక దృష్టికి, పరిశోధనా శక్తికి విశ్వనాథ సత్యనారాయణగారు ఆకర్షితులయ్యారు. విశ్వనాథవారు తమ యొక్క "ఆంధ్ర ప్రశస్తి" గ్రంథాన్ని శర్మగారికి అంకితమిచ్చారు. శర్మగారు 'కాశ్మీర రాజుల గాథలు', 'పురాణ వైర గ్రంథమాల' పేరుతో చారిత్రక అంశాల ఆధారంగా నవలలు రాశారు. పాదుకా పట్టాభిషేకం, రోహిణీ చంద్రగుప్త, అరణ్య రోదనం, వంటి నవలలు రాశారు. "ఆంధ్రుల చరిత్ర"ను రచిస్తున్న చిలుకూరి వీరభద్రరావుగారితో కలసి చారిత్రకా ఆ గ్రంథానికి తుదిమెరుగులు దిద్దారు. ఎక్కడ శిలా శాసనం కనపడినా అక్కడికి వెళ్ళి పరిశోధించి శాసనాన్ని పరిష్కరించి ప్రజలకు అర్థ వివరణ ఇచ్చేవారు. ఆ రోజుల్లో ప్రజలు వీరిని 'శాసనాల శర్మ' అనేవారు. చిలుకూరి వీరభద్రరావు, చిలుకూరి నారాయణరావుగార్లతో కలసి "ఆంధ్రేతిహాస పరిశోధక మండలి" ని స్థాపించారు. 'ఆంధ్ర వీరులు', 'ప్రాచీన విద్యాపీఠములు' వంటి పుస్తకాలు రచించారు.

ధర్మవరం, అద్దంకి, కందుకూరు, బెజవాడ శాసనాలను పరిశోధించి అర్థ వివరణ ఇచ్చారు. విలస తామ్రశాసనం, కలవచేరు శాసనం, ప్రోలవరం శాసనాలు ఆధారంగా 1323 - 1336 సం॥ముల మధ్య ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఉన్న సందిగ్ధ సమయాన్ని కూలంకషంగా విశ్లేషించారు. బహమనీ సుల్తానుల కాలం, మహమ్మద్ బీన్ తుగ్లక్ కాలంలో ఆంధ్రులు పడిన కష్టాలను వెల్లడించారు. 8 సం॥ల పాటు కష్టపడి పరిశోధించి 'హిస్టరీ ఆఫ్ రెడ్డికింగ్‌డమ్స్'ను రచించారు. 'హిందూదేశ చరిత్ర', 'ఆంధ్రదేశ చరిత్ర సంగ్రహము', తదితర ముఖ్యమైన గ్రంథాలను రచించారు. కర్నూలు జిల్లా ఎర్రగుడిలోని అశోకుడి శాసనాన్ని పరిశోధించి వివరాలు తెలిపారు. వీరి చారిత్రక పరిశోధనలో ఆ కాలంలో వాణిజ్య వర్తక విశేషాలు, సాహిత్యం, కళలు, ఆహార్యం, సేద్యం, సాంఘిక, మత పరిస్థితులు అన్నింటినీ సమూలంగా పేర్కొనేవారు. అమరావతి, శంకరాచార్య, నందక రాజ్య పతనము, పీష్వా నారాయణరావు, హంపీక్షేత్రం, "ఆంధ్రప్రదేశంలో బౌద్ధము" మున్నగునవి వీరి పరిశోధనాత్మక రచనలు.

కొమర్రాజు లక్ష్మణరావు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, రాయప్రోలు సుబ్బారావు, డా॥ఆచంట లక్ష్మీపతి వంటి వారితో పనిచేసి "ఆంధ్రవిజ్ఞాన సర్వస్వాన్ని" పూర్తి చేయుటకు దోహదపడ్డారు. శర్మగారి అన్వేషణ ఫలితంగా పల్లవ, తెలుగు చోళ, రెడ్డిరాజులు, విజయనగర రాజులు; ఇక్ష్వాక, శాలంకాయన, విష్ణుకుండిన, తూర్పు చాళుక్య, గంగావంశీయులు; కాకతీయ, ముసునూరి వంశజుల శాసనాలను అధ్యయనం చేసి, వివరణలను భారతి పత్రికలో ప్రకటించారు.

లిపి శాస్త్రంలోనేగాక, ఆంధ్రావాస్తు శిల్ప స్వభావం, ప్రతిమలను అధ్యయనం చేయడంలో శర్మగారు నిష్ణాతులు. 'ఎర్లీ హిస్టరీ ఆఫ్ దక్కన్' లో కాకతీయుల చరిత్రను వ్రాశారు. 'మలి పల్లవులు', 'వేంగి చాళుక్యులు', 'వాతాపి చాళుక్యులు', 'కదంబులు', 'త్రిలోచన పల్లవుడు', బౌద్ధమత పరిణామము', 'పాల్కురికి సోమన' వంటి రచనలు శర్మగారు చేశారు.

ఆంధ్రదేశ చరిత్రను సుసంపన్నంగా వెలుగులోకి తెచ్చిన మల్లంపల్లి వారి జయంతిని ప్రభుత్వం వారు గుర్తించి, డిసెంబరు 9వ తేదీని "ఆంధ్ర చారిత్రక దినోత్సవం'గా ప్రకటించ వలసినదిగా ప్రార్థించుచున్నాము.

- స్వర్ణ పాండురంగారెడ్డి

అధ్యక్షుడు : శ్రీనాథ సాహితీ పరిషత్

నరసరావుపేట

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362



# ఏటుకూరి ప్రసాద్‌గారికి తాపీధర్మారావు జీవనసాఫల్య పురస్కారం

ఏటుకూరి ప్రసాద్



'తాపీ ధర్మారావు జీవితం – రచనలు' ప్రామాణికమైన పరిశోధన గ్రంథం. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి 1983లో డాక్టరేట్‌ను పొందిన ఏటుకూరి ప్రసాద్ చేసిన పరిశోధనకు పుస్తకరూపం అది. నాటికీ నేటికీ తాపీధర్మారావు జీవితం, రచనలు అన్న అంశంపై వచ్చిన సమగ్ర గ్రంథం అదే. తాపీ ధర్మారావు అనేక అంశాలపై వ్రాసిన గ్రంథాలు గాక, ఆయన గురించి సమగ్ర అవగాహనకై ఆధారపడదగిన పరిశోధనాత్మక రచన అదే.

తాపీ ధర్మారావుగారితో సాహచర్యం కలిగి వుండడం వల్ల ఏటుకూరి ప్రసాద్‌గారి పరిశోధనకు సాధికారత ఉంది.

'తాపీ ధర్మారావు పురస్కారా'న్ని ఇంతవరకు ఏడుగురు ప్రముఖ రచయితలైన జర్నలిస్టులకు ఇచ్చిన 'తాపీ ధర్మారావు వేదిక' ఇప్పుడు తాపీ ధర్మారావు 'జీవన సాఫల్య పురస్కారాన్ని' ప్రముఖ రచయిత, పత్రికా సంపాదకులు ఏటుకూరి ప్రసాద్‌గారికి ఇవ్వడానికి నిర్ణయించింది. 2018 సెప్టెంబర్ 16 (ఆదివారం) హైదరాబాదులో జరుగనున్న ప్రత్యేక సభలో ఈ పురస్కారాన్ని ఏటుకూరి ప్రసాద్‌గారికి తగు సత్కారం చేసి అందజేస్తాము.

**తేదీ, సమయం : 2018 సెప్టెంబర్ 16 ఆదివారం ఉ॥ గం.10 లకు,**

**వేదిక : ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ కామర్స్ కాలేజి, ద్వారకా హోటలు వద్ద, టెలిఫోన్ భవన్ ప్రక్కన, ఖైరతాబాదు, హైదరాబాదు.**

**ముఖ్య అతిథి:**

**జస్టిస్ శ్రీమతి టి. రజని,**
**ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తి**

సభలో పాల్గొంటున్న పెద్దల పేర్లు తదితర వివరాలు వచ్చేసంచికలో (సెప్టెంబరు 2018) ప్రచురిస్తాము.

అందరికీ ఆహ్వానం

గమనిక :
'చెరగని స్ఫూర్తి తాపీ ధర్మారావు'
(విశిష్ట వ్యాసాల సంకలనం)
పుస్తకం సభవద్ద కొనుగోలు
చేయవచ్చును.
వెల : రూ. 150/-

తాపీ ధర్మారావు వేదిక
'అమ్మనుడి' సంపాదక కార్యాలయం
జి–2, శ్రీవాయుపుత్ర రెసిడెన్సీ,
హిందీ కళాశాల వీధి,
మాచవరం, విజయవాడ–520004.

డా॥ సామల రమేష్‌బాబు
98480 16136
ఇ–మెయిల్ :
samalarameshbabu@gmail.com
editorammanudi@gmail.com

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
August 2018 Vol : 4, Issue 6

Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month

RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/13/2018-20




If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244